మంగళవారం 20-8-2019

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 150



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



**శ్రమించి... శుభారంభం**
ప్రపంచ బ్యాడ్మింటన్ రెండో రౌండ్‌లోకి శ్రీకాంత్, సాయిప్రణీత్, ప్రణయ్ -స్పోర్ట్స్‌లో



**మందగమనమే కానీ..!**
అంత బలహీనమేమీ కాదన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ -బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



## సరిలేరు.. మీకెవ్వరూ!

సరిహద్దులను కంటికిరెప్పలా కాపాడటంతోపాటు దేశంలో ఏ మూలన ఏ సమస్య వచ్చినా మేమున్నామని ప్రాణాలకు తెగించి సేవలు అందించడంలో సైన్యం తీరు ఎప్పుడూ స్ఫూర్తిదాయకమే. ఇలాంటి ఒళ్లు గగుర్పొడిచే ఓ రెస్క్యూ ఆపరేషన్‌ను సోమవారం జమ్మూకశ్మీర్‌లో భారత వైమానిక దళం విజయవంతంగా పూర్తిచేసింది. జమ్మూలోని తావి నదిలో వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు వరద ఉధృతి నుంచి కాపాడుకునేందుకు నిర్మాణంలో ఉన్న ఓ బ్రిడ్జి పిల్లర్ల మధ్యనున్న కాంక్రీటు శ్లాబ్‌పైకి చేరారు. ఈ సమాచారం అందడంతో 25 నిమిషాల్లోనే అక్కడకు భారత వైమానిక దళ హెలికాప్టర్ చేరుకుంది. తొలుత నిచ్చెనతో వారిని కాపాడాలనుకున్నా సాధ్యం కాదని గ్రహించి ఓ గరుడ కమాండోను కాంక్రీట్ శ్లాబ్‌పైకి దించింది. ఆ కమాండో మత్స్యకారులకు రెస్క్యూ జాకెట్లు తొడగడంతోపాటు హెలికాప్టర్ నుంచి జారవిడిచిన తాడు కట్టి.. వారిని క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ఈ కమాండో ఆపరేషన్ వీడియో వైరల్ అవుతోంది.



హెలికాప్టర్ నుంచి తాడు సాయంతో జాలర్లను రక్షిస్తున్న దృశ్యం

▲ సాయం కోసం ఎదురుచూస్తున్న జాలర్లు

# ఇళ్లున్నాయ్.. కొనేవాళ్లే లేరు!

## కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న నిర్మాణ సంస్థలు

- హైదరాబాద్‌లో ముమ్మరంగా నిర్మాణాలు.. మందగమనంలో అమ్మకాలు
- కొనుగోలుదారులు తగ్గుతున్నారంటూ నిర్మాణ సంస్థల ఆందోళన
- విలాసవంతమైన ఫ్లాట్ల ధరలు ఆకాశాన్నంటుతుండటమే కారణం
- దేశవ్యాప్తంగా అమ్మకానికి నోచుకోని సుమారు 8 లక్షల ఇళ్లు
- వీటిలో 4.12 లక్షల ఇళ్లు సరసమైన ధర కోవకు చెందినవే...



**7,97,623**
దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జూన్ వరకు అమ్మకాలకు నోచుకోని ఇళ్లు

**4,13,000**
వీటిల్లో మధ్యతరగతి వర్గాల కోసం సరసమైన ధరల్లో ఉన్న ఇళ్లు

### 'మధ్యతరగతి' ఇళ్ల ధరలు కాస్త అటుఇటుగా..: రూ.45,00,000

ఇళ్ల స్థలాల కొనుగోలుకు మొగ్గుచూపుతున్న ప్రజలు డూప్లెక్స్ విల్లాలు, ఫ్లాట్‌లు కొనడానికి ఆసక్తి చూపడంలేదు. విల్లాలు, ఫ్లాట్‌ల నిర్వహణ వ్యయం భారీగా ఉండటంతో కొనుగోలుదారులు స్థలాలకే ప్రాధాన్యతనిస్తున్నారు.

హైదరాబాద్‌లో మాత్రం అసాధారణంగా పెరిగిన ధరలు రియల్ రంగంపై ప్రభావం చూపిస్తున్నాయి. ఈ రంగంలో పెట్టుబడులు కాసుల వర్షం కురిపిస్తుండటంతో నల్లధనం కూడా వెల్లువలా వస్తోంది. దీంతో భూముల విలువలు అందనంత ఎత్తుకు ఎగబాకాయి.

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య మాత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆషాఢమాసంలో రూ.500 కోట్ల ఆదాయం రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారాప్రభుత్వ ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే గత ఏడాదితో పోలిస్తే 20 శాతం అధికంగా రూ.2,250 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. అంటే అంతా స్థలాలు, సాగు భూముల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

### అమ్ముడుకాని గృహాలు

| | |
|---|---|
| ముంబై | 1,39,984 |
| పుణే | 98,378 |
| అహ్మదాబాద్ | 41,791 |
| కోల్‌కతా | 30,923 |
| గుర్గావ్ | 22,307 |
| బెంగళూరు | 20,146 |
| చెన్నై | 18,709 |
| హైదరాబాద్ | 4,881 |

- వివరాలు 2లో

# నడ్డా.. అబద్ధాల అడ్డా

## రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారం: కేటీఆర్

- కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందేందుకు కుట్ర
- దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో పథకాల అమలు
- 'కూకట్‌పల్లి' సమావేశంలో టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు



హైదరాబాద్

హైదరాబాద్ పర్యటనలో బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా చెప్పినవన్నీ అసత్యాలేనని, అబద్ధాలకు అడ్డాగా ఆయన నామకరణం సార్థకం చేసుకున్నారని టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రాంతమన్నా, ఇక్కడి ప్రజలన్నా గౌరవంలేదని, రాజకీయ లబ్ధి కోసమే కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్నారని అన్నారు. ఇప్పటివరకు ఆ పార్టీలు రాష్ట్రానికి చేసిన మేలు ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు. సోమవారం కూకట్‌పల్లి ఎన్. గార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు రాలేదని, చట్టబద్ధంగా రాష్ట్రాలకు వచ్చే నిధులే వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం.. భక్వాస్ స్కీమ్ అన్నారు. ఆసరా పథకం కింద కేంద్రం రూ.200 కోట్లు ఇచ్చి అంతా తామే ఇచ్చామని ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అందులో కేంద్రం వాటా పప్పు ఉడికిన తర్వాత ఉప్పువేసిన చందంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు తీసుకొచ్చి ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమపడుతున్నారన్నారు.

**ఇక్కడి పథకాలు కాపీ...**

రాష్ట్రం చేపట్టిన పలు పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందన్నారు. రైతు బంధు పథకాన్ని పీఎం కిసాన్ యోజనగా మార్చారన్నారు. మిషన్ భగీరథను గర్ గర్ జల్ పేరుతో అమలుచేస్తున్నారన్నారు. ఈ పథకాలను ఎన్నికల ముందు తీసుకొచ్చారని తెలిపారు. సెంటిమెంట్ పేరుతో దేశ ప్రజలను బీజేపీ మభ్యపెడుతుందని విమర్శించారు. 70 ఏళ్లుగా తెలంగాణ ప్రజల కష్టాలను కాంగ్రెస్, బీజేపీ పట్టించుకోలేదని, రాష్ట్రం వచ్చిన తర్వాతే తమ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతోందన్న విషయాన్ని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న విష ప్రచారాన్ని టీఆర్‌ఎస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు వెళ్లి పార్టీని అంతర్గతంగా బలోపేతం చేయాలని సూచించారు.

**తెలంగాణకు ఎన్నో ప్రశంసలు...**

కమీషన్ కాకతీయ అని, అక్రమాల భగీరథ అంటూ విమర్శలు చేసే బీజేపీ నాయకులు.. ఏం అక్రమాలు జరిగాయో కేంద్ర ప్రభుత్వంతో నేరుగా చూపించాలన్నారు. వారి ఆధీనంలోని నీతి ఆయోగ్ ఇప్పటివరకు తెలంగాణ చేస్తున్న అభివృద్ధికి ఎన్నో ప్రశంసలు అందించిందన్నారు. మిషన్ భగీరథను, కాకతీయను ప్రశంసించి

మిగతా 2వ పేజీలో ▶

# రిజర్వేషన్లకు లోబడే మెడికల్ అడ్మిషన్లు



ఎవరికీ అన్యాయం జరగలేదు
రెండో విడత ప్రవేశాలపై రిట్ కొట్టేసిన హైకోర్టు
జీవో 550పై స్పష్టత ఇస్తే బాగుండేదని వ్యాఖ్య

- వివరాలు 2లో







## ఇదండీ సంగతి



... కరకట్ట అని, డ్రోన్ అని ఏదో రకంగా రోజూ న్యూస్‌లో ఉంటున్నారు.. సంతోషం!

# సర్కారు దవాఖానాలకు రోగుల తాకిడి

- నాలుగో రోజూ నిలిచిన ఆరోగ్యశ్రీ
- ఆస్పత్రుల వారీగా బకాయిలపై సమీక్షిస్తున్న యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ సేవల బంద్ నాలుగో రోజూ కొనసాగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. మరోవైపు బకాయిల విషయంలో ప్రభుత్వం, నెట్‌వర్క్ ఆస్పత్రుల మధ్య నెలకొన్న సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆస్పత్రుల వారీగా బకాయిల వివరాలను నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తన్వా)కు ప్రభుత్వం అందజేసింది. ఈ లెక్కలను అసోసియేషన్ సమీక్షిస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం నిర్వహించ తలపెట్టిన తన్వా అత్యవసర సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొత్తం 236 ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీకి సంబంధించి రూ.3,44,17,50,892 బకాయిలు ఉన్నాయి. ఈజేహెచ్‌ఎస్‌కు సంబంధించి 241 ప్రైవేటు హాస్పిటళ్లకు కలిపి రూ.23,58,28,032 బకాయిలు ఉన్నాయి. ఈజేహెచ్‌ఎస్‌కు సంబంధించి 15 కార్పొరేట్ ఆస్పత్రులకు (టీషా–తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్) రూ.89,99,90,072 బకాయిలు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే ప్రభుత్వం వెల్లడించిన లెక్కతో, తమ లెక్కలు సరిపోలడం లేదని తన్వా ప్రతినిధులు చెబుతున్నారు. తన్వాలోని అన్ని ఆస్పత్రుల నుంచి బకాయిలు లెక్కలు తెప్పిస్తున్నామని, వాటన్నింటినీ క్రోడీకరించి మంగళవారం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రతినిధులు వెల్లడించారు.



# హింసను రెచ్చగొట్టేలా ఇమ్రాన్ వ్యాఖ్యలు

- ఇవి శాంతి స్థాపనకు సహాయకారి కాదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ

- వివరాలు 5లో

# సీఏపీఎఫ్ రిటైర్మెంట్ @ 60

- సీఆర్పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీకి వర్తింపు
- బలగాల మధ్య వ్యత్యాసాన్ని తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు

- వివరాలు 5లో

## క్లుప్తంగా...

### సీఎస్ ఎస్కే జోషికి నీటిపారుదల బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఇకపై పూర్తి నీటిపారుదల శాఖ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం ఆయన భారీ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఇకపై నీటిపారుదల శాఖలోని మిగతా విభాగాలైన చిన్న, మధ్యతరహా నీటిపారు దలతో పాటు భూసేకరణ, పునరావాసం విభాగాలను సైతం పర్యవేక్షించనున్నారు. ఆ శాఖల ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను రెవెన్యూశాఖకు బదిలీ చేసిన నేపథ్యంలో సీఎస్ ఎస్కే జోషికి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభు త్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

### జాయింట్ చెక్‌పవర్‌ను తొలగించాలి

**తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం డిమాండ్**

హైదరాబాద్: పంచాయతీ పరిపాలనలో సర్పంచ్‌కున్న చెక్‌పవర్ హక్కును ఉప సర్పంచ్ కు కూడా కట్టబెట్టిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. జాయింట్ చెక్‌పవర్‌ను తొలగించాలని.. లేనిపక్షంలో సర్పంచ్‌ల సత్తా ఏమిటో చూపుతామని హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం కాచిగూడలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి చెక్‌పవర్‌ను నేరుగా సర్పంచ్‌కే కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం పేరుతో ప్రభుత్వ గ్రామ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. జాయింట్ చెక్ పవర్ విధానం ద్వారా నిర్జీవం చేసిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పదే పదే సర్పంచ్‌లను సస్పెండ్ చేస్తామనడం సరికాదని, సర్పంచ్‌లు ప్రభుత్వం కింద పనిచేసే ఉద్యోగులు కారని స్పష్టం చేశారు.

### వ్యవసాయ శాఖ పద్దులపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ రూపొందుతున్న నేపథ్యంలో వ్యవసాయ, సహకార, పౌర సరఫరాలు, మార్కెటింగ్ తదితర శాఖల వారీగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రాబోయే ఏడాదికి అవసరమైన పూర్తిస్థాయి ప్రణాళికా సిద్ధం చేయాలని, దీనిని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆమోదం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించారు. మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్, విత్తన డైరెక్టర్, సహకార శాఖ, వేర్ హౌసింగ్, ఉద్యాన శాఖ రిజిస్ట్రార్ తదితరులు హాజరయ్యారు.

### బ్యాంక్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సాక్షి, హైదరాబాద్: బ్యాంకింగ్ రంగంలో వివిధ ఖాళీల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఈ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 5 వరకు గన్‌ఫౌండ్రీలోని జామైనిజామియా కాంప్లెక్స్ 3వ అంతస్తులోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. మరిన్ని వివరాలకు 040–23236113 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

### నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర జార్ఖండ్, బిహార్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని పేర్కొంది. ఉత్తర కోస్తా తమిళనాడు, దాని పరిసర ప్రాంతాల్లో 3.1 కి.మీ నుంచి 4.5 కి.మీ మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. సోమవారం పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో 9 సెం.మీ, రామగుండంలో 8 సెం.మీ, మంథనిలో 3 సెం.మీ, జనగాం జిల్లా జనగాంలో 6 సెం.మీ, నర్మెట్టలో 4 సెం.మీ, జఫర్‌గడ్‌లో 3 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 4 సెం.మీ, అశ్వారావుపేట, మణుగూరులో 3 సెం.మీ చొప్పున, కొండపాక (సిద్దిపేట), భూపాలపల్లిలలో 4 సెం.మీ చొప్పున, చెన్నూరు (మంచిర్యాల), మంచిర్యాల, బెజ్జూరు (కొమురం భీం), పరకాల (వరంగల్‌రూరల్), సిర్పూరు (కొమురం భీం), పర్వతగిరి (వరంగల్ రూరల్), దహేగాన్ (కొమరం భీం), హన్మకొండలలో 3 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

### అన్ని జిల్లాలకు వర్తించేలా సీబీఐ కోర్టు

సాక్షి, హైదరాబాద్: సీబీఐ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు తెలంగాణలోని అన్ని జిల్లాలకు వర్తిస్తుందని పేర్కొంటూ న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఇకపై తెలంగాణ జిల్లాల్లోని సంబంధిత కేసులు విచారిస్తుందని, హైకోర్టు సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# 80% విద్యుత్ వివాదాలు కొలిక్కి

- తెలంగాణ, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీల భేటీలో కీలక నిర్ణయాలు
- పరస్పర బకాయిల లెక్కలపై ఏకాభిప్రాయం
- రాష్ట్రానికి ఏపీ రూ. 10,160 కోట్ల బాకీ
- ఏపీకి రూ. 12,650 కోట్లు బాకీపడ్డ తెలంగాణ
- మరో రూ. 4,600 కోట్ల బకాయిలపై నిర్ణయం వాయిదా
- విద్యుత్ ఉద్యోగుల విభజనపై ప్రత్యేక చర్చలకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య వివాదాల పరిష్కారంలో మరో కీలక ముందడుగు పడింది. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో విభజన వివాదాలను పరిష్కరించుకోవాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు తాజాగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య దాదాపు 80 శాతం విద్యుత్ వివాదాలను కొలిక్కి తెచ్చారు. తెలంగాణ, ఏపీ ట్రాన్స్‌కో సంస్థల సీఎండీలు దేవులపల్లి ప్రభాకర్‌రావు, నాగుపల్లి శ్రీకాంత్ హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘంగా సమావేశమై చర్చలు జరిపారు. రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థల మధ్య గత ఐదేళ్లుగా 28 అంశాల్లో వివాదాలు అపరిష్కృతంగా ఉండిపోగా తాజాగా జరిగిన చర్చల్లో ఓ నాలుగైదు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాల పరిష్కారానికి సీఎండీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యుత్ ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజన, పరస్పర విద్యుత్ పంపకాలు, ఒకరికొకరు చెల్లించుకోవాల్సిన రూ. వేల కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలకు సంబంధించిన చిక్కులను ఈ సమావేశంలో పరిష్కరించుకున్నారు. ఉమ్మడి ఆడిట్ అనంతరం ఏపీ నుంచి తెలంగాణకు రూ. 10,160 కోట్లు, తెలంగాణ నుంచి ఏపీకి రూ. 12,650 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ఇరు రాష్ట్రాల అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చారు. విద్యుత్ ఉద్యోగుల విభజనతో ముడిపడి ఉన్న రూ. 4,600 కోట్ల బకాయిలపై నిర్ణయాన్ని వాయిదా వేశారు. విద్యుత్ ఉద్యోగుల విభజన పరిష్కారమైన తర్వాతే ఈ బకాయిలతో పెన్షన్లకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన మరికొన్ని ఆస్తులు, అప్పుల విషయంపై కంప్ట్రోలర్ అండ్ అకౌంటెంట్ జనరల్ డీజీ అభిప్రాయం కోరుతూ ఉమ్మడిగా లేఖ రాయాలని నిర్ణయించారు. ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్లకు ఆడిట్ చేయించిన తర్వాత ఏ రాష్ట్రానికి ఎంత వస్తాయో ఆ మేరకు పంపకాలు జరుపుకోవాలని నిర్ణయించారు.

**త్వరలో ఏపీలో మళ్లీ సమావేశం..**

విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదంపై ప్రత్యేక చర్చలు జరపాలని, సాధ్యమైనంత త్వరగా మరోసారి సమావేశమై మిగిలిన అంశాలను సైతం పరిష్కరించుకోవాలని రెండు రాష్ట్రాల ట్రాన్స్‌కో సీఎండీలు నిర్ణయించారు. త్వరలో విజయవాడలోని ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో తదుపరి సమావేశాన్ని నిర్వహించనున్నారని, దీనికి తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

#### 30న ధర్మాధికారి కమిటీ భేటీ..

విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ కేఎం ధర్మాధికారి ఏకసభ్య కమిటీ ఈ నెల 30న రెండు రాష్ట్రాల విద్యుత్ అధికారులతో సమావేశం కానుంది. విద్యుత్ ఉద్యోగుల విభజనపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. కాగా, జస్టిస్ ధర్మాధికారి కమిటీ ఏపీ, తెలంగాణ జెన్‌కో డైరెక్టర్లు అశోక్‌కుమార్, ఆదినారాయణతో ఏర్పాటు చేసిన ఉప కమిటీ ఈ నెల 28న సమావేశమై చర్చలు జరపనుందని అధికార వర్గాలు తెలిపాయి.

# రిజర్వేషన్లకు లోబడే మెడికల్ అడ్మిషన్లు

- ఎవరికీ అన్యాయం జరగలేదు
- రెండో విడత ప్రవేశాలపై రిట్ కొట్టేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది రెండో విడత ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలు చట్టబద్ధంగా జరిగాయని, రిజర్వేషన్ల అమల్లో తప్పులు జరగలేదని హైకోర్టు తీర్పు చెప్పింది. నిబంధనలకు అనుగుణంగానే ప్రవేశాలు జరిగాయని, రిజర్వేషన్ల అమలు వల్ల ఎవరికీ నష్టం జరగలేదని సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. రెండో విడత వైద్య విద్య ప్రవేశాలను జీవోలు 550, 114 ప్రకారం జరగలేదని పేర్కొంటూ ఆదిలాబాద్ జిల్లా ఎస్.భావన మరో నలుగురు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. దీంతో గతంలో హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల అమలు రద్దయింది. తొలి విడత ప్రవేశాల్లో వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన సీట్లను ఓపెన్ కేటగిరీ ద్వారా భర్తీ చేశాకే రిజర్వేషన్ కోటా భర్తీ చేయాలని జీవోలు స్పష్టం చేస్తున్నాయని, అయితే కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం అధికారులు రెండో విడత సీట్లను ముందుగా రిజర్వేషన్ కేటగిరీ సీట్లను భర్తీ చేసిన తర్వాత ఓపెన్ కోటా సీట్లను భర్తీ చేశారనే వాదన సరికాదని తేల్చింది. అయితే కౌన్సెలింగ్‌లో చట్ట నిబంధనల అమలు విషయంలో విశ్వవిద్యాలయం కొంత మేర నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అనిపిస్తోందని ధర్మాసనం తీర్పులో వ్యాఖ్యానించింది. ‘రెండు విడతల ప్రవేశాలు జరిగాక విశ్వవిద్యాలయం ఇచ్చిన వివరాల్ని పరిశీలిస్తే రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం జరగలేదని స్పష్టం అవుతోంది. 2,487 సీట్ల భర్తీ తర్వాత 1,800 సీట్లు రిజర్వ్‌డ్ అభ్యర్థులకు లభించాయి. ఓసీ అభ్యర్థులకు 687 సీట్లు వచ్చాయి. ఓపెన్ కోటాలో 137, మిగిలిన 1,663 సీట్లు రిజర్వేషన్ కోటాలో రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు సీట్లు దక్కాయి. ఓపెన్ కోటాలో ప్రతిభావంతులైన రిజర్వేషన్ వర్గాలకు చెందిన 440 సీట్ల భర్తీలోనూ తప్పులేమీ కన్పించలేదు’ అని ధర్మాసనం వివరించింది.

#### స్పష్టం చేసి ఉండాల్సింది..

జీవో 550ను 2001లో జారీ చేశారు. ఆ జీవోను పేరా 5 ప్రకారం ఓపెన్ కేటగిరీ సీటు ఎంపిక చేసుకున్న రిజర్వ్‌డ్ కోటా అభ్యర్థి తర్వాత దాన్ని వదులుకుని రిజర్వేషన్ కోటాలో సీటు పొందితే.. ఓపెన్ కోటాలో వదిలిన సీటును సంబంధిత రిజర్వ్‌డ్ కోటా అభ్యర్థితోనే భర్తీ చేయాలి. ఈ నిబంధనలనే ప్రభుత్వం జీవో 114లో పేర్కొంది. ఫలితంగా జీవో 550 రద్దు అయినట్లే. జీవో 114 గురించి ప్రభుత్వం హైకోర్టు, సుప్రీం కోర్టులకు నివేదించింది. ఈ విషయం గురించి విశ్వవిద్యాలయం సీట్ల భర్తీకి నిర్వహించే కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థులకు స్పష్టం చేయలేదు. దీంతో జీవో 550 వినియోగంలో ఉందనే ఆశల్లో పలువురు ఉండిపోయారు. ఈ విషయంలో కాళోజీ వర్సిటీ స్పష్టత ఇచ్చి ఉంటే బాగుండేదని ధర్మాసనం తప్పుపట్టింది.

# నడ్డా.. అబద్ధాల అడ్డా

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధానికి నివేదిక అందించడం జరిగిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పథకాలపై, తెలంగాణలోని సంక్షేమ పథకాలపై వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ఆసరా, రైతు బంధు, ఆరోగ్యశ్రీతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు అవసరమయ్యే పథకాలను అమలు చేస్తోందన్నారు. అంతేకాకుండా అగ్రవర్ణ పేదలకు కూడా ప్రత్యేక పథకాలను అమలు చేయనుందన్నారు.

**కృష్ణారావుకు అభినందన..**

రాష్ట్రంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు, బూత్ కమిటీ మొదలు నియోజకవర్గ కమిటీల వరకు ఏర్పాటు చేసి భారీ యెత్తున కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి ముందంజలో నిలిచిన ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావును కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణకు కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పెట్టనికోటగా నిలుస్తారని కొనియాడారు. అనంతరం మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాసయాదవ్, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల పని అయిపోయిందని టీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీలు కె. నవీన్‌రావు, సుంకరి రాజులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.




ఈమె రెండు ప్రపంచ యుద్ధాలను, 21 మంది అమెరికా అధ్యక్షులను చూసింది.. మేం చెబుతున్నది చిత్రంలోని వృద్ధ మహిళ గురించి కాదు.. ఆమె చేతిలో ఉన్న టామీ అనే ఆ బుల్లి తాబేలు గురించి.. సైజు చూసి మోసపోవద్దు.. ఓసారి దాని ఏజ్ చూడండి.. ఫొటోలో కనిపిస్తోందిగా.. జస్ట్ 121 ఏళ్లు.. ఈ మధ్యే తన బర్త్‌డేను జరుపుకుంది. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వృద్ధ పెంపుడు తాబేలుగా రికార్డుకెక్కింది. బ్రిటన్‌లోని సరి కౌంటీలో ఉంటుంది. 1898లో పుట్టిన టామీని చిత్రంలోని ప్రస్తుత యజమాని షీలా ఫ్లోరిస్ అమ్మమ్మ మార్గరేట్ 1909లో ఒక పౌండుకు కొన్నారు. ఇది మరుగుజ్జు జాతి తాబేలు(హెర్మన్ తాబేలు). 18 సెంటీమీటర్ల కన్నా ఎక్కువ పెరిగిందంటే.. అది ఆ జాతిలో తురుంఖాన్ కిందే లెక్క.. ఈ వయసులోనూ టామీ ఎంతో హుషారుగా ఉంటుందని.. ఇప్పటివరకూ ఒక్కసారి కూడా దీన్ని డాక్టర్ వద్దకు తీసుకెళ్లలేదని షీలా చెప్పారు. అంతేకాదు.. మరో 50 ఏళ్లు నిక్షేపంగా బతికేస్తుందట.

# బీజేపీవి ద్వంద్వ రాజకీయాలు

**ఏఐసీసీ కార్యదర్శి సంపత్**

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ద్వంద్వ రాజకీయాలు చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి, టీఆర్ఎస్ సర్కారు అవినీతిపై ఎప్పుడూ ప్రశ్నించని బీజేపీ.. ఇప్పుడు రాష్ట్రంలో ఏదో జరుగుతున్నట్లు మాట్లాడటం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతికి పాల్పడుతున్నారని ఈ రోజు నడ్డా అంటున్నారని, మరి ఇన్నాళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కళ్లు మూసుకున్నారా అని ప్రశ్నించారు. అవినీతి నిరోధక వ్యవస్థలన్నీ కేంద్రం చేతిలో ఉంచుకుని విచారణ జరిపించకుండా ఏం చేశారని నిలదీశారు. ఇలా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్న బీజేపీ నడ్డిని తెలంగాణ ప్రజలు విరుస్తారని ఎద్దేవా చేశారు. నిజంగా బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమైతే టీఆర్ఎస్ అవినీతిపై వెంటనే విచారణ చేపట్టాలని సంపత్ డిమాండ్ చేశారు. ఒకవేళ వారు అబద్ధాలు మాట్లాడుతుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం నడ్డాతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌లపై కేసులు పెడుతుందా అని ప్రశ్నించారు. సోషల్‌మీడియాలో విమర్శలు చేసే సామాన్యులపై కేసులు పెట్టడం కాదని, కేసీఆర్‌కు నిజంగా చేతనైతే నడ్డా, లక్ష్మణ్‌లపై కేసులు పెట్టాలని ఆయన సవాల్ చేశారు. బీజేపీలో చేరుతున్నదంతా రాజకీయ చెత్తేనని సంపత్ వ్యాఖ్యానించారు.తమ అధినేత్రి సోనియా గాంధీపై విమర్శలు చేసేముందు బీజేపీ అధ్యక్షుడి చరిత్ర ఏమిటో లక్ష్మణ్ తెలుసుకోవాలని, అమిత్ షా రాజకీయ జీవితమంతా రక్తపు మరకలేనన్న విషయాన్ని గమనించాలని అన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా రఘునందన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాఖాపరమైన అంశాలు, ప్రాధాన్యత కలిగిన విషయాల గురించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తీసుకున్నట్టు అధికారవర్గాల సమాచారం. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

# ఇళ్లున్నాయ్.. కొనేవాళ్లే లేరు!

**కొనుగోలు దారుల కోసం ఎదురుచూస్తున్న నిర్మాణ సంస్థలు**

సాక్షి, హైదరాబాద్: రండి బాబు.. రండి... సరసమైన ధరల్లో ఇళ్లు కావాలా.. వెంటనే సంప్రదించండి.. అంటూ నిర్మాణసంస్థలు కొనుగోలు దారుల వెంట పడాల్సి వస్తోంది. స్థిరాస్తిరంగం ఊపు మీదున్నా.. రాష్ట్రంలో గృహ నిర్మాణం రంగం మాత్రం మందకొడిగా నడుస్తోంది. ఫ్లాట్‌ల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నా.. ఫ్లాట్‌ల అమ్మకాలు మాత్రం పడిపోతున్నాయి. దేశ వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండగా, రాష్ట్రంలో కొంత మెరుగ్గానే ఉంది. అయితే ఇక్కడ కూడా కాంక్రీట్ నిర్మాణాల అమ్మకాలు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి. భూముల విలువలు నింగినంటడం, ముమ్మర నిర్మాణాలు, నిర్మాణ వ్యయం పెరగడంతో విల్లాలు, ఫ్లాట్‌ల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఈ ధరలకు అనుగుణంగా కొనుగోళ్లు లేకపోవడంతో గృహాల అమ్మకాల్లో వృద్ధి తగ్గింది. ప్రాప్ టైగర్ అనే సంస్థ చేసిన సర్వేలో ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఈ సర్వే ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో ప్రాజెక్టు, ఐటీ కంపెనీలు, బహుళ జాతి సంస్థల తాకిడితో రాజధాని పరిసర ప్రాంతం రియల్ రంగానికి చోదకశక్తి మారింది. ఇతర మెట్రో నగరాల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్‌తోపాటు చదరపు అడుగు ధరలు కూడా పెరిగాయి. ఈ పరిస్థితి మన దగ్గర తక్కువ కాబట్టి అమ్ముడుకాని ఇండ్ల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో గృహ రుణాల వడ్డీ తగ్గింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచడం వల్ల ఇళ్ల ఖరీదు ఊపందుకుంటుందని నిర్మాణరంగ నిపుణులు అంచనా వేస్తున్నా.. ప్రస్తుతానికి మాత్రం నిలకడ కనిపిస్తోంది.

**నేల చూపులు.. నింగిలో ధరలు**

రెరా చట్టం అమలు.. నిర్మాణ వ్యయం పెరగడం.. డెవలప్‌మెంట్‌లో భూ యజమానికి ఇచ్చే నిష్పత్తి శాతం పెరగడం కూడా ఫ్లాట్‌ల ధరలు అనూహ్యంగా పెరగడానికి కారణం. భూయజమానికి లెక్కకు మించి ఫ్లాట్లు ఇవ్వాల్సి రావడం, గుడ్‌విల్ కూడా చెల్లించాల్సి రావడంతో ఫ్లాట్ల ధరలు పెంచక తప్పడం లేదు. దీంతో నిర్మాణ సంస్థలు తగిన సమయంలో ప్రాజెక్టు పూర్తి చేసేలా అమ్మకాలు జరగడం లేదు. ఈ కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయంలోనూ పెరుగుదల వస్తోంది. ఈ కారణాలన్నింటితో సదరు ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఆ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ల ధరలు క్రమేణా పెంచాల్సి వస్తోంది. ఈ క్రమంలో అమ్మకాల్లో తగ్గుదల కనిపిస్తోందన్నది ఓ ప్రముఖ బిల్డర్ అభిప్రాయం. గతంతో పోలిస్తే కొనుగోలుదారుల్లో అవగాహన పెరగడంతో నిర్మాణ సంస్థ గురించి వాకబు చేస్తున్నారు. అంతకుముందు చేపట్టిన ప్రాజెక్ట్‌ల నాణ్యత, సమయానికి ఇస్తారా.. లేదా.. వంటి విషయాలను తెలుసుకున్న తర్వాతనే కొనేందుకు ముందుకొస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయా? నిబంధనల మేరకు కడుతున్నారా.. లేదా.. తెలుసుకున్న అనంతరం అడుగు వేస్తున్నారు. ఈ మార్పులు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని బిల్డర్లు చెపుతున్నారు. దీంతో పాటు బడా బడా సంస్థలు స్థిరాస్తి వ్యాపారంలోకి రావడంతో భూముల విలువలు ఆకాశన్నంటాయి. ఈ నేపథ్యంలో డెవలపర్లు లాభాపేక్షతో ధరలు పెంచేయడం.. సౌకర్యాలకు తగ్గట్టుగా చదరపు అడుగుల చొప్పున ధరలను నిర్దేశించడంతో ఫ్లాట్‌లు అందుబాటులో లేకుండాపోయాయి. దీనికితోడు గచ్చిబౌలి, మాదాపూర్, చందానగర్, మేడ్చల్, కొంపల్లి, కొండాపూర్, నార్సింగి, మంచిరేవుల, నెక్నాంపూర్, మణికొండ, హైదర్షాకోట్ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల తాకిడితో టెకీలు వ్యయం ఎక్కువైనా ఫ్లాట్‌ల కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో గేటెడ్ కమ్యూనిటీ, బడా సంస్థలు నిర్మించే ప్రాజెక్టుల్లో విల్లాలను కొనేందుకు సంపన్నవర్గాలు, సెలబ్రిటీలు ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఇదే తరహాలో నగరంలోని ఇతర ప్రాంతాల్లో నిర్మిస్తే మాత్రం వాటిని అమ్మడం బిల్డర్లకు తలప్రాణం తోకకు వస్తోంది. ఇక, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనూ గృహ నిర్మాణాలు, అమ్మకాలు ఈ మధ్య కాలంలో తగ్గిపోవడం గమనార్హం.

#### మందగించినా.. ట్రెండ్ మారుతోంది

గ్రేటర్‌హైదరాబాద్‌లో నిర్మాణ రంగం శరవేగంగా పురోగమించడంతోపాటు స్థిరంగా వృద్ధిరేటు సాధిస్తోంది. కొంత కాలంగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు మందగించినప్పటికీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ఐపాస్, ఐటీ, హార్డ్‌వేర్ పాలసీలతో పలు ప్రముఖ సంస్థలు నగరం వైపు దృష్టిసారించాయి. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఆఫీస్ స్పేస్, రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు నగరంలోనే అందుబాటు ధరల్లో ఉన్నాయి.

*– రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు*

### త్వరలో కేసీఆర్ పాలమూరు పర్యటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటించనున్నట్లు మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి పథకం పురోగతిపై ఆయన సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మిగులు ఆయకట్టు ప్రాంతాలకు నీరందించే ప్రతిపాదనలు పరిశీలించాలని, ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా సీఎం పర్యటన నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపైనా ఆయన చర్చించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అధికారులు పాల్గొన్నారు.

### నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతి భవన్‌లో జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మంత్రులు సైతం పాల్గొననున్నారు. కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై కలెక్టర్ల అభిప్రాయాలను సేకరించడంతో పాటు కొత్త పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల అమలు తీరుపై సీఎం సమీక్షించనున్నారు. సమావేశం రెండో రోజు కూడా కొనసాగే అవకాశముంది.

### ప్రముఖ ఆర్థికవేత్తతో వినోద్‌కుమార్ భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సోమవారం బేగంపేటలోని సెస్ కార్యాలయంలో ప్రముఖ ఆర్థికవేత్త, ప్లానింగ్ కమిషన్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు ప్రొఫెసర్ చెన్నమనేని హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అనేక విషయాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందని వారు అభిప్రాయపడ్డారు.

### 29న పీజీ అభ్యర్థుల తొలి జాబితా

హైదరాబాద్: వివిధ యూనివర్సిటీల్లో పీజీ సీట్లు సాధించిన అభ్యర్థుల తొలి జాబితాను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు సీపీజీఈటీ–2019 కన్వీనర్ ప్రొ. కిషన్ సోమవారం తెలిపారు. ఎంట్రన్స్‌లో ర్యాంక్ సాధించి ఇంత వరకు పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోనివారు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకానివారు ఈ నెల 24 వరకు ఆయా వర్సిటీ కేంద్రాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూడవచ్చని పేర్కొన్నారు.

### 22 వరకు దోస్త్ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 22 వరకు నిర్వహించుకోవచ్చని దోస్త్ కన్వీనర్ లింబాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత మార్గదర్శ కాల ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కాలేజీల యాజమాన్యాలకు ఆయన సూచనలు చేశారు.

### దూదేకులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

సాక్షి, హైదరాబాద్: దూదేకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని నూర్బాస్, దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విన్నవించింది. ఈ మేరకు సోమవారం ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను సంఘం అధ్యక్షుడు షేక్ సిద్ధాసాహెబ్, జాతీయ ఇన్‌చార్జి షకీనా కలిసి నూర్బాస్, దూదేకుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. దూదేకుల పిల్లల కులం సర్టిఫికెట్‌లో ఇండియన్ ముస్లిం అనే పేరు వచ్చేలా చూడాలని కోరారు. ప్రతీ జిల్లాలో సంఘానికి భవన నిర్మాణం చేయాలని విన్నవించారు.

## క్లుప్తంగా...

### నడ్డాది దివాళాకోరుతనం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పథకాలపై బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా చేసిన విమర్శలు ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. సోమవారం టీఆర్ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర వైద్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీని మెచ్చుకుని ఇప్పుడు విమర్శిస్తుండటం నడ్డా ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తోందని విమర్శించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును నడ్డా చదివారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతల ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కమలనాథుల మాటల్లో సామ్రాజ్య వాద విస్తరణ ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. తమ పాలనలో లేని రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.





### మైనారిటీ కమిటీ సభ్యులుగా రంజిత్‌రెడ్డి, సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర స్థాయి మైనారిటీ సంక్షేమ కమిటీ సభ్యులుగా టీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఉత్తర్వులిచ్చారు. పీఎం జనవికాస్ పథకం కింద మైనారిటీల సంక్షేమానికి ఉద్దేశించిన 15 పాయింట్ల కార్యక్రమం అమలును వీరు పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ నిర్దేశించిన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పక్కదారి పడుతున్న మైనారిటీ సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు దక్కేలా కృషి చేస్తానని చెప్పారు.

### పులిచింతల ముంపు బాధితులను ఆదుకోండి



సాక్షి, హైదరాబాద్: పులిచింతల ప్రాజెక్టు వరద ముంపునకు గురైన హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లోని బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషిని కలసి వినతిపత్రం అందజేశారు. మట్టపల్లిలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరద ముంపునకు గురైందని, ఈ ఆలయ పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కృష్ణా నది ముంపునకు గురైన పాలకవీడు మండలంలోని 4 గ్రామాలకు చెందిన 730 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ఈ మేరకు పరిహారం చెల్లించాలన్నారు. పులిచింతల ప్రాజెక్టు కింద భూసేకరణకు గాను మఠంపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన 27 గిరిజన కుటుంబాలకు రూ.2 కోట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. చింతలపాలెం మండలంలోని అడ్లూరు, రేబల్లె, చింత్రియాల గ్రామాల లిఫ్ట్ పథకాలను వేరే ప్రాంతాలకు తరలించేందుకు పనులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పాదయాత్రకు అనుమతివ్వండి



సాక్షి, హైదరాబాద్: ఉదయ సముద్రం–బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకం సాధన కోసం ఈ నెల 26 నుంచి 29 వరకు పాదయాత్ర చేపట్టేందుకు అనుమతివ్వాలని డీజీపీని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు డీజీపీని కలసి వినతిపత్రం అందజేశారు. ఉదయ సముద్రం ఎత్తి పోతల పథకానికి 2007 జూన్‌లో రూ.690 కోట్లు మంజూరయ్యాయని, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు సరిగా ఇవ్వకపోవడం వల్ల పనులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. దీంతో రైతులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పాదయాత్ర చేయాలని నిర్ణయించామని, పాదయాత్రకు అనుమతివ్వాలని కోరారు.

### యూరియా ఇవ్వండి..



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్న నేపథ్యంలో గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగు పెరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణకు వెంటనే యూరియాను విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. తెలంగాణకు యూరియా కోటాను కేటాయించారని, అయితే తెలంగాణలో యూరియా కొరత ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు కేటాయించిన కోటా నుంచి యూరియాను అందజేయాలని లేఖలో పేర్కొన్నారు.





ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తా సుఖేందర్‌రెడ్డికి సోమవారం ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు తదితరులు

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

- వృత్యంతర నైపుణ్య అవగాహన కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం
- నిష్ట పేరుతో ఈ నెల 22 నుంచి ప్రారంభం
- రాష్ట్రం నుంచి 95 వేల మంది టీచర్లకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు వృత్యంతర నైపుణ్య అవగాహన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కార్యాక్రమాన్ని 'నిష్ట'పేరుతో అమల్లోకి తెచ్చింది. దీనిలో భాగంగా ఈ నెల 22 నుంచి దేశవ్యాప్తంగా శిక్షణ తరగతులు ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా 42 లక్షల మందికి శిక్షణ ఇస్తుండగా.. ఇందులో రాష్ట్రం నుంచి 95 వేల మంది శిక్షణ పొందనున్నారు. ఈ కార్యక్రమం కోసం కేంద్రం 12 మాడ్యూళ్లను రూపొందించింది.

**శిక్షణనిచ్చేందుకు 1,026 కీ రిసోర్సు పర్సన్లు..**

రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు 1,026 కీ రిసోర్సు పర్సన్లను కేంద్రం నియమించింది. ఈ శిక్షణ కార్యక్రమాలకు ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే టీచర్లు హాజరు కావాల్సి ఉంటుంది. ఒక్కో ఉపాధ్యాయుడికి 6 రోజులపాటు శిక్షణ తరగతులుంటాయి. ఇందులో 5 రోజులు సబ్జెక్టు, ఒకరోజు లీడర్‌షిప్‌పై శిక్షణ ఇస్తారు. అయితే నిష్ట కార్యక్రమంపై సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ స్టడీస్ అండ్ సర్వీస్ చైర్మన్‌నాగటి నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ టీచర్లకు శిక్షణ ఏంటని, చౌకబారు పథకాలతో నాణ్యమైన విద్య సాధ్యం కాదన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెంచాలని, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# అవినీతిపై ఉలికిపాటెందుకు?

- కాళేశ్వరంపై డీపీఆర్ లేకుండానే టెండర్లు పిలవలేదా?
- టీఆర్ఎస్‌పై బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు లక్ష్మణ్ ధ్వజం
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే ప్రాజెక్టుల అవినీతిపై ఆధారాలిస్తాం
- కేటీఆర్ స్థాయి మరిచి నడ్డాపై విమర్శలు చేస్తున్నారు
- బీజేపీలో చేరికలను చూసి జీర్ణించుకోలేకపోతున్నారు
- ఆరోగ్యశ్రీ బకాయిల నిలుపుదల, అంగన్‌వాడీలకు పాలు, గుడ్ల కోత
- ప్రతిరంగంలో రాష్ట్రం వెనకబడుతోందని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందంటే టీఆర్ఎస్ ఎందుకు ఉలికిపడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు మిషన్ కాకతీయ అనేకంటే.. కమీషన్ కాకతీయ అంటేనే బాగా అర్థమవుతోందని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్రకార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ పనులను గతంలోనే 50% పనులను చేశారని, గతంలో చేసిన పనులకే బిల్లులు తీసుకున్నారని 2017లో కాగ్ వెల్లడించింది వాస్తవం కాదా? అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఇది అధికారంలో ఉన్న వారి 6% కమీషన్ల కోసమేనన్నారు. ఈ అవినీతిని ప్రశ్నించినందుకే టీఆర్ఎస్ నేతలు జంకుతున్నారన్నారు. కాళేశ్వరంలో అవినీతి లేకపోతే డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) లేకుండానే ఎందుకు టెండర్లకు వెళ్లారని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంత వ్యయం, ఎంత సాగు, కరెంటుకోసం వెచ్చిస్తున్నదెంత? అనే వివరాలు చెప్పకుండా ఇన్ని వేల కోట్లు ఖర్చు చేస్తే ఒక్క ఎకరమైనా సాగులోకి వచ్చిందా? అని ప్రశ్నించారు. రాష్ట్రం లంచగొండితనం, అవినీతిలో నంబర్‌వన్‌గా మారిందన్నారు. 2018లో 'కరప్షన్ ఇన్ పబ్లిక్ సర్వీసెస్'అనే సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో తెలంగాణ రెండో స్థానంలో ఉన్న విషయాన్ని ప్రజలు మరిచి పోలేదన్నారు. మున్సిపల్ శాఖమంత్రిగా కేటీఆర్ స్వయంగా 2% కమీషన్ తీసుకొమ్మని చెప్పారంటూ.. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ బహిరంగంగా చెప్పడం వాస్తవం కాదా? అని ఆయన అడిగారు. తెలంగాణలో ప్రభుత్వ అవినీతిని దమ్ముంటే రుజువు చేయాలంటూ అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారన్న లక్ష్మణ్.. హెచ్చులకు పోవద్దని, మెక్కిందంతా కక్కించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బాలికల హైజీన్‌లో ప్యాక్‌లకు సంబంధించిన టెండర్లలో అవినీతి జరగడంతో.. కోర్టు టెండర్లు నిలిపివేయడం నిజం కాదా? అని పశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి పనులను ఒక్కొక్కటిగా బయటకు తీస్తే బండారం బయటపడుతుందన్నారు. అవినీతిపై రుజువులు కావాలంటే విద్యుత్తు టెండర్లు, నీటి ప్రాజెక్టుల ఖర్చులపై.. దమ్ముంటే ఒక సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, అప్పుడు ఆధారాలు బయట పెడతామని లక్ష్మణ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ గారడీ విద్యలు ఇక తెలంగాణలో సాగవన్నారు. రాష్ట్రంలో కుటుంబ పోకడలు, అవినీతిని ఎండగడుతామన్నారు. నడ్డా వస్తే ఉలిక్కిపడుతున్నారన్నారు. ఇకపై నెలకోసారి అమిత్‌షా, కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వస్తారన్నారు. దీంతో టీఆర్ఎస్ నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందన్నారు. బీజేపీ.. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్ నుంచి చేసే పార్టీ కాదని, ప్రజల్లో ఉండే పార్టీ అని లక్ష్మణ్ పేర్కొన్నారు. విమోచన దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు.

**జీర్ణించుకోలేకపోతున్నారు..**

బీజేపీ బహిరంగ సభ విజయవంతం కావడం, బీజేపీలోకి చేరికలను చూసి టీఆర్ఎస్ నాయకుల పీఠం కదిలిపోతోందని లక్ష్మణ్ అన్నారు. బీజేపీ ఎదుగుదలను అధికార పార్టీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. విద్యార్థి ఉద్యమాలు చేసి వచ్చిన వ్యక్తి నడ్డాపై కేటీఆర్ తన స్థాయి మరచి విమర్శలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ కుమారునిగా పుట్టకపోతే ఆయనెక్కడ? ఆయన చరిత్ర ఎక్కడని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. కేటీఆర్‌లా నడ్డా ప్యారాచూట్ నేత కాదని.. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాలు చేయడం లేదన్నారు. ఒక ప్రాంతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు.. ఓ జాతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరు తెలియలేదంటే రాజకీయాల్లో ఉండాలో? లేదో తేల్చుకోవాలన్నారు. నడ్డా ఎవరో అని మాట్లాడటం అధికార దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. టీఆర్ఎస్ కేవలం తండ్రీకొడుకుల పార్టీ అని పేర్కొన్నారు. బీజేపీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 18 మంది అధ్యక్షులయ్యారని లక్ష్మణ్ పేర్కొన్నారు. టీఆర్ఎస్‌లో బయటివారి పార్టీ పగ్గాలు ఇవ్వడం సాధ్యమా? అని ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబానికి భజనపరులైన కొందరు మంత్రులు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలవుతోందని.. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదని ప్రైవేటు ఆసుపత్రులు సేవలు నిలిపివేయడం పేదలను సర్కారు మోసం చేయడమేనన్నారు. బీజేపీ చేసిన అవినీతి విమర్శలు అబద్ధమైతే.. చిన్న కాంట్రాక్టర్లకు ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని, వాహనాలకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. డిస్కంలు దివాలా తీసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీలకు గుడ్లు, పాలు ఎందుకు కోత పెట్టారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు ఇనుగాల పెద్దిరెడ్డి, విజయ రామారావు, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సుధాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మూడోవిడత మెడికల్ కౌన్సెలింగ్..

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఆరోగ్య వర్సిటీ.. నేటినుంచి వెబ్ ఆప్షన్లు
- ఇంతవరకూ కాలేజీల్లో చేరని విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు అనర్హత
- మొదటిసారిగా అగ్రవర్ణ పేదల 190 సీట్లకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య ప్రవేశాలపై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయింది. మూడో విడత కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండో విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌పై ఇచ్చిన స్టేను, సోమవారం హైకోర్టు ఎత్తివేసిన వెంటనే వర్సిటీ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. రెండోవిడత కౌన్సెలింగ్ తర్వాత విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లు, స్పెషల్ కేటగిరీ (ఎన్‌సీసీ, సీఏపీ) సీట్లు, నేషనల్ పూల్‌లో మిగిలిపోయి రాష్ట్ర కోటాలోకి వచ్చిన సీట్లతో కలిపి సుమారు 500 సీట్లకుపైగా ఈ కౌన్సెలింగ్‌లో భర్తీ చేయనున్నారు. కొత్తగా దరఖాస్తు ప్రక్రియను పెట్టకుండా, జూలై 16న ప్రకటించిన మెరిట్ జాబితా ప్రకారం నేరుగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మంగళవారం (ఆగస్టు 20) ఉదయం 10 గంటల నుంచి 22న ఉదయం 11 గంటల వరకూ వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువిచ్చారు. ఇది వరకే సీటు పొంది కాలేజీల్లో చేరిన విద్యార్థులు, కోర్సు మార్చుకోవాలనుకునే విద్యార్థులు సైతం వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని వర్సిటీ సూచించింది. అయితే, రెండోవిడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో సీట్లు పొందినప్పటికీ, కాలేజీల్లో చేరని విద్యార్థులు, చేరిన తర్వాత డిస్కంటిన్యూ చేసిన విద్యార్థులు ఈ కౌన్సెలింగ్ పాల్గొనేందుకు అనర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆలిండియా కోటా కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు సైతం ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అనర్హులని స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీలకు కేటాయించిన 190 అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్) సీట్లను ఈ కౌన్సెలింగ్‌తోనే భర్తీ చేయనున్నారు. జూలై 16న ప్రకటించిన మెరిట్ జాబితాలో ఈడబ్ల్యూఎస్ సీట్లకు అర్హులుగా పేర్కొన్నవారంతా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని వర్సిటీ వీసీ కరుణాకర్ రెడ్డి సూచించారు. మొదటిసారిగా ఈడబ్ల్యూఎస్ సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతుండటం విశేషం.

### ఆగస్టు 31 నాటికి ప్రవేశాలు పూర్తి

సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆగస్టు 31 నాటికి వైద్య విద్య ప్రవేశాలు ముగించాలి. ఆ రోజు తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించడానికిగానీ, కాలేజీల్లో చేరడానికి అవకాశముండదు. ఒకవేళ సీట్లు మిగిలిపోయినా, ఆ సంవత్సరానికి అవి వృథా కావాల్సిందే. ఈ నేపథ్యంలో మొత్తం ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయడానికి కాళోజీ వర్సిటీకి మిగిలింది ఇంకా పదకొండు రోజులే. ఇప్పటివరకూ కన్వీనర్ కోటా రెండు విడతలు, మేనేజ్‌మెంట్ కోటా మొదటి విడత కౌన్సెలింగ్ మాత్రమే పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడోవిడత కన్వీనర్ కోటా షెడ్యూల్ విడుదలైంది. అయితే, ఆగస్టు 22 వరకూ వెబ్‌ఆప్షన్లకు గడువు ఉండగా, ఆ తర్వాత ఒకట్రెండు రోజుల్లోనే సీట్లు కేటాయించే అవకాశముంది. సీట్లు పొందిన విద్యార్థులకు కాలేజీల్లో చేరేందుకు 2, 3 రోజుల సమయం ఇవ్వనున్నారు. ఈ లోగానే మేనేజ్‌మెంట్ కోటా రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసి, దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. ఇంతకుముందులా ఒక రౌండ్ తర్వాత మరో రౌండ్‌గాకుండా, ఓ రౌండ్ చివర్లోనే మరో రౌండ్‌కు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

## గవర్నర్ నరసింహన్‌కు స్వల్ప అస్వస్థత

- తల్లి పిండ ప్రదాన కార్యక్రమం కోసం గయ వెళ్లిన గవర్నర్
- ఒకరోజు కఠిన ఉపవాసం ఉండటంతో వాంతులు
- మగధ్ వైద్య కళాశాలలో చికిత్స తర్వాత ఢిల్లీకి పయనం

సాక్షి, న్యూఢిల్లీ: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గతేడాది మరణించిన తన తల్లి పిండ ప్రదాన కార్యక్రమం కోసం భార్య విమలా నరసింహన్‌తో కలిసి ఆయన బిహార్‌లోని గయ వెళ్లారు. సంప్రదాయం ప్రకారం పిండ ప్రదాన కార్యక్రమంలో భాగంగా ఒకరోజు ముందు నుంచి కఠిన ఉపవాసం ఉన్నారు. సోమవారం పిండ ప్రదాన కార్యక్రమంతోపాటు పలు పూజల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా వాంతులు చేసుకున్నారు. దీంతో అధికారులు ఆయన్ను స్థానిక మగధ్ వైద్య కళాశాలకు తరలించి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎలాంటి సమస్య లేదని నిర్ధారించారు. రక్తపోటు, పల్స్ నార్మల్‌గా ఉండటంతో గవర్నర్ వ్యక్తిగత వైద్యుడ్ని సంప్రదించి డిశ్చార్జ్ చేసినట్టు వైద్య కళాశాల డిప్యూటీ సూపరింటెండెంట్ తెలిపారు. అనంతరం అక్కడి నుంచి గవర్నర్ దంపతులు సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశం కానున్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం గవర్నర్ల సదస్సును నిర్వహించనుంది. దేశంలోనే సీనియర్ గవర్నర్ అయినందున నరసింహన్ సలహాలు, సూచనలు స్వీకరించేందుకు రాష్ట్రపతి ఆయన్ను ఆహ్వానించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా గవర్నర్ సమావేశమయ్యే అవకాశం ఉంది.

## రాహుల్‌గాంధీకి 'గ్రీన్ చాలెంజ్'

ఎంపీ సంతోష్ ద్వారా మిథున్‌రెడ్డికి, సుప్రియా సూలే నుంచి రాహుల్‌గాంధీకి..

సాక్షి, హైదరాబాద్: పచ్చదనం పెంచే లక్ష్యంతో మొదలుపెట్టిన గ్రీన్ చాలెంజ్ కొత్త పుంతలు తొక్కుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చేరింది. గ్రీన్ చాలెంజ్ మొక్కల లక్ష్యం రెండు కోట్లకు చేరిన సందర్భంగా మరోసారి మొక్కనాటిన టీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌కుమార్, మరో నలుగురికి మొక్కలు నాటే చాలెంజ్ విసిరారు. వైఎస్సార్ సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సినీనటుడు అఖిల్ అక్కినేని, జీఎమ్మార్ అధినేత మల్లికార్జున్‌రావులను మొక్కలు నాటాల్సిందిగా సంతోష్ కోరారు. వెంటనే దీనిని అంగీకరిస్తూ అఖిల్, మిథున్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రావు ట్విట్టర్లో పోస్టు పెట్టారు. మల్లిఖార్జునరావు స్వయంగా మొక్కను నాటి హరితహారంపై తన ఆకాంక్షను వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరిస్తున్నానని, తిరిగిరాగానే మొక్కలు నాటుతానంటూ, తన తరుపున మరో ముగ్గురిని నామినేట్ చేశారు. అందులో మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే కూడా ఉన్నారు. మిథున్‌రెడ్డి చాలెంజ్‌ను స్వీకరించిన సుప్రియా ఇవాళ తన నియోజకవర్గం పరిధిలోని జిల్లా పరిషత్ స్కూల్లో మొక్కలు నాటారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని తాను నామినేట్ చేస్తున్నట్లు సుప్రియ ట్వీట్ చేశారు. ఈవిధంగా గ్రీన్ చాలెంజ్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చేరింది.

## 22న దివ్యాంగుల కోటా కౌన్సెలింగ్

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ వెల్లడి

హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో, వ్యవసాయ, వెటర్నరీ డిగ్రీ కోర్సుల్లో దివ్యాంగుల రిజర్వేషన్ కోటాలోని సీట్ల భర్తీ కోసం గురువారం (22న)కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. వివిధ విభాగాల డాక్టర్ల బృందం, డీన్స్ కమిటీ అభ్యర్థులు విద్యార్థుల అర్హతలను, సామర్థ్యాలను పరిశీలిస్తారని చెప్పారు. వివిధ డిప్లొమా కోర్సులకు, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు (బైపీసీ స్ట్రీమ్) ఆన్‌లైన్‌లో పీహెచ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే హాజరుకావాలని వెల్లడించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజు డబ్బులతో రావాలని అభ్యర్థులకు సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను (www.pjtsau.edu.in) సంప్రదించవచ్చన్నారు.

**వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన సీట్ల భర్తీ..**

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ వివిధ డిప్లొమా కోర్సుల్లో (వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన) సీట్ల భర్తీ కోసం ఈ నెల 22న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సుధీర్‌కుమార్ తెలిపారు. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆఫీసర్స్ సమక్షంలో కౌన్సెలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నిర్ణీత ఫీజు డిప్లొమా కోర్సులకు రూ.12,200 (యూనివర్సిటీ పాలిటెక్నిక్స్), రూ.16,600 (ప్రైవేటు పాలిటెక్నిక్స్), డిగ్రీ కోర్సులకు రూ.36,450తో హాజరుకావాలన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రాధాన్యతలను సూచిస్తారన్నారు. తర్వాత సీట్లను ప్రాధాన్యతల ఆధారంగా, టీఎంసెట్–2019 ర్యాంకుల ప్రకారం భర్తీ చేస్తామని వెల్లడించారు.

# ఎత్తలేక కడలిపాలు

- పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం
- మూడో లిఫ్టు గుడిపల్లిగట్టులో ఐదు పంపుల్లో నడుస్తున్నవి మూడే
- మరో రెండు మోటార్లకు అందని నీరు... దీని కిందే 3.50 లక్షల ఎకరాల ఆయకట్టు
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో టన్నెల్ లైనింగ్ పనులు
- వృథాగా సముద్రంలో కలుస్తున్న కృష్ణా వరద



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ పరుగులు పెట్టించిన ప్రాజెక్టుల్లో ఒకటైన పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో పని చేయలేక చతికిలపడుతోంది. ఓవైపు ఎగువ నుంచి కృష్ణా వరదలు పోటెత్తుతుంటే పంపులు పూర్తిస్థాయిలో పనిచేయక వరదను ఎత్తిపోయడం కష్టసాధ్యమవుతోంది. జిల్లాలోని 4.24 లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు లక్ష్యం పనులు పూర్తి కాని కారణంగా సాధ్యపడేలా కనిపించడం లేదు.

**ఎత్తిపోయలేక పాట్లు...**

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా నీటిని తీసుకుంటూ కల్వకుర్తి ద్వారా సుమారు 4 లక్షల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించగా ప్రాజెక్టు మొత్తాన్ని మూడు దశలుగా విడగొట్టారు. ఇందులో కొల్లాపూర్ ఒకటో దశ లిఫ్టు కింద 13 వేల ఎకరాలు, జొన్నలబొగడ రెండో దశకింద 47 వేల ఎకరాలు, మూడో దశ గుడిపల్లెగట్టు కింద 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా చేపట్టారు. ప్రస్తుతం ఒకటి, రెండో దశ లిఫ్టుల్లో 800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే ఐదేసి మోటార్లుపని చేస్తున్నాయి. అత్యంత కీలకమైన మూడో దశ కింద 42.80 కిలోమీటర్ల మేర నీటిని తరలించేందుకు పంప్‌హౌస్, రిజర్వాయర్‌లను నిర్మించేందుకు 2005–06లో కాంట్రాక్టు సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. 13 మెగావాట్ల సామర్థ్యంగల ఐదు పంపులు 800 క్యూసెక్కుల నీటిని 117 మీటర్ల ఎత్తుకు పంప్ చేసేలా డిజైన్ చేశారు. ఈ పనులను 2010లోగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే ప్రాజెక్టు పనుల్లో జాప్యం దృష్ట్యా ప్రభుత్వం గడువు పెంచుతూ పోయింది. అయినప్పటికీ ప్రాజెక్టుల పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. మూడో లిఫ్టులో ఇంకా 1.2 కిలోమీటర్ల మేర టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉన్నా ఈ సీజన్‌లో కేవలం కాంట్రాక్టు సంస్థ 600 మీటర్లు మాత్రమే పూర్తి చేసింది. మరో 600 మీటర్ల మేర పెండింగ్‌లో ఉంది. దీంతో పంప్ హౌస్‌లో నిర్మించిన సర్జ్‌పూల్‌కు సరిపడినంత నీటిని తరలించడం సాధ్యం కావట్లేదు. ప్రస్తుతం ఇక్కడ 800 క్యూసెక్కుల నీటిని తోడే సామర్థ్యం గల 5 పంపుల్లో నిన్నమొన్నటి వరకు కేవలం రెండు మాత్రమే పనిచేయగా సోమవారం నుంచి మూడో పంపును ప్రారంభించారు. నాలుగు, ఐదో పంపును ప్రారంభిస్తే సర్జ్‌పూల్‌లో నీటిమట్టం పడిపోతోంది. దీంతో వాటిని ఆన్ చేయడం సాధ్యపడట్లేదు. దీంతో కేవలం మూడు పంపుల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటినే తరలిస్తున్నారు. అంటే ఒక్క టీఎంసీ నీటిని తోడాలంటే ఈ పంపుల ద్వారా ఐదు రోజులు పట్టనుంది. అదే మరో రెండు పంపులు ప్రారంభమై ఉంటే రెండున్నర రోజులే సరిపోయేది. ప్రస్తుతం ఎత్తిపోస్తున్న నీటితో దీని కింద ఉన్న 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఎలా నీరందిస్తారన్నది అంతుబట్టడం లేదు. అయితే గతేడాది మే వరకు శ్రీశైలం నుంచి కల్వకుర్తి ద్వారా నీటిని ఎత్తిపోయడంతో టన్నెల్ లైనింగ్ పనులు చేయలేకపోయారని, కేవలం జూన్, జూలైలోనే వర్కింగ్ టైమ్ దొరకడంతో పనులు పూర్తి కాలేదని ప్రాజెక్టు వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వరద కొనసాగుతున్న సమయంలో నీటిని తరలించలేకపోవడంతో నీరంతా వృథాగా సముద్రంలో కలుస్తోంది. ఇప్పటికే సాగర్, పులిచింతలను దాటి 200 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలిశాయి. ఈ పరిస్థితుల్లో పంపులు పూర్తిస్థాయిలో పనిచేయలేకపోవడం ఆయకట్టు లక్ష్యాలకు శరాఘాతమే.

# హింసను రెచ్చగొట్టేలా ఇమ్రాన్ వ్యాఖ్యలు

**ఇవి శాంతిస్థాపనకు సహాయకారి కాదు • ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్తాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. దాదాపు 30 నిమిషాల పాటు సాగిన ఈ సంభాషణలో మోదీ మాట్లాడుతూ..'ఈ ప్రాంతానికి చెందిన కొందరు నేతలు భారత్‌కు వ్యతిరేకంగా హింసను రెచ్చగొట్టేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇది శాంతిస్థాపనకు ఎంతమాత్రం సహాయకారి కాదు. దక్షిణాసియాలో శాంతిస్థాపన కోసం ఉగ్రవాదం, హింసలేని వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరముంది. అందులోభాగంగా సీమాంతర ఉగ్రవాదాన్ని పూర్తిగా నియంత్రించాలి. దీంట్లో ఎలాంటి మినహాయింపులు ఉండకూడదు' అని వ్యాఖ్యానించారు. ఉగ్రబాటను వీడి పేదరికం, నిరక్షరాస్యత, వ్యాధులపై పోరాడే ఏ దేశానికైనా భారత్ పూర్తి సహాయసహకారాలు అందజేస్తుందని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, స్వతంత్ర, సురక్షితమైన అఫ్గానిస్తాన్ కోసం తాము కట్టుబడి ఉన్నామని తేల్చిచెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో భారత ప్రభుత్వాన్ని ఫాసిస్టు, జాత్యహంకారిగా ఇమ్రాన్ అభివర్ణించడం తెల్సిందే. భారత అణ్వాయుధాలపై దృష్టి సారించాలని ఆయన ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు. దీంతో ఇమ్రాన్ ఖాన్‌కు ఫోన్‌చేసిన ట్రంప్ చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇది జరిగిన రెండ్రోజులకే ట్రంప్ భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, ఈ విషయమై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. మోదీ, ట్రంప్‌ల మధ్య చర్చలు సహృద్భావ వాతావరణంలో, ఫలప్రదంగా సాగాయని ఓ ప్రకటనలో తెలిపింది. ఇరుదేశాల అధినేతలు దాదాపు 30 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారని వెల్లడించింది. 'ఈ టెలిఫోన్ సంభాషణ సందర్భంగా జపాన్‌లోని ఒకాసాలో గత జూన్‌లో జరిగిన జీ–20 భేటీని మోదీ గుర్తుచేశారు. ఈ సమావేశంలో కుదిరిన అంగీకారం మేరకు భారత్–అమెరికాలకు చెందిన వాణిజ్య మంత్రులు త్వరగా సమావేశమై ఇరు దేశాలకు లబ్ధి కలిగేలా ఒప్పందాలను



కుదుర్చుకోవాలని మోదీ ఆకాంక్షించారు' అని విదేశాంగ శాఖ పేర్కొంది.

**అఫ్గాన్‌కు అండగా నిలుస్తాం..**

అఫ్గానిస్తాన్‌లో శాంతి, సుస్థిరత, భద్రత కోసం అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని మోదీ తెలిపారు. సోమవారం అఫ్గానిస్తాన్ 100వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో అఫ్గాన్ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

## వాట్సాప్ from ఫేస్‌బుక్

**వాషింగ్టన్:** ప్రముఖ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ 'వాట్సాప్'లో కీలకమైన అప్‌డేట్ తీసుకొస్తున్నట్లు మాతృసంస్థ ఫేస్‌బుక్ తెలిపింది. ఇకపై వాట్సాప్ సెట్టింగ్స్‌లో 'వాట్సాప్ ఫ్రం ఫేస్‌బుక్' అనే ట్యాగ్ కనిపిస్తుందని వెల్లడించింది. వాట్సాప్ సరికొత్త బీటా వెర్షన్‌లో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పింది. ఫేస్‌బుక్, వాట్సాప్‌లను ఏకీకృత ప్లాట్‌ఫామ్ పైకి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఫేస్‌బుక్ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఆండ్రాయిడ్ బీటా యూజర్ల కోసం 'ఫింగర్ ప్రింట్ లాక్' అనే ఫీచర్‌ను ఆవిష్కరించిన వారం రోజుల్లోనే వాట్సాప్ ఈ అప్‌డేట్ తీసుకురావడం గమనార్హం. 2014లో వాట్సాప్‌ను ఫేస్‌బుక్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

## రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్

**జైపూర్:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మదన్‌లాల్ షైనీ మృతితో ఆ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికకు బీజేపీ దూరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ తరఫున మన్మోహన్ నామినేషన్ దాఖలు చేశారు. నిర్దేశిత గడువులోపు మన్మోహన్ నామినేషన్ ఒక్కటే దాఖలవడంతో ఆయన ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సోమవారం ప్రకటించారు. దీనికి సంబంధించిన గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని మన్మోహన్ తరఫున ప్రభుత్వ చీఫ్ విప్ జోషికి అందజేశారు.

## కాంగ్రెస్ నేత చిదంబరానికి ఈడీ సమన్లు

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 23న విచారణాధికారి ఎదుట హాజరు కావాలని సూచించింది. యూపీఏ హయాంలో విమానయాన శాఖలో జరిగిన ఆర్థిక అవకతవకల గురించి ఆయన్ను ప్రశ్నించేందుకే ఈ సమన్లు జారీ అయ్యాయని అధికారులు సోమవారం తెలిపారు. ఎయిర్ ఇండియా భారీ నష్టాల్లో కూరుకుపోయిన నేపథ్యంలో 2006లో వాటి కొనుగోళ్లలో జరిగిన భారీ స్కామ్, అంతర్జాతీయ విమానయాన సంస్థలకు సమయాలను కేటాయించే విషయంలో జరిగిన అవకతవకల గురించి ఆయన్ను ప్రశ్నించనున్నారు. జాతీయ విమానాల కోసం భారత్ కొన్న 111 విమానాలకు రూ. 70 వేల కోట్లు చెల్లించడంపై కూడా ఆయన్ను ప్రశ్నించే అవకాశం ఉంది.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**సాక్షి, ముంబై:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ధులే జిల్లాలో ఎదురెదురుగా వస్తున్న ఒక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు, మరో ట్రక్కు ఢీ కొన్న ఘటనలో 15 మంది దుర్మరణం పాలయ్యారు. 35 మంది గాయాలపాలయ్యారు. ధులే జిల్లా నిముగుల్ గ్రామం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఔరంగాబాద్ నుంచి సుమారు 44 మంది ప్రయాణికులతో శహాదాకు ఆర్‌టీసీ బస్సు ఆదివారం రాత్రి సుమారు 10.30 గంటలకు బయలుదేరింది. నిముగుల్ గ్రామ సమీపంలో ఒక్కసారిగా ఎదురుగా వేగంగా వచ్చిన ట్రక్కు బస్సును ఢీ కొట్టింది. దాంతో అక్కడికక్కడే 15 మంది మృత్యువాత పడ్డారు. బస్సులో చిక్కుకుపోయిన కొందరిని స్థానికులు కాపాడి, దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు.

## మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కన్నుమూత



**సాక్షి, అమరావతి/పట్నా:** బిహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా(82) కన్నుమూశారు. గత కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి సంతాప సూచకంగా బిహార్ ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. జగన్నాథ్ మిశ్రా మూడుసార్లు ముఖ్యమంత్రిగాను, కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు.

**మిశ్రా మృతికి సీఎం జగన్ సంతాపం**

బిహార్ మాజీ సీఎం, కేంద్ర మాజీ మంత్రి మిశ్రా మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. మిశ్రా కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 2022 కల్లా కొత్త పార్లమెంట్ భవనం

**న్యూఢిల్లీ:** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తి చేసుకునే 2022 సంవత్సరంనాటికి పార్లమెంట్ కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఎంపీల కోసం కొత్తగా నిర్మించిన డూప్లెక్స్ అపార్టుమెంట్లను ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. కొత్త పార్లమెంట్ భవనంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అన్ని హంగులు ఉంటాయన్నారు. సెంట్రల్ ఢిల్లీలో నార్త్ ఎవెన్యూలో 1951–52 కాలంలో ఎంపీల కోసం ప్రత్యేకించిన అపార్టుమెంట్లను పడగొట్టి వాటి స్థానంలో కొత్తగా 36 డూప్లెక్స్ ఫ్లాట్లను నిర్మించారు.

# కశ్మీర్‌లో పాఠాలు షురూ




విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో బోసిపోయిన శ్రీనగర్‌లోని ఓ పాఠశాల

- కశ్మీర్ లోయలో ఆంక్షల సడలింపుతో తెరచుకున్న స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు
- తాలిబన్లతో అమెరికా శాంతిచర్చలకు కశ్మీర్‌కు ముడిపెట్టిన పాకిస్తాన్

**శ్రీనగర్/న్యూఢిల్లీ/ఇస్లామాబాద్/వాషింగ్టన్:** కశ్మీర్‌లో సోమవారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే చాలా పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. శ్రీనగర్‌లో 190 ప్రాథమిక పాఠశాలలు తెరుచుకున్నప్పటికీ శాంతిభద్రతల భయంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు పంపలేదు. అయితే బెమినాలోని పోలీస్ పబ్లిక్ స్కూల్, ఇతర కేంద్రీయ విద్యాలయాల్లో మాత్రం చెప్పుకోదగ్గ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కశ్మీర్‌లో ఆంక్షలు సడలించినప్పటికీ బలగాల మోహరింపు మాత్రం తగ్గలేదు. ఈ సందర్భంగా బారాముల్లా జిల్లాకు చెందిన ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ..'పట్టన్, పల్హాలాన్, సింఘ్‌పొరా, బారాముల్లా, సోపోర్ పట్టణాల్లో ఆంక్షలు యథాతథంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో మాత్రం పాఠశాలలు తెరుచుకున్నాయి' అని చెప్పారు. శ్రీనగర్‌లో గత 3 రోజులుగా హింసాత్మక ఘటనలు జరుగుతున్నందున పాఠశాలలు తెరుచుకోలేదని వ్యాఖ్యానించారు. అయితే నగరంలో ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్లను తొలగించి ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని ఈ నెల 5న రద్దుచేసిన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లదాఖ్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎలాంటి అల్లర్లు చెలరేగకుండా జమ్మూకశ్మీర్‌లో భారీగా బలగాలను మోహరించారు.

**భారత రాయబారికి పాక్ సమన్లు**

భారత డిప్యూటీ హైకమిషనర్‌గా గౌరవ్ అహ్లూవాలియాకు పాక్ ప్రభుత్వం సోమవారం సమన్లు జారీచేసింది. అహ్లూవాలియాను ఇస్లామాబాద్‌లోని తన కార్యాలయానికి పిలిపించుకున్న సార్క్ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ ఫైజల్.. భారత్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. భారత బలగాల తీరుపై తీవ్ర నిరసన తెలియజేశారు. ఆదివారం ఛిక్రీకోట్, హాట్‌స్ప్రింగ్ సెక్టార్లపై భారత ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఇద్దరు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2017 నుంచి ఇప్పటివరకూ భారత్ 1,970 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచిందని విమర్శించారు.

**ట్రంప్ పాక్‌వైపు మొగ్గు చూపొద్దు**

భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా పొరపాటున కూడా పాక్‌వైపు మొగ్గుచూపరాదని అగ్రరాజ్యానికి చెందిన కౌన్సిల్ ఫర్ ఫారిన్ రిలేషన్స్(సీఎఫ్‌ఆర్) సంస్థ అధ్యక్షుడు రిచర్డ్ ఎన్ హాస్ సూచించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాక్‌వైపు ఏమాత్రం మొగ్గుచూపినా భారత్ దూరమైపోతుందని హెచ్చరించారు. ఈ విషయమై రిచర్డ్ స్పందిస్తూ..'భారత్‌ను ఎదుర్కోవడానికి కాబూల్(అఫ్గానిస్తాన్)లో తన మిత్రులు అధికారంలో ఉండాలని పాక్ కోరుకుంటోంది. కాబట్టి పాక్‌ను శాసించే సైనిక, నిఘా వ్యవస్థలు తాలిబన్లను నియంత్రిస్తాయనీ, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలిస్తాయని నమ్మేందుకు చాలాతక్కువ అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో భారత్‌కు అమెరికా దూరం జరగడం అంత తెలివైన నిర్ణయంకాదు. ప్రజాస్వామ్య భారత్ జనాభా త్వరలోనే చైనాను దాటేస్తుంది. అంతేకాకుండా భారత్ ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతోంది. కాబట్టి అమెరికా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే ఇండియావైపు మొగ్గడమే శ్రేయస్కరం. ఆసియాలో చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు భారత్ అమెరికాకు సహకరిస్తుంది' అని తెలిపారు. మరోవైపు కశ్మీర్ సమస్య కారణంగా తాలిబన్–అమెరికాల మధ్య శాంతిచర్చలకు విఘాతం కలుగుతుందన్న పాక్ వ్యాఖ్యలపై అఫ్గానిస్తాన్ ప్రభుత్వం మండిపడింది. జమ్మూకశ్మీర్ భారత్–పాక్‌ల ద్వైపాక్షిక సమస్యనీ, దాన్ని అఫ్గాన్‌తో ముడిపెట్టడం పూర్తిగా బాధ్యతారాహిత్యమేనని స్పష్టం చేసింది.

### అమిత్ షాతో దోవల్ భేటీ

జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ సోమవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ లోయలో దాదాపు 10 రోజులపాటు పర్యటించిన దోవల్.. అక్కడి పరిస్థితిని షాకు వివరించారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఆంక్షలపై చర్చించారు. హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గౌబాతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు.

# సీఏపీఎఫ్ రిటైర్మెంట్ @ 60 ఏళ్లు

- సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీకి వర్తింపు
- బలగాల మధ్య వ్యత్యాసాన్ని తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు



**న్యూఢిల్లీ:** అన్ని రకాల కేంద్ర సాయుధ పోలీసు బలగాల(సీఏపీఎఫ్) పదవీ విరమణ వయస్సును 60 ఏళ్లుగా నిర్ణయిస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ బలగాల్లో కానిస్టేబుల్ నుంచి కమాండెంట్ (సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సమాన హోదా) స్థాయి వరకు ఉన్న నాలుగు కేంద్ర బలగాల అధికారులు (సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ పోలీస్ ఫోర్స్, సహస్త్ర సీమా బల్) ఇకపై 57 ఏళ్లకు బదులుగా 60 ఏళ్లకు పదవీ విరమణ చేయనున్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) నుంచి అత్యున్నత ర్యాంకు డైరెక్టర్ జనరల్(డీజీ) వరకు ఉన్న ఈ నాలుగు బలగాల అధికారుల రిటైర్మెంట్ వయస్సు కూడా ఇకపై 60 ఏళ్లే. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్), అస్సాం రైఫిల్స్ బలగాలకు చెందిన అన్ని స్థాయిల అధికారులకు 60 ఏళ్ల వరకు పనిచేసే అవకాశం ఉండగా తమకు మాత్రమే 57 ఏళ్లను రిటైర్మెంట్ వయస్సుగా నిర్ణయించటం వివక్ష చూపడమేనంటూ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై ఏకీభవించిన న్యాయస్థానం.. ఇలా వేర్వేరు పదవీ విరమణ వయస్సులను నిర్ధారించడం 'రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితం' అని, బలగాల మధ్య అంతరం చూపడమేనని వ్యాఖ్యానించింది. ఈ విధానాన్ని సవరించాలని జనవరిలో ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోవాలని ఆయా బలగాలను ఆదేశిస్తూ సోమవారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎవరైనా రిటైరై ఉంటే అలాంటి వారు తాము పొందిన రిటైర్మెంట్ ప్రయోజనాలను వాపసు చేసి తిరిగి విధుల్లో చేరవచ్చనీ లేదా 60 ఏళ్లు వచ్చే వరకు విధుల్లో కొనసాగి, రిటైర్మెంట్ ప్రయోజనాలను అందుకోవచ్చని తెలిపింది. రిటైరైన తర్వాత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించిన వారు, స్టే పొందిన కూడా 60 ఏళ్లు వచ్చే దాకా తమ విధుల్లో కొనసాగవచ్చని కూడా స్పష్టత ఇచ్చింది. ఈ నాలుగు బలగాలకు చెందిన కమాండెంట్ స్థాయి దిగువ హోదా వారికి ఏడో వేతన సంఘం కమిషన్ సిఫారసులు సీఐఎస్ఎఫ్ మాదిరిగానే వర్తిస్తాయని పేర్కొంది. అయితే, తక్షణం కార్యక్షేత్రం దూకాల్సిన అవసరం ఉండే సీఆర్పీఎఫ్ వంటి బలగాల అధికారుల ఫిట్‌నెస్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని కేంద్రానికి సీఏపీఎఫ్ నాయకత్వం తెలిపింది.

# ఐఏఎఫ్ డేర్‌డెవిల్ ఆపరేషన్



**జమ్మూ:** భారత వైమానిక దళం సిబ్బంది ధైర్య సాహసాలు ప్రదర్శించి వరదల్లో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కాపాడారు. జమ్మూకు చెందిన నలుగురు మత్స్యకారులు జమ్మూలోని భగవతి నగర్ వద్ద తావీ నదిలోకి దిగారు. ఒక్కసారిగా నదిలో వరద ఉధృతి పెరగడంతో వారు అక్కడే నిర్మాణంలో ఉన్న వంతెన పిల్లర్‌పైకి ఎక్కారు. అంతకంతకు నీటి మట్టం పెరుగుతుండటంతో స్థానికుల సాయంతో అధికారులకు సమాచారం అందించారు. ఐఏఎఫ్ వెంటనే రంగంలోకి దిగింది. ఐఏఎఫ్ హెలికాప్టర్ పిల్లర్‌కు అతి సమీపానికి రాగా గరుడ్ కమాండో కింది దిగారు. అక్కడున్న ఇద్దరినీ సురక్షితంగా హెలికాప్టర్‌లోకి ఎక్కేలా చేసి, మరో ఇద్దరి కోసం తాడు నిచ్చెనను వదిలారు. అయితే, వారిద్దరూ పైకి ఎక్కలేక తిరిగి నీళ్లలో పడిపోయారు. దీంతో గరుడ్ కమాండోలు తిరిగి పిల్లర్ ఉన్న ప్రాంతానికి చేరుకుని, వారిద్దరినీ సురక్షితంగా ఒడ్డుకు చేరేలా చేయగలిగారు. దాదాపు రెండుగంటలపాటు సాగిన ఈ సాహసోపేత చర్యను స్థానికులు ఉత్కంఠగా తిలకించారు. నలుగురినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన ఐఏఎఫ్ సిబ్బంది సాహసాన్ని వారు కొనియాడారు. ఇది డేర్‌డెవిల్ ఆపరేషన్ అని ఐఏఎఫ్ అధికారులు అభివర్ణించారు. ఇదంతా హెలికాప్టర్ పైలెట్, గరుడ్ కమాండో మధ్య సమన్వయం వల్లే సాధ్యమైందన్నారు. నగరంలోని హర్కిపొడి ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో.. ఉధంపూర్‌కు చెందిన తాలిబ్ హుస్సేన్ తావి నది వరదలో చిక్కుకుపోగా పోలీసులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

# నేడే కక్ష్యలోకి చంద్రయాన్–2



**సూళ్లూరుపేట/బెంగళూరు:** ప్రతిష్టాత్మక చంద్రయాన్–2 ప్రయోగంలో మరో కీలకఘట్టానికి మంగళవారం వేదిక కానుంది. ప్రస్తుతం లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీలో చక్కర్లు కొడుతున్న చంద్రయాన్–2 ఉపగ్రహం నేడు చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించనుంది. నేటి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్యలో చంద్రయాన్–2 ఉపగ్రహాన్ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఉపగ్రహంలోని ద్రవ ఇంధనాన్ని మండించి చంద్రుడి కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు ఇస్రో చైర్మన్ శివన్ వెల్లడించారు. తర్వాత సెప్టెంబర్ 2వ తేదీన ఉపగ్రహం నుంచి విక్రమ్ ల్యాండర్ విడిపోతుందని తెలిపింది. బెంగళూరు సమీపంలో గల బైలాలులోని ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ యాంటెన్నాల సాయంతో ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్‌లోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ నుంచి ఉపగ్రహ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకు ఉపగ్రహంలోని అన్ని వ్యవస్థలు బాగా పనిచేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. చంద్రయాన్–2 ఉపగ్రహాన్ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టడం అత్యంత సవాల్‌తో కూడుకున్న విషయమని ఇస్రో చైర్మన్ కె.శివన్ అన్నారు. చంద్రయాన్–2 చంద్రుడి కక్ష్యలోకి చేరుకోనున్న నేపథ్యంలో అధికారులు బెంగళూరులోని అంతరిక్ష కేంద్రం ప్రధాన కార్యాలయంలో మంగళవారం జాతీయ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత నెల 22న చంద్రయాన్–2ను ప్రయోగించారు.

## సంగీత దిగ్గజం ఖయ్యాం కన్నుమూత



**ముంబై:** బాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు, పద్మభూషణ్ గ్రహీత మొహమ్మద్ జహూర్ ఖయ్యాం హష్మి(93) సోమవారం కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఖయ్యాం ముంబైలోని సుజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత నెల 28న ఆయన ఆరోగ్యం క్షీణించడంతో వెంటిలేటర్ అమర్చారు. అయితే సోమవారం రాత్రి 9.30 గంటలకు కార్డియాక్ అరెస్ట్(గుండె ఆగిపోవడం)తో ఖయ్యాం తుదిశ్వాస విడిచారని సన్నిహితవర్గాలు తెలిపాయి. లూథియానా నుంచి 17 ఏళ్లకే ఖయ్యాం సంగీత ప్రయాణం మొదలైంది. 'ఉమ్రావ్ జాన్' 'కభీకభీ' సినిమాలతో ఖయ్యాం పేరు బాలీవుడ్‌లో మార్మోగిపోయింది. 'ఉమ్రావ్ జాన్' సినిమాకు అందించిన సంగీతానికి గానూ ఖయ్యాంను జాతీయ అవార్డు వరించింది. కభీకభీ, ఉమ్రావ్ జాన్ సినిమాలకు ఫిలింఫేర్ అవార్డులు కూడా దక్కాయి. ఆయనకు 2007లో సంగీత నాటక అకాడమి అవార్డు వరించింది. అంతేకాకుండా 2011లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో ఖయ్యాంను సత్కరించింది. కాగా, ఖయ్యాం మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, గాయని లతా మంగేష్కర్, సంగీత దర్శకుడు సలీం మర్చంట్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఫ్రాన్స్‌కు ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 22 నుంచి రెండు రోజుల పాటు పర్యటన కొనసాగనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో భేటీకానున్నారు. కీలకమైన రక్షణ, అణు శక్తి, సముద్ర సంబంధ సహకారాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు వంటి అంశాలపై ఆయన చర్చించనున్నారని కేంద్ర ఆర్థిక సంబంధాల కార్యదర్శి టీఎస్ తిరుమూర్తి తెలిపారు. ఫ్రాన్స్ సహకారంతో నిర్మించ తలపెట్టిన జైతాపూర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ విషయం కూడా చర్చలకు రానుంది. 23న పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం మోదీ యూఏఈ, బహ్రెయిన్‌లకు వెళ్లనున్నారు. అనంతరం 25న తిరిగి ఫ్రాన్స్‌కు వచ్చి జీ7 శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొంటారు.

# ఉత్తరాదిన ఉప్పొంగుతున్న నదులు

- హిమాచల్, ఉత్తరాఖండ్‌లో 37కు చేరిన మృతులు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**సిమ్లా/డెహ్రాడూన్/చండీగఢ్/న్యూఢిల్లీ:** ఉత్తరాదిన వానలు దంచికొడుతున్నాయి. గంగా, యమున, సట్లెజ్ నదులు పొంగి ప్రవహిస్తుండటంతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణాల్లో వర్షాల కారణంగా జరిగిన వివిధ ఘటనల్లో 37 మంది చనిపోయారు. అత్యధికంగా హిమాచల్‌లో 25 మంది మృతి చెందారు. మరో 24 గంటలపాటు వానలు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రక్షణ, సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, వైమానిక దళం చురుగ్గా పాల్గొంటున్నాయి. ఎన్నడూలేని విధంగా భాక్రా జలాశయం ఈ ఏడాది ముందుగానే నిండింది. హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా, కంగ్రా, కుల్లు జిల్లాల్లో సోమవారం మరో ముగ్గురు చనిపోవడంతో భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన వివిధ ఘటనల్లో మృతి చెందిన వారి సంఖ్య 25కు చేరుకుంది. శనివారం నుంచి కురుస్తున్న వానలతో పెద్ద సంఖ్యలో ఇళ్లు కూలడంతో పాటు, కొండచరియలు విరిగిపడటంతో చిక్కుకుపోయిన 500 మందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ సురక్షిత ప్రాంతాలకు తరలించింది..

**పంజాబ్ ప్రభుత్వం హైఅలర్ట్**

విడవని వానల కారణంగా యమునా నది ఉప్పొంగడంతో పంజాబ్, హరియాణాల్లోనూ వరద ప్రమాదం పొంచి ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమయింది. కర్నాల్ జిల్లాలో వరదల్లో చిక్కుకుపోయిన స్త్రీలు, చిన్నారులు సహా 9 మందిని ఐఏఎఫ్ బృందాలు కాపాడాయి. రోపార్ ప్రాజెక్టు నుంచి వరదను విడుదల చేయడంతో దిగువన ఉన్న షాకోట్, నకోదర్, ఫిల్లౌర్ జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. అలాగే, సట్లెజ్ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జలంధర్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. వచ్చే 48 నుంచి 72 గంటల వరకు భారీ వర్ష సూచన ఉండటంతో పంజాబ్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది.



కులూలో బియాస్ నది వరద ఉధృతికి ధ్వంసమైన ఓ వంతెన

**ఉత్తరాఖండ్‌లో ఆగిన వాన**

హిమాచల్‌ప్రదేశ్– ఉత్తరాఖండ్ సరిహద్దుల్లోని ఉత్తరకాశీ జిల్లాలో సోమవారం ఒక్కరోజే 9 మృతదేహాలు బయటపడటంతో రాష్ట్రంలో వానల కారణంగా జరిగిన సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిసంఖ్య 12కు చేరుకుంది. హరిద్వార్ వద్ద ప్రమాదస్థాయిని మించి, రిషికేశ్ వద్ద ప్రమాదస్థాయికి చేరువలో గంగ ప్రవహిస్తోంది. వరదల్లో పదుల సంఖ్యలో గ్రామాలు చిక్కుకుపోగా వరి, చెరకు పంటలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. నదీ తీరం వెంట ఉన్న 30 గ్రామాల వారిని అప్రమత్తం చేశామని, వరద తీవ్రత పెరిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని యంత్రాంగం తెలిపింది.

### ఢిల్లీకి వరద ముప్పు

యమునా నది హెచ్చరిక స్థాయిని మించి ప్రవహిస్తుండటంతో దేశ రాజధాని ఢిల్లీ యంత్రాంగం అప్రమత్తమయింది. వరద పరిస్థితిని అంచనా వేసేందుకు, ఏర్పాట్లను సమీక్షించేందుకు సీఎం కేజ్రీవాల్ అన్ని శాఖల అధికారులతో భేటీ అయ్యారు. సోమవారం యమునా నీటి మట్టం 204.7 మీటర్లకు చేరుకుంది. హరియాణాలోని హతినికుండ్ జలాశయం నుంచి 8.28 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేయనుండటంతో మంగళవారం ఉదయానికి నీటిమట్టం 207 మీటర్లకు పెరిగే అవకాశం ఉంది. ముంపు ప్రాంతాల ప్రజలను పోలీసులు, పౌర రక్షక దళాల సాయంతో ఖాళీ చేయించాలని సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్లకు ఆదేశాలు జారీ చేసింది. యమున ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దిగువ ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రజలను కోరింది.

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 20

# మండలిలో భంగపాటు

'భద్రతామండలిలో మనకోసం ఎవరూ పూల దండలు పట్టుకుని ఎదురుచూడటం లేదు. ఇది మరిచి ప్రవర్తిస్తే మనం పిచ్చివాళ్ల స్వర్గంలో ఉన్నట్టే' అని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి షా మహ్మూద్ ఖురేషీ ప్రకటించిన నాలుగు రోజులకు మండలిలో ఆ దేశానికి భంగపాటు ఎదురైంది.370 అధికరణను మన దేశం రద్దు చేయడంపై మొన్న శుక్రవారం మండలి రహస్య సమావేశం జరిగినప్పుడు చైనా తప్ప మరే దేశమూ పాకిస్తాన్ పక్షం నిలబడలేదు. 15మంది సభ్యులున్న మండలిలో మెజారిటీ సభ్యులు కశ్మీర్ ద్వైపాక్షిక అంశమని, అందులో ఐక్యరాజ్యసమితి జోక్యం అవసరం లేదని అభిప్రాయపడటం పాకిస్తాన్‌కు ఎదురుదెబ్బ. జమ్మూ-కశ్మీర్‌లో ఉద్రిక్తతలను పెంచే చర్యలకు ఎవరూ పాల్పడరాదంటూ తీర్మానిద్దామని చైనా చేసిన సూచన కూడా వీగిపోయింది. రెండు గంటలపాటు సమావేశం జరిగాక బయటికొచ్చి ఇద్దరే మాట్లాడారు. వారిలో ఒకరు చైనా ప్రతినిధి. మరొకరు రష్యా ప్రతినిధి. చైనా ప్రతినిధి సహజంగానే పాకిస్తాన్ అనుకూల వైఖరితో మాట్లాడగా, రష్యా ప్రతినిధి భారత్‌ను సమర్థించారు. భద్రతామండలి చర్చించిన లేదా తీర్మానించిన అంశాలన్నీ చివరకు ఏమవుతున్నాయన్న సంగతలా ఉంచి, ఆ వేదికపై ఎలాగైనా కశ్మీర్ అంశం ప్రస్తావనకు రావాలన్న పాకిస్తాన్ కోరిక మాత్రం నెరవేరింది.

మండలిలో పాకిస్తాన్‌కు లభించే మద్దతు అంతంతమాత్రమేనని తాను అనడానికి కారణమేమిటో ఖురేషీ చెప్పారు. వందకోట్లకు మించి జనాభా ఉన్న భారత్‌లో అనేక దేశాలు పెట్టుబడులు పెట్టాయని, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ జాబితాలో ఉన్నాయని ఆయన వివరించారు. కానీ ఇదే మాట పాకిస్తాన్‌కు కూడా వర్తిస్తుంది. గిల్గిట్-బాల్టిస్తాన్‌లోని ట్రాన్స్ కారకోరంను ఆ దేశం చైనాకు అప్పగించకపోయి ఉంటే... చైనా నిర్మించతలపెట్టిన బృహత్తర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్(బీఆర్ఐ)లో చేరడానికి సిద్ధపడకపోయి ఉంటే అది కూడా పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచేది కాదు. ప్రపంచం ఇప్పుడు మారిందని ఖురేషీ చెప్పడంలోనూ అర్ధసత్యమే ఉంది. అప్పట్లో పాకిస్తాన్ చర్యలకు నలువైపులనుంచీ మద్దతు వచ్చిపడిందీ లేదు...ఇప్పుడు అది తగ్గిందీ లేదు. అయినా ప్రపంచ దేశాల తీరు గురించి ఇంత తెలిసిన పాకిస్తాన్ మన దేశంతో మొదటినుంచీ ఎందుకు గిల్లికజ్జాలకు దిగుతున్నదో అనూహ్యం. అంతక్రితం ఎంతో కొంత మెరుగ్గా ఉన్న పాకిస్తాన్ పరిస్థితిని ఈ స్థితికి చేర్చింది 80వ దశకంలో ఆ దేశాన్నేలిన సైనిక నియంత జియావుల్ హక్. పౌర ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని దురాక్రమించిన తనకు బలం చేకూరాలంటే మత తత్వాన్ని పెంచడమే మార్గమని ఆయన అనుకున్నాడు. ప్రతి స్థాయిలోనూ మత ఛాందసులకు చోటిచ్చి వారికి పలుకుబడి పెరిగేలా చేశాడు. అనంతరకాలంలో ఆ ఛాందసవాద ముఠాలు కొరకరాని కొయ్యలా తయారయ్యాయి. అక్కడి సమాజాన్ని శాసిస్తున్నాయి. వాటినుంచే ఉగ్రవాదాన్ని బతుకు తెరువుగా చేసుకున్నవారు పుట్టుకొచ్చారు. అటువంటివారిని సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపి అలజడులు సృష్టించడం, అధీన రేఖ వద్ద తరచు ఆ దేశ సైన్యం అకారణంగా కాల్పులకు దిగడం వగైరాలన్నీ దానికి కొనసాగింపు. ఇలాంటి దేశాన్ని నమ్ముకుని ఎవరూ పెట్టుబడులు పెట్టరు. వ్యాపారాలు చేయరు. భారత్ పెద్ద మార్కెట్ అనడానికి ముందు.. దాదాపు 20 కోట్లమంది జనాభాతో ఉన్న తమ దేశమూ చెప్పుకోదగ్గ మార్కెటేనని ఖురేషీ గుర్తించి ఉంటే బాగుండేది. జనాభా ఎంత ఉందని కాదు... దేశం ప్రశాంతంగా ఉంటే వ్యాపారులైనా, పారిశ్రామికవేత్తలైనా ఉత్సాహంగా ముందుకొస్తారు. యువతకు ఉపాధి దొరుకుతుంది. అసలు అదంతా జరిగితే మన దేశంతో పాకిస్తాన్‌కు పేచీ పెట్టుకునే అవసరం వచ్చేది కాదు. దేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ క్షీణించడం, ఉపాధి కల్పనలో వెనకబాటు వగైరాలన్నీ పాకిస్తాన్‌ను కుంగదీస్తున్నాయి. వాటినుంచి తమ ప్రజల దృష్టి మళ్లించడానికి పాకిస్తాన్ ఇలాంటి పేచీకోరు చర్యలకు దిగుతోంది.

అయితే భద్రతామండలి చర్చ సందర్భంగా అటు చైనా తీరుతెన్నులపై, ఇటు రష్యా అడుగులేసిన తీరుపై మన దేశం అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మొదటినుంచీ చైనా పాకిస్తాన్ వైపే మొగ్గుచూపుతోంది. అది కొత్త పరిణామమేమీ కాదు. కానీ వచ్చే అక్టోబర్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ప్రధాని నరేంద్ర మోదీల మధ్య మన దేశంలో శిఖరాగ్ర చర్చలు జరగాల్సి ఉన్న తరుణంలో...వచ్చే నెల ఇరు దేశాల ప్రతినిధులమధ్యా సరిహద్దు అంశంపై చర్చలు జరగాల్సి ఉండగా చైనా ఇంత దూకుడుగా పాకిస్తాన్ ప్రయోజనాల పరిరక్షణకు శ్రమించడం, భద్రతామండలిలో ఒక తీర్మానం చేయాలని పట్టుబట్టడం గమనించదగ్గవి. ఒకపక్క తాను వీగర్ ప్రావిన్స్‌లో నిత్యం మానవహక్కుల హననానికి పాల్పడుతూ, హాంకాంగ్‌లో అణచివేత చర్యలకు దిగుతూ కశ్మీర్ పౌరుల విషయంలో మాత్రం అది మొసలి కన్నీరు కారుస్తోంది. అటు రష్యా స్వరం కూడా స్వల్పంగా మారిన వైనం కనబడుతోంది. కశ్మీర్ సమస్య భారత్-పాక్‌ల ద్వైపాక్షిక అంశమని, వారిద్దరే దాన్ని పరిష్కరించుకోవాలని అది ఇప్పటికీ చెబుతున్నా... అందుకు 1972నాటి సిమ్లా ఒప్పందం, 1998నాటి లాహోర్ డిక్లరేషన్‌లను ప్రాతిపదికలుగా తీసుకోవాలని అంటున్నా, కొత్తగా ' సంబంధిత ఐక్యరాజ్యసమితి తీర్మానాల' ప్రస్తావనను వీటికి జత చేసింది. ఇది కొత్త పరిణామం. అమెరికాతో మన దేశం సన్నిహితం కావడం విషయమై రష్యాకు చాన్నాళ్లనుంచి అసంతృప్తి ఉంది. కనుకనే ఈ రూపంలో దాన్ని వెళ్లగక్కింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో భద్రతా మండలిలో మనకు గట్టి మద్దతుదారుగా నిలిచి, మనకు వ్యతిరేకంగా వచ్చే తీర్మానాలను ఎప్పుడూ వీటో చేస్తూ వచ్చిన రష్యా ఇలా వ్యవహరించడం గమనించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దౌత్య వ్యవహారాలు కత్తి మీది సాము వంటివి. ఆచితూచి అడుగులేయడం చాలా ముఖ్యం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.పంచమి రా.1.29 వరకు, తదుపరి షష్ఠి నక్షత్రం రేవతి రా.8.01 వరకు, తదుపరి అశ్వని, వర్జ్యం ఉ.6.54 నుంచి 8.37 వరకు, దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.06 వరకు తదుపరి రా.10.55 నుంచి 11.41 వరకు, అమృతఘడియలు... సా.5.23 నుంచి 7.08 వరకు.

**సూర్యోదయం :** 5.46
**సూర్యాస్తమయం:** 6.20
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# మరో తొమ్మిది కశ్మీర్‌ల సంగతేమిటి?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''జమ్మూ-కశ్మీర్ ఏ సూత్రాలపైన భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించిందో ఆ సూత్రాలపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 370వ నిబంధనను అనుసరించి కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని చట్టబద్ధం చేసింది. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ ప్రత్యేక నిబంధనను కశ్మీర్ ప్రజల అనుమతితో నిమిత్తం లేకుండా తొలగించడం అభ్యంతరకరం. కశ్మీర్ ప్రజల అనుమతితో నిమిత్తం లేకుండా చేసిన ఈ సవరణ చెల్లదు గాక చెల్లదు''

– పలువురు కశ్మీర్, కేంద్ర ప్రభుత్వాల మాజీ అత్యున్నతాధికారులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తాజా పిటిషన్

''తొండ ముదిరి ఊసరవెల్లి''గా మారిన చందంగా రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా ఏర్పర్చిన జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కాస్తా, తిరిగి రాజ్యాంగ సభను సమావేశపరిచి, చర్చించి లేదా ఎన్నికైన కశ్మీర్ శాసనసభలో చర్చించి నిర్ణయించకుండా బీజేపీ పాలకులు రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఈ పిటిషన్ దాఖలయింది. దేశ అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించిన ఈ పిటిషన్‌పైన సంతకాలు చేసిన వారిలో జమ్మూ-కశ్మీర్, కేంద్ర ప్రభుత్వాల అత్యున్నత స్థాయి మాజీ ఉన్నతాధికారులున్నారు. మాజీ హోంశాఖకు చెందిన జమ్మూ-కశ్మీర్ సంధానకర్తల బృందం సభ్యుడు, ప్రొఫెసర్ రాధా కుమార్, జమ్మూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హిందాల్ హైదర్ ల్యాబ్జీ, ఎయిర్-వైస్‌మార్షల్ కపిల్ కాక్ (రిటైర్డ్), భారత్-పాకిస్తాన్ యుద్ధాలలో, యూరి సెక్టార్‌లోనూ బాధ్యతలు నిర్వహించిన మేజర్ జనరల్ అశోక్ కుమార్ మెహతా (రిటైర్డ్), భారత కేంద్ర ప్రభుత్వ అంతర్రాష్ట్ర మండలి మాజీ కార్యదర్శి, అమితాబ్ పాండే, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి గోపాల పిళ్లై!... కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రాజ్యాంగ సభ తిరిగి సమావేశపర్చి, చర్చించి, తుది నిర్ణయం తీసుకునేదాకా ఆ ప్రతిపత్తికి చెందిన 370వ నిబంధనను రద్దుచేస్తూ కేంద్రం సవరణ చట్టం తేవడానికి వీలులేదని, ఇది రాజ్యాంగ విరుద్ధ చర్య అనీ వీరు పిటిషన్‌లో పేర్కొన్నారు. పోనీ, నాటి రాజ్యాంగ నిర్ణయసభ ఇప్పుడు లేదు కాబట్టి, కనీసం ప్రజలెన్నుకున్న కశ్మీర్ శాసనసభ అయినా ఉనికిలో ఉందా అంటే దానిని బీజేపీ పాలకులు ముందే రద్దు చేసి కూర్చున్నారు. ఈ సంకట స్థితికి, పాలకుల సంకర విధానాలకు సమాధానంగానే అత్యున్నత స్థాయిలో ప్రత్యక్షంగా కశ్మీర్ వ్యవహారాలు నిర్వహించి ఉన్న ఉద్దండులు సుప్రీం కోర్టుకు వాస్తవాలతో పరిశీలనార్థం పిటిషన్‌ను దాఖలు చేయవలసి వచ్చింది.

'370' సంగతి అలా ఇంకా రగులుతూండగానే బీజేపీకి ఎదురవుతున్న సమస్యలు చాలవన్నట్టుగా, కశ్మీర్ రాష్ట్రానికి వెలుపలవారు కశ్మీర్ ప్రజల భూముల్ని కొనడానికి లేదా అమ్మడానికి వీలులేదన్న నిర్దిష్ట రాజ్యాంగ నిబంధన '35-ఎ'ను కూడా కేంద్ర పాలకులు రద్దు చేయడంతో భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలోని బీజేపీ పాలకులు లేదా శాసనకర్తలు కశ్మీర్ మహిళలపైన, ఆడపిల్లలపైన అనుచితమైన వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. కశ్మీర్ భూముల ఆక్రమణతో తమకు రాగల 'స్వేచ్ఛ'ను వీరు ఎంతవరకు సాగలాగుతున్నారో హరియాణా బీజేపీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖత్తార్ మాటలే నిదర్శనం: ''ఇకమీదట కశ్మీర్ ఆడపిల్లల్ని ఇక్కడికి తెచ్చేసుకోవచ్చు' అలాగే ఢిల్లీ బీజేపీ పార్లమెంట్ సభ్యుడు హన్స్‌రాజ్ హన్స్ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పేరును మార్చాలన్నాడు? నెహ్రూ చేసిన తప్పులను మోదీ సవరించుకుంటూ వస్తున్నందున దాన్ని 'మోదీ-నెహ్రూ యూనివర్సిటీ'గా మార్చాలట! ఇలా చిన్న తప్పుల నుంచి దుర్భరమైన తప్పులదాకా పాలకుల ప్రవర్తనవల్ల పేరుకుపోతూ, దేశం పరువుపోతూన్న దశలో మనం ఉన్నాం. కశ్మీర్ పరిస్థితులు 'చక్కబడుతున్నాయ'ని గత రెండు వారాలుగా కేంద్ర పాలకులు ప్రకటనలమీద ప్రకటనలు గుప్పించడమేగానీ, ఆ సానుకూల పరిణామం కోసం ఎదురుచూస్తున్న భారత ప్రజలకు అనుక్షణం నిరాశే ఎదురవుతోంది. అబద్ధాల్ని నిజాలుగానూ, నిజాల్ని అబద్ధాలుగానూ మనం చూడలేని ఒక దౌర్భాగ్య స్థితిలో ఉన్నాం.

నేడు '370', '35-ఎ' నిబంధనలు రాజ్యాంగంనుంచి కనుమరుగైనట్లు కన్పించినా, ఆ రెండు రాజ్యాంగ నిబంధనల వెలుగునీడలు దేశంలోని కొన్ని రాష్ట్రాలలో, కేంద్రపాలిత ప్రాంతాలలో మాత్రం తొలగడంలేదు, పరోక్షంగా కొనసాగుతున్నాయని చెబితే అత్యుక్తి కాదు. ఎందుకంటే నిన్నటివరకు '370', '35-ఎ' ప్రత్యేక ప్రతిపత్తి నిబంధనలు కశ్మీర్‌కే

**రెండో మాట**




పరిమితమని భావించాం, కానీ ఆచరణలో ఆ నిబంధనల నీడలో మన దేశంలోనే ఉన్న కశ్మీర్ ఒక్కటే కాదు, అలాంటి ప్రతిపత్తిని దరిదాపుల్లో చెలాయించుకుంటున్న 'పిల్ల కశ్మీర్'లు కనీసం ఎనిమిది రాష్ట్రాలున్నాయి. ఈ నెల ఆరవ తేదీతో ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయి 'జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ' చట్టం కింద కేవలం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా (జమ్మూ-కశ్మీర్, లదాఖ్) చాలించుకోవలసి వచ్చింది. అంటే, రద్దయిన '370'ని మినహాయిస్తే, ఆ నిబంధన తోబుట్టువులే రాజ్యాంగంలోని 371 నుంచి 371 (ఎ/బి/సి/డి/ఎఫ్/జి/హెచ్) నిబంధనల దాకా ఉన్న క్లాజులన్నీ ప్రత్యేక అభివృద్ధి మండలుల పేరిటనో, గవర్నర్ల పేరిటో, ప్రత్యేక ప్రాంతాల పేరిటో, ఏ చట్టమూ వర్తించని ప్రాంతం పేరిటో, ప్రత్యేక ప్రతిపత్తి పేరిటో రకరకాలుగా ప్రత్యేకంగా చెలామణీ అవుతున్నవి అక్షరాలా 8. అవి: నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, మణిపూర్, సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్.

ఏడు ఈశాన్య రాష్ట్రాలతోపాటు ఐదేళ్ల క్రితం దాకా ఉమ్మడి తెలుగు రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ 371(డి) నిబంధన కింద ప్రత్యేక ప్రతి పత్తితో మెలిగిందే. ఉమ్మడి ఏపీని చీల్చడంలో ఒకరు ప్రత్యక్షంగా, మరొకరు పరోక్షంగా ఘనమైన పాత్ర పోషించిన కాంగ్రెస్, బీజేపీ కేంద్ర నాయకులేనని నిద్రలో కూడా మరవరాదు. మానవ శరీరంలోని కణాలకు ఉంటుంది ఈ విభజన (సెల్ డివిజన్). ఆ లక్షణాన్ని కేవలం పరిపాలనా సౌలభ్య ప్రయోజనాల దృష్ట్యా తప్ప రాజకీయ పార్టీలు, నాయకులు తమ మధ్య కక్షలు, కార్పణ్యాల దృష్ట్యా పెంచుకోవడం దేశ ప్రయోజనాలకు, ప్రజల విశాల ప్రయోజనాలకు చేటు తెస్తుందని గ్రహించాలి. ఈ వాస్తవాన్ని తనకున్న పరిమితులలో గ్రహించి కేవలం రెండు తెలుగు ప్రాంతాల ప్రజల మధ్య సమాన అవకాశాలు, అభివృద్ధికి అనుగుణమైన సమాన సౌకర్యాల కల్పన కోసం ఇందిరాగాంధీ ఆంధ్రప్రదేశ్‌కు ఉద్దేశించిన ప్రత్యేక ప్రతిపత్తి రాజ్యాంగ నిబంధనే 371(డి) అధికరణ. అలాగే ఇండియాలో సిక్కిం భాగమైన తర్వాత కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తే '371-ఎఫ్' నిబంధన. పైగా, ఇండియాలో భాగంగా, చేర్చుకున్న సిక్కింకు సంబంధించిన ప్రత్యేక చట్టాలకూ ప్రత్యేక రక్షణ కల్పించింది అందుకే. ఇక రాష్ట్రాలకు గిరిజన ప్రాంతాలకు ఫెడరల్ (సమాఖ్య) స్ఫూర్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిందీ ఇందుకేనని మరవరాదు. ఢిల్లీ, పుదుచ్చేరిలను శాసనసభా ప్రతిపత్తి గల కేంద్రపాలిత రాష్ట్రాలుగా ప్రకటించి ఆయా ముఖ్యమంత్రులను అనుదిన పాలనా వ్యవహారాలలో బీజేపీ కేంద్ర పాలకులు తమ అనుకూల లెఫ్టినెంట్ గవర్నర్ల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. వాస్తవాలకు మసి పూస్తున్నారు.

'కాంగ్రెస్‌లో ఆరెస్సెస్ శక్తులు మొదటినుంచీ ఉన్నాయని' పండిట్ నెహ్రూ అన్న మాటలు ఎంత నిజమో, ఇటీవల కొందరు కాంగ్రెస్ ఎంపీలు కశ్మీర్ ప్రతిపత్తిని బీజేపీ పాలకులు రద్దు చేసిన మరుక్షణం బీజేపీలో చేరడమే నిదర్శనం. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి రాజ్యాంగ నిర్ణయ సభ చేసిన తీర్మానానికి, నెహ్రూ క్యాబినెట్ దాన్ని ఆమోదించినప్పుడు మంత్రివర్గ సభ్యునిగా జనసంఘ్ (ఆరెస్సెస్) నాయకునిగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సమ్మతి అలా తెల్పలేదని ఇప్పుడు బీజేపీ వాదన. పైగా, ఈ వాదన ముగ్గులోకి పటేల్‌ను కూడా దించడానికి బీజేపీ నాయకులు ప్రయత్నించారు. సర్దార్ పటేల్, అనంత శయనం అయ్యంగార్, రాజగోపాలాచారి బహుభాషల, భిన్న మతాల, విభిన్న సంస్కృతులకు ఆలవాలమైన భారత ఉపఖండాన్ని మత ప్రాతిపదికపై ఉపఖండ విభజనను వ్యతిరేకించారు. ఆ కలివిడితనం కోసమే కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి హోదాను సమ్మతించారు, గౌరవించారు. నెహ్రూ అన్నట్టుగా ''కశ్మీర్ అనేది ఇండియా-పాకిస్తాన్‌ల మధ్య ఆట బంతి కాదు. కశ్మీర్‌కు తనదైన సొంత ఆత్మ ఉంది, దానికి సొంత వ్యక్తిత్వం ఉంది. కనుక కశ్మీర్‌తో మనంగానీ, పాకిస్తాన్‌గానీ ఆడుకోగల్గిన రాజకీయ జూదం కాదు. కశ్మీర్ ప్రజల సుహృద్భావంతో నిమిత్తం లేకుండా మనం ఏమీ చేయలేం'' (1955 మార్చి 31న లోక్‌సభలో ప్రసంగం).

ఇంత గొప్ప ప్రకటన చేసిన నెహ్రూ కాంగ్రెస్ పక్కదారులు తొక్కింది. కశ్మీర్ ప్రత్యేక వ్యక్తిత్వానికి, సుకుమార సౌందర్య సద్భావాలకి నివాళులర్పించిన వాజ్‌పేయి నేతృత్వం వహించిన బీజేపీ మళ్లీ విభజన సిద్ధాంతాన్ని పట్టుకునే వేళ్లాడుతోంది. బీజేపీ నాయకులు రాజ్యాంగంలోని 253వ అధికరణ నిర్దేశించిన నిర్ణయాన్ని సదా గుర్తుంచుకోవాలి. ''భారత ప్రభుత్వం ఏ ప్రభుత్వాన్నయినా రద్దు చేయాలనుకుంటే అందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి విధిగా అవసరమని ఆ నిబంధన శాసిస్తోంది. కశ్మీర్‌లో ఆ బాధ్యతను నిర్వహించకుండా ఉండేందుకే తమ సభ్యత్వం ఉన్న సంకీర్ణ మంత్రివర్గాన్ని ముందుగానే బీజేపీ నాయకత్వం పడగొట్టి, ఆరునెలల్లోగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ పాలన నిర్వహించి గద్దెనెక్కాలని పన్నుగడ పన్నింది. అందుకు సాకుగా భారత రాష్ట్రాల్లోని పేదరికాన్ని చూపకుండా ప్రత్యేకంగా 'కశ్మీర్ అభివృద్ధికి అక్కడి పేదరికాన్ని' సాకుగా చూపుతూ చట్ట సవరణ ద్వారా ఒక్క కలంపోటుతో కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికే ఎసరు పెట్టింది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాజీ ప్రధాన కార్యదర్శులు, సైనికాధికారులు, దౌత్యనీతిజ్ఞులు సుప్రీంకోర్టును కదపవలసి వచ్చింది. న్యాయ వ్యవస్థ ఇంకా సజీవంగానే ఉందన్న నమ్మకంతో వీరు ఈ చర్యకు పాల్పడ్డారు.

abkprasad2006@yahoo.co.in

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




## సోషల్ మీడియా

### ఆల్ ఫస్ట్స్



"దేశంలో జైలుకు వెళ్లిన మొదటి ముఖ్యమంత్రి, లంచంగా తీసుకున్న సొమ్మును చెక్కు ద్వారా అందుకున్న మొదటి సీఎం, వేరే పార్టీల నుంచి ఎన్నికైన 20మంది శాసనసభ్యులను రెండుసార్లు కొనుగోలు చేసిన మొదటి ముఖ్యమంత్రి, అసలు అసెంబ్లీలో మెజారిటీ అనేదే లేకుండా ఒకసారి కాదు...నాలుగుసార్లు సీఎం పీఠాన్ని అధిరోహించిన మొదటి ముఖ్యమంత్రి, మంత్రివర్గమే లేకుండా కేబినెట్ సమావేశాలు నిర్వహించిన మొదటి సీఎం...ఈ ఘనతలన్నీ యడియూరప్పకే దక్కుతాయి"

– శ్రీవత్స, కాంగ్రెస్ నేత

### ఏం చేయను?



"రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్ ఒక హోటల్‌ను కొనుగోలు చేయడంలో అవినీతికి పాల్పడటంపై దర్యాప్తు చేస్తున్న అధికారులు కొద్ది రోజుల క్రితం నన్ను కలిశారు. ఈవిషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఢిల్లీలోని సీబీఐ కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేయాలని కోరారు. చేయమంటారా?"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

### పరార్



"వరద నీటిలో మునిగిన ప్రతిపక్ష నేత ఇంటిని డ్రోన్‌తో చిత్రీకరిస్తే హత్యకు కుట్ర పన్నినట్టా? పరువు గంగ పాలవుతుందని బ్యారేజి గేట్లు తెరవక ముందే సారు హైదరాబాద్ పారిపోయారు. విలువైన వస్తువులన్నీ తరలించారు. కృష్ణానది కావాలనే ప్రవాహాన్ని పెంచుకుంటోందని నిందించేట్టున్నారు చివరకు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### చట్టం



"మనల్ని మితవాదులంతా కేసులతో బెదిరించడం చాలా బావుంది కదా? కశ్మీర్‌లో ప్రతి చట్టాన్నీ, మిగిలిన ఉన్న చట్టపు అవశేషాలన్నిటినీ తుడిచిపెట్టేసిన వాళ్లు మనల్ని బెదిరించడమా? ఇప్పుడు భూమ్మీద ఎటువంటి చట్టం లేని ప్రాంతం కేవలం కశ్మీర్ మాత్రమే"

– షెహ్లా రషీద్, హక్కుల కార్యకర్త

### వండర్ లాండ్



"పాకిస్తాన్ నిజంగా ఓ అద్భుతమైన దేశం.. అలిస్ ఇన్ వండర్ లాండ్ లాగా. 1977 ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి వచ్చిన జనరల్ జియా 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తానని చెప్పాడు. కానీ, 1988లో మరణించే వరకూ అధికారం పట్టుకుని వేళ్లాడాడు. 2016లో సైనికదళాల చీఫ్‌గా నియమితుడైన జనరల్ బజ్వా ఇప్పుడు తనకు తాను పదవీకాలాన్ని మూడేళ్లపాటు పొడిగించుకున్నాడు. గ్రేట్"

– మార్కండేయ కట్జూ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి

### దేశభక్తి



"కొంతమంది లాజిక్ అస్సలు అర్థం కాదు. మన రాతల వల్ల వాళ్లకేవో ఇబ్బందులు వస్తున్నాయంటారు. మనల్ని ఎడ్యుకేట్ చేయాలనుకుంటారు. భారత్‌లోనే ఉండాలని, ఇక్కడే పని చేయాలనుకున్న మనకి, దేశభక్తి సర్టిఫికెట్లు ఇవ్వాలని చూస్తారు. మా భారతీయత సందేహాస్పదం కాదు. అలాగే మీకు గర్వ కారణమూ కాదు"

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

## అరుదైన నేత రాజీవ్



దివంగత ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడైన రాజీవ్ గాంధీ తన సోదరుడు సంజయ్ గాంధీ మరణానంతరం భారత రాజకీయాల్లో ప్రవేశించారు. 1981లో ఉత్తర ప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేసి పార్లమెంటు సభ్యులైనారు. ఇందిరాగాంధీ ఆకస్మిక మరణానంతరం ప్రధానమంత్రయ్యారు. ప్రధానిగా దేశంలో ఏటీ విప్లవానికి బాటలు వేశారు. ప్రతిరంగంలోనూ కంప్యూటర్ సేవలను ప్రవేశపెట్టిన ఘట్టానికి ఆద్యుడయ్యారు. దేశంలో సాంకేతిక రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టిన తొలి ప్రధానిగా రాజీవ్ చరిత్రలో నిలిచిపోయారు. 1991 మే 21న సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనడానికి తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ చేరుకున్న రాజీవ్ అక్కడ ఎన్నికల ప్రసంగ సభలో ప్రసంగించబోయే ముందు ఎల్టీటీఈ మానవబాంబు పేలుడు వల్ల దుర్మరణం పాలయ్యారు. 20-8-1944న జన్మించిన రాజీవ్ పుట్టిన రోజును సద్భావనా దివస్‌గా జరుపుకుంటున్నారు. రాజీవ్ మరణిం చిన రోజును ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నారు. మరణానంతరం రాజీవ్ గాంధీకి భారత రత్న అవార్డు బహూకరించారు.

(నేడు రాజీవ్‌గాంధీ జయంతి)
ప్రత్యూష, విజయవాడ

## మూక హత్య –చీకటి తీర్పు

రెండేళ్ల క్రితం రాజస్థాన్ లోని ఆళ్వార్‌లో అక్రమంగా గోవుల్ని తరలిస్తున్నాడన్న నెపంతో పెహ్లుఖాన్ ని ఒక మూక అడ్డగించి హత్య చెయ్యడం, ఆయన్ని కొడుతుండగా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించడం దేశాన్ని షాక్‌కి గురిచేసింది. ఆ తర్వాత ఒక మీడియా స్టింగ్ ఆపరేషన్‌లో ఒక నిందితుడు తామెలా ఆయన్ని కొట్టిందీ బోరవిరిచి చెప్పడం కూడా సంచలనం కలిగించింది. అయితే ప్రత్యక్ష సాక్ష్యాన్ని పక్కనపెట్టి ఆ హత్య కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురినీ సరైన సాక్ష్యం లేదన్న కారణంగా సెషన్స్ కోర్టు, సంశయ లాభం క్రింద అమాయకులుగా తీర్పు చెప్పడం విషాదం.

దాడి చిలకా శంకర్, సికింద్రాబాద్

## పెట్టుబడిదారీ స్వర్గధామంలో చిచ్చు

ఆధునిక ప్రపంచంలో బడా ఆర్థిక శక్తులకు, నయా పెట్టుబడిదారీ విధానానికి అత్యంత పరమోదాహరణగా హాంకాంగ్ నిలుస్తుంది. ఈ రెండు ప్రభావాల ఫలితంగా 93 మంది బిలియనీర్లు ఉన్న ఈ మహానగరం (ప్రపంచంలో రెండో స్థానం)లోని ప్రజలు తీవ్రమైన ఆర్థిక అభద్రతతో ఇక్కట్లకు గురవుతున్నారు. పేరుమోసిన నల్లమందు యుద్ధాల తర్వాత బ్రిటన్ 150 ఏళ్లకు పైగా హాంకాంగ్‌ని వలసగా మార్చుకుంది. 1997లో ఈ నగరంపై తన అధికారాన్ని వదులుకోవలసి వచ్చిన తరుణంలో, హాంకాంగ్‌ను స్వయం పాలనా ప్రాంతంగా మార్చడం ద్వారా 50 ఏళ్ల పాటు నగర రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను మార్చకూడదనే షరతుతో బ్రిటన్ ఆమేరకు చైనాతో ఒప్పందం కుదుర్చుకుంది.

బ్రిటన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం ఒక దేశం, రెండు వ్యవస్థలను కొనసాగించడం అంటే చైనా సామాజీకరించిన వ్యవస్థనుంచి విడివడి హాంకాంగ్‌లో అత్యంత తీవ్రస్థాయిలో పెట్టుబడిదారీవిధానం కొనసాగడమని అర్థం. హాంకాంగ్ శాసనసభలో 50 శాతం సీట్లను వ్యాపార వర్గాల ప్రయోజనాలకు కేటాయించారు. హాంకాంగ్‌లో తలదాచుకున్న తీవ్ర నేరస్తులను తైవాన్, మకావు, చైనా తరలించడానికి న్యాయపరమైన యంత్రాంగాన్ని ఏర్పర్చడానికి 2019 ఫిబ్రవరిలో హాంకాంగ్ ప్రభుత్వం ఒక బిల్లును ప్రతిపాదించింది. హాంకాంగ్ వాసులు ప్రపంచ వ్యాప్తంగా 46 రకాల తీవ్ర నేరాలకు పాల్పడినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయిన నేపథ్యంలోనే చైనా ఈ నేరస్తుల తరలింపు బిల్లును తీసుకొచ్చింది.

ఈ తరలింపు బిల్లుపై వీధుల్లో ప్రదర్శనలు తలపెట్టడానికి నెలల క్రితమే హాంకాంగ్‌లోని బిజినెస్ కమ్యూనిటీ ఈ బిల్లును వ్యతిరేకించింది. వైట్ కాలర్ నేరాలను ఈ తరలింపు బిల్లునుంచి మినహాయించాలని హాంకాంగ్‌లోని రెండు బడా బిజినెస్ అనుకూల పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. చైనా ప్రభుత్వం ఆర్థిక నేరాల ఆరోపణ చేస్తూ హాంకాంగ్‌లోని అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ఎగ్జిక్యూటివ్‌లను అరెస్టు చేసినా, లేక వారిని హాంకాంగ్ నుంచి తరలించినా అంతర్జాతీయ వ్యాపార కార్యకలాపాల స్వర్గధామంగా హాంకాంగ్‌కు ఉన్న ప్రతిష్ఠ దెబ్బతింటుందని వీరి వాదన.

సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ ఎంటర్‌ప్రైజ్ అనుబంధ సంస్థ అయిన ఎన్ఈడీ.. ఈ బిల్లు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని, ఆరోపించడమే కాకుండా హాంకాంగ్‌లో చైనా వ్యతిరేక ఉద్యమానికి నేతృత్వం వహించింది. అమెరికా రాయబార కార్యాలయం ఈ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించింది. దారినపోయే వారిపై, పోలీసులపై, మీడియాపై, ఎమర్జెన్సీ పనులు చేస్తున్న వారిపై హింసాత్మక దాడులకు ఉద్యమకారులు తలపెట్టడంతో జూలై 9న హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెర్రీ లామ్ ఈ తరలింపు బిల్లును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. హాంకాంగ్‌లో అశాంతికి తరలింపు బిల్లు కంటే ఆర్థిక అభద్రతాభావమే ప్రధానకారణం. దశాబ్దాలుగా స్వేచ్ఛా మార్కెట్‌కు పగ్గాలు తెరిచి ప్రజలకు ఏ మేలూ చేయని తరహా విధానాల స్థానంలో మెజారిటీ ప్రజల ప్రయోజనాలు కాపాడే పాలనవైపుగా మారాలని హాంకాంగ్ వాసుల డిమాండ్.

చైనాలో నయా ఉదారవాదం ఏ స్థాయికి చేరిందంటే 80 శాతం బ్యాంకులు బడా వాణిజ్య వర్గాలకు రుణాలు అందిస్తూ, కార్మికులకు అయ్యే వ్యయంపై కంపెనీలకే రాయితీలను అందిస్తున్నాయి. ఇలా రాయితీలివ్వడం అధర్మ వ్యాపారం అని అమెరికా వాదన. మరోవైపున పెట్టుబడిదారీ విధానానికి తనదైన ప్రత్యేక మార్గంలో తలుపులు తెరిచేసిన చైనాలో కార్మికులు వేలాది ప్రదర్శనలు, సమ్మెలు, ఆందోళనలు జరుగుతున్నట్లు నమోదవుతూనే ఉన్నాయి. ఈ ఆర్థిక సవాళ్లను, అసమానతల్ని, పర్యావరణ సమస్యలను చైనా ఎలా ఎదుర్కొనుంది అనేది దాని పాలనకు నిజమైన పరీక్షగా నిలుస్తోంది.

బ్రిటన్, అమెరికా, పాశ్చాత్య శక్తులతో హాంకాంగ్‌పై చైనా కుదుర్చుకున్న ఒడంబడిక 2047లో ముగియనున్న నేపథ్యంలో హాంకాంగ్‌లో యథాతథ స్థితిని కొనసాగించాలని అంతర్జాతీయ వాణిజ్య శక్తులు ప్రయత్నిస్తున్నాయి. అమెరికన్ డాలర్‌కి, చైనా యువాన్‌కు మధ్య జరుగుతున్న ఆర్థిక కుమ్ములాటే హాంకాంగ్ నేటి ఘర్షణలకు మూలబిందువుగా మారింది. నయా ఉదారవాదానికి చెందిన ఈ ఆర్థిక, రాజకీయ వ్యవస్థల ఘర్షణలు ఎలా తొలగిపోతాయి అనేది చైనా తన అంతర్గత వైరుధ్యాలను ఎలా పరిష్కరించుకోగలుగుతుంది అనే అంశంపైనే ఆధారపడి ఉంది.

కె. రాజశేఖరరాజు

## ఆదర్శ దాంపత్యం

ఆదర్శ దాంపత్యం అనగానే మనకు మొదట గుర్తుకు వచ్చేవారు సీతారాములు. కష్టకాలంలో భార్యాభర్తలు పరస్పరావగాహనతో ఎలా ప్రవర్తించాలో మనకు చూపారు. ఒకరికోసం మరొకరు తపించారు. రాముడు ఎక్కడుంటే అక్కడే తనకు సుఖం అనుకుంది సీత. అదే తన లోకమనుకుంది. వనవాసానికి సంసిద్ధురాలై రామునికి తోడునీడ అయింది. సీతను శాశ్వతంగా అడవులకు పంపాక, యాగం చేయవలసి వచ్చినపుడు రాముడు సీత స్వర్ణమూర్తితో కార్యం నెరవేర్చుకుంటాడు. ఆమె నిర్దోషి అని తెలిసినా ప్రజల అనుమానాన్ని దూరం చేయడం కోసం రాముడు ఆమెను త్యజించాడు. అగ్నిపునీత అయిన సీతను స్వీకరించి, మళ్లీ ప్రజావాక్కు కోసం ఆమెను పరిత్యజించాడు. అట్టి క్లిష్ట పరిస్థితుల్లోనూ సీత భర్తపై ఏ దోషాన్ని ఆరోపించలేదు. రామునికి అపకీర్తి రాకుండా ప్రాణమున్నంతవరకు అడవులలోనే ఉంటానన్నది. వాల్మీకి ముఖతః బ్రహ్మాది దేవతల సమక్షంలో ఆమె పాతివ్రత్యం నిరూపితమవుతుంది.




సీతాదేవి వ్యక్తిత్వం, ఆత్మగౌరవం బహుదా ప్రశంసనీయమైంది. తాను మనసా వాచా రాముని తప్ప అన్యుని తలచకుంటే, తనను కరుణించి స్థానమిమ్మని భూదేవిని ప్రార్థించి ఆమెలో లీనమవుతుంది. త్రేతాయుగం నాటి కావ్యం నేటి జెట్ స్పీడ్ యుగానికి ఆదర్శమా, అనుసరణీయమా అని కొందరు విమర్శిస్తుంటారు. వేద మంత్ర ఘోష సద్దుమణగకుండానే, కాళ్ల పారాణి ఆరకముందే, అభ్యంగన స్నాన సుగంధ పరిమళం సుదూర తీరాలకు తొలిగిపోక ముందే గొడవలు పడి, విడిపోతున్న వారు నేడెందరో కన్పిస్తున్నారు. దీనికి అవగాహనా రాహిత్యమే కారణం. పరస్పరం ప్రేమ, నమ్మకం, గౌరవం, సహనం, కొంత రాజీతత్వం భార్యాభర్తల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తాయి. ఇవి ఉండటం వ్యక్తిత్వాన్ని కోల్పోవడం ఎంతమాత్రం కాదు.

ఆదర్శవంతమైన కుటుంబ వ్యవస్థ రూపుదిద్దుకోవాలంటే అన్యోన్య దాంపత్యం అనివార్యం. మూడుముళ్లతో ప్రారంభమై, సుదీర్ఘ ప్రయాణం చేయబోయే భార్యాభర్తల జీవిత రథానికి సారథులూ, ప్రయాణీకులూ వారే. పరస్పర అనురాగాన్ని పెంచుకుంటూ, ఆనందాన్ని పంచుకుంటూ వారు ఆదర్శ దంపతులై వర్థిల్లాలి. సీతారాముల అన్యోన్య దాంపత్యం నేటి తరానికి ఆదర్శం కావాలి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 20-8-2019







# ట్రూమేక్

**కాగితం మీద సీన్ ఉంటే నమ్మకం కుదరదు.
అదే ఆల్రెడీ తీసేసిన స్క్రిప్ట్ అయితే ఒక గ్యారంటీ.
అది పెద్ద హిట్ అయి ఉంటే ఇంకా భరోసా.
అక్కడ హిట్ అయ్యింది ఇక్కడ హిట్ అవుతుందిలే అని ధైర్యం.
కాని రీమేక్‌లు ఎప్పుడూ మేజిక్‌స్టిక్‌లే.
అవి సరిగ్గా తిప్పితే పూలవర్షం కురుస్తుంది.
లేదంటే పాము పడగై కాటేస్తుంది. ఇటీవలి రీమేక్‌లు సక్సెస్‌స్టోరీ ఇది.**

రీమేక్ అనేది కత్తి మీద సాము. మార్పులు చేసి తీయాలా యథాతథంగా తీయాలా అనేది ఎప్పుడూ ఒక పజిల్. మార్పులు చేసి తీసిన కొన్ని సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. మార్పులు చేయకుండా తీసిన సినిమాలూ హిట్ అయ్యాయి. మార్పులు చేసినా, చేయకపోయినా ఫ్లాప్ అయిన సినిమాలు ఉన్నాయి. సినిమాలు ఎలా ఎందుకు ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయో చెప్పలేము. చిరంజీవి అంతటి మెగాస్టార్ కెరీర్ పరంగా ఒడిదుడుకులలో ఉన్నప్పుడు హిట్ ఇచ్చి నిలబెట్టిన 'హిట్లర్' రీమేకే. పెద్ద సక్సెస్ ఇచ్చి రాజకీయ ప్రవేశానికి ఊతం ఇచ్చిన 'ఠాగూర్' రీమేకే. 'శంకర్‌దాదా ఎంబిబిఎస్' కూడా రీమేకే. అలాగే మోహన్‌బాబుకు సినిమా రంగంలో సెకండ్ లైఫ్ ఇచ్చి స్టార్ ఇమేజ్ తెచ్చిన 'అల్లుడు గారు', 'అసెంబ్లీ రౌడీ', 'రౌడీ గారి పెళ్లాం' సినిమాలు రీమేక్‌లే. కాని రీమేక్ అంటే మాత్రం చాలా మంది దర్శకులు నెర్వస్‌గానే ఫీలవుతారు. గతంలో తెలుగులో రీమేక్ స్పెషలిస్టులు ఉండేవారు. పాతరోజులలో ఎస్.డి.లాల్ వంటి డైరెక్టర్లు హిందీ సినిమాలను తెలుగులో రీమేక్ చేసేవారు. 'నిప్పులాంటి మనిషి' (జంజీర్), అన్నదమ్ముల అనుబంధం (యాదోంకి బారాత్), నేరం నాది కాదు ఆకలిది (రోటీ) ఇవన్నీ ఎస్.డి.లాల్ తీసిన సినిమాలు. తర్వాతి రోజులలో రవిరాజా పినిశెట్టి రీమేక్‌లకు వాసి గాంచారు. ఆయన తీసి సూపర్‌హిట్ చేసిన 'పుణ్యస్త్రీ', 'పెదరాయుడు', 'చంటి' రీమేక్‌లే. ఇక దర్శకుడు భీమినేని శ్రీనివాసరావు రీమేక్ సినిమాలతోనే కెరీర్ నిర్మించుకున్నారు. 'శుభాకాంక్షలు', 'సుస్వాగతం', 'సూర్యవంశం', 'సుడిగాడు' ఇందుకు ఉదాహరణ.

అయితే ఇప్పుడు అలా లేదు. అందరు దర్శకులూ అవకాశాన్ని బట్టి రీమేక్‌లు తీయడానికి సిద్ధమవుతున్నారు. తీస్తున్నారు కూడా. మొన్న మొన్న వచ్చిన నాగార్జున 'ఊపిరి' ఫ్రెంచ్ ''ది ఇన్‌టచ్‌బుల్స్'కు రీమేక్. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించారు. నాగచైతన్య 'ప్రేమమ్' కూడా మలయాళ సూపర్‌హిట్‌కు రీమేక్. చందు మొండేటి దర్శకుడు. ఇటీవల తెలుగులో మళ్లీ రీమేక్‌ల చర్చ వస్తోంది. కారణం ఇటీవలి రీమేక్ సినిమాలు హిట్ కావడమే. ఎంత మార్చాలి ఎంత మార్చక్కర్లేదు అనే లెక్కలని జాగ్రత్తగా వేసి తీసిన సినిమాలివి. ఒక రకంగా వీటిని 'ట్రూమేక్'లు అనొచ్చు. ఒరిజినల్ సినిమా పట్ల నిజాయితీతో ఉండి తీసిన సినిమాలన్న మాట. వాటి విశేషాలు.

## ఓహో బేబీ!

సినిమా కథకు ఐడియా వెలగడం పెద్ద విషయం కాదు. దానిని విస్తరించి ఆసక్తికరమైన తొంభై సీన్లుగా మలచడం అసలు విజయం. ఒక స్త్రీ జీవిత చరమాంకంలో తిరిగి యంగ్‌గా జీవించే ఛాన్స్ వస్తే అనే ఆలోచన చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అయితే దానిని సినిమాకు వీలుగా మలిచిన తీరు కూడా ఆసక్తికరమే. అందుకే కొరియన్ సినిమా 'మిస్ గ్రానీ' పెద్ద హిట్ అయ్యింది. కథకు యూనివర్సల్ యాక్సెప్టెన్స్ ఉందని గ్రహించాక 11 భాషలకు చెందిన సినీరంగాలవారు ఈ కథను దేశ విదేశాలలో ఎగరేసుకుపోయారు. అలా ఈ కథ తెలుగుకు కూడా చేరి 'ఓ బేబీ' అయ్యింది. నందినీ రెడ్డి దర్శకత్వంలో సమంత ముఖ్య పాత్రలో నటించారు. బేబీగా 80 ఏళ్ల వృద్ధ స్త్రీ పాత్రను లక్ష్మి చేశారు. రాజేంద్రప్రసాద్, రావు రమేశ్, నాగశౌర్య ముఖ్యపాత్రల్లో నటించారు. బేబీ ఎంత బాగా నచ్చిందంటే సూపర్ హిట్ కావడమే కాదు సుమారు 30 కోట్ల గ్రాస్ కూడా వసూలు చేసింది. హిందీలో కూడా రీమేక్ కాబోతోంది. హిందీలో ఆలియా భట్ టైటిల్ రోల్ చేస్తారని తెలిసింది. ఈ సినిమా హిట్ కావడానికి కారణం తెలుగుదనం తప్పిపోని విధంగా తెరకెక్కించడం, ఇది మన కథే అన్న భావన కలిగించడం. ఎప్పుడైతే బామ్మగా లక్ష్మి చేశారో ఆమె తన నుడికారంతో ఒక సాధారణ బామ్మను చూస్తున్న అనుభూతిని కలిగించారు. సమంత ఆ పాత్రను నేటి అమ్మాయిగా ప్రేక్షకులకు దగ్గర చేయగలిగింది. సగటు తెలుగు స్త్రీ మనోభావాలను, జీవితపు వెలితిని చూపడం వల్లే ఈ సినిమా హిట్ అయ్యిందని చెప్పొచ్చు.

''రీమేక్‌తో వచ్చిన చిక్కేంటంటే సినిమా సరిగ్గా ఆడకపోతే పాడు చేశారు అంటారు. ఒక వేళ హిట్ అయితే సేమ్ అలానే తీశారు హిట్ అయిపోయింది అంటారు. రీమేక్స్‌తో ఎక్కువ పేరు సంపాదించడం కొంచెం కష్టం'' – నందినీ రెడ్డి, 'ఓ బేబీ' రిలీజ్ సమయంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో.



● నందినీ రెడ్డి

### గురి తప్పిన బాణాలు

రీమేక్‌లు అన్నిసార్లు సత్ఫలితాలు ఇవ్వవు. తమిళంలో సూపర్‌హిట్ అయిన సత్యరాజ్ సినిమా 'వాల్టర్ వెట్రివేల్'ను తెలుగులో చిరంజీవి, శ్రీదేవిలతో 'ఎస్.పి.పరశురామ్'గా తీస్తే ప్రేక్షకులు నిరాకరించారు. గ్లామర్ స్టార్ శ్రీదేవి ఈ సినిమాలో పాత్రపరంగా అంధురాలు కావడం జనానికి రుచించలేదు. మలయాళంలో మోహన్‌లాల్ నటించగా సూపర్‌హిట్ అయిన 'దేవాసురమ్'ను తెలుగులో మోహన్‌బాబు 'కుంతీపుత్రుడు'గా తీస్తే ప్రేక్షకులు మెచ్చలేదు. కన్నడలో సూపర్‌హిట్ అయిన విష్ణువర్ధన్ సినిమా 'ఆప్తరక్షక' తెలుగులో వెంటేష్‌తో 'నాగవల్లి'గా తీస్తే సత్ఫలితం ఇవ్వలేదు. కన్నడలో సూపర్ హిట్ అయిన శివ రాజ్‌కుమార్ 'జోగి'ని తెలుగులో ప్రభాస్‌తో 'యోగి'గా తీస్తే ఆశించిన ఫలితం ఇవ్వలేదు. హిందీలో సూపర్ హిట్ అయిన ఆమిర్ ఖాన్ 'మన్'ను తెలుగులో నాగార్జునతో 'రావోయి చందమామ'గా తీస్తే ప్రేక్షకులు నిరాశాజనకమైన రిజల్ట్స్ ఇచ్చారు. కనుక పట్టువదలక పని చేస్తూ పోవడమే చేయదగినది. నచ్చితే హిట్ అవుతుంది. లేకుంటే అనుభవం వస్తుంది.




● రామ్‌జీ

## ఎవరు

'క్షణం', 'గూఢచారి' సినిమాలతో థ్రిల్లింగ్ హిట్స్ అందుకున్నారు అడివి శేష్. మళ్లీ ఓ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా 'ఎవరు'తో వచ్చారు. స్పానిష్ సినిమా 'ది ఇన్విజిబుల్ గెస్ట్' చిత్రానికి తెలుగు రీమేక్ ఇది. ఆల్రెడీ హిందీలో 'బద్లా' గా ఈ సినిమా రీమేక్ అయింది. ఆ రెండు సినిమాలను చూసిన వారు కూడా ఎంటర్‌టైనింగ్‌గా చూసేలా మరిన్ని ట్విస్ట్‌లతో తెలుగు చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు రామ్‌జీ. ఓ బడా బిజినెస్‌మేన్ భార్య పోలీస్ ఆఫీసర్‌ను చంపేస్తుంది. తన మీద అత్యాచారం చేశాడని, ఆత్మరక్షణ కోసం కాల్చానని చెబుతుంది ఆమె. ఇందులో నుంచి తప్పించడానికి విక్రమ్ వాసుదేవ్ అనే లంచగొండి పోలీస్ ఆఫీసర్ సహాయం తీసుకుంటుంది. ఈ కేస్‌లో నుంచి తప్పించుకోవడానికి విక్రమ్ వీళ్లకు సాయం చేశాడా? వీళ్లు తప్పించుకున్నారా? లేదా అనేది క్లుప్తంగా 'ఎవరు' కథ. ఒరిజినల్‌లో ఉన్న కొన్ని పాత్రలను తప్పించి, మరిన్ని ట్విస్ట్‌లు జోడించి ఎంగేజింగ్ థ్రిల్లర్‌గా రూపొందించారు.

''ఒరిజినల్ సినిమా అక్కడ ఎందుకు ఆడింది? అనే విషయం అర్థం చేసుకోవాలి. 'ఇన్విజిబుల్ గెస్ట్' కోల్డ్ ఫిల్మ్. వాళ్ల ఎమోషన్స్ అలానే ఉంటాయి. మనవి అలా ఉండవు. దాన్ని అర్థం చేసుకుని మనకు తగ్గట్టుగా మలుచుకుంటే కచ్చితంగా సక్సెస్ సాధించవచ్చు'' – వెంకట్ రామ్‌జీ. 'ఎవరు' దర్శకుడు.

## రాక్షసుడు

గతంలో ఎస్.వి.కృష్ణారెడ్డి 'గన్‌షాట్' అనే సైకో ఫిల్మ్ తీశారు. అందులో సైకోగా ప్రకాష్‌రాజ్ నటించారు. అలీ హీరో. కామెడీ చేయాల్సిన అలీ సీరియస్ రోల్ చేయడం, సీరియస్‌నెస్ చూపించాల్సిన విలన్ కామెడీ చేయడంతో ఈ సినిమా ప్రేక్షకులను సరిగా చేరలేదు. కాని 'రాక్షసుడు' సినిమా మాత్రం మొదటి సీన్ నుంచే సీరియస్ మూడ్‌లోకి తీసుకెళ్లిపోతుంది. స్కూల్ వయసు ఉన్న ఆడపిల్లలను చంపి అవయవాలను చిన్న చిన్న భాగాలుగా చేసి రాక్షసానందం పొందే ఈ సైకో కిల్లర్‌ను సినిమా దర్శకత్వం కోసం సైకోలను స్టడీచేసి, సినిమా తీసే వీలులేక పోలీస్ ఆఫీసర్ అయిన హీరో ఎలా పట్టుకున్నాడనేది కథ. తమిళంలో సూపర్‌హిట్ అయిన 'రాక్షసన్'కు రీమేక్ ఇది. అక్కడ ఈ కథను రాసి దర్శకత్వం వహించింది రామ్‌కుమార్. తెలుగులో రమేశ్ వర్మ దర్శకత్వం వహించారు. క్లైమాక్స్ వరకూ విలన్ ఎవరనేది ప్రేక్షకుడు పసిగట్టలేనంత పకడ్బందీగా స్క్రీన్‌ప్లే ఉంది. తమిళ ఒరిజినల్‌ను చాలా కొద్ది మార్పులతో రీమేక్ చేయడం వల్ల ఈ సినిమా ప్రేక్షకుల్లో దూసుకుపోయిందనే అభిప్రాయం ఉంది. సాధారణంగా పాత్రకు తగ్గ నటులు దొరక్కపోతే పాత్ర ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉంది. అందుకే తమిళంలో ముఖ్యపాత్రలు చేసిన ఇద్దరు ముగ్గురు నటులు తెలుగులో చేయడం కూడా సినిమా హిట్‌కు కారణం కావచ్చు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కెరీర్‌లోనే బెస్ట్ హిట్ ఇదని చిత్రబృందం పేర్కొంది.

''రీమేక్ చేయడం అంటే ఒక పెయింటింగ్‌ని మళ్లీ వేయడం. అది అంత ఈజీ కాదు. తమిళ సినిమా ఓ టెంపోలో నడుస్తుంటుంది. అదే టెంపోను ఇక్కడ రిపీట్ చేయగలిగాను. సక్సెస్ సాధించాను'' – రమేశ్ వర్మ, 'రాక్షసుడు' రిలీజ్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.



● రమేశ్ వర్మ

– ఇన్‌పుట్స్: గౌతమ్ మల్లాది

---

వన్ అండ్ ఓన్లీ

# విబూది

**పెద్ద వయసులో ఎవరెస్టును ఎక్కడం, చిన్న వయసులో ఐఐటీ ధన్‌బాద్ సీటు కొట్టడం, యాషెస్ సిరీస్‌లో రన్‌ల రికార్డ్‌ను బ్రేక్ చెయ్యడం ఎవ్రీడే అచీవ్‌మెంట్స్‌గా అనిపించవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న 'హఠంపట్టు' (పర్‌సెవీరెన్స్) ఎవరికి వాళ్లకే ప్రత్యేకం. వన్ అండ్ ఓన్లీ. ఆ పట్టు పిడికిలి లోంచి రాలిపడే విబూదిని నుదుటికి రాసుకోవలసిందే.**

● మాధవ్ శింగరాజు

ఎవరికైనా గిన్నిస్ ఒక గుర్తింపు. అయితే ఇప్పుడెవ్వరూ గిన్నిస్‌ను గుర్తిస్తున్నట్లు లేదు. గిన్నిస్ బుక్కే చిన్నబోయేంతగా ఉంటున్నాయి మరి ఘనతలు! విజయాలు, వీర స్వర్గాలూ రొటీన్ అయిపోయి అభినందనగా చెయ్యి చాచడానికి ఎవరికీ మనసు రావడం లేదు. ఎక్కినందుకు, దిగినందుకు, ఎగిరినందుకు.. ఇలా గిన్నిస్‌వాళ్లు రికార్డులు ఇస్తూనే ఉన్నా.. ఎక్కడమేం గొప్ప, ఎగరడమేం గొప్ప అన్న చప్పరింపే వినిపిస్తోంది. బహుశా.. గిన్నిస్‌లోకి ఎక్కడమన్నది ఏ విలువా లేని గుర్తింపు అనే కాలంలోకి మనుషులు వచ్చి పడుండొచ్చు. శిఖరాన్ని చేరుకోవడం గొప్ప పనేం కాదనే అనుకుందాం. చేరుకునేవరకు మనసు నిలువలేకపోవడం.. అది గొప్పే కదా. కొండలెక్కొస్తే ఎవరికి ఉపయోగం? ఎవరికీ లేదు. కొండకి లేదు. కొండను ఎక్కిన మనిషికీ లేదు. కానీ ఒరిపిడి! పాదాల ఒరిపిడి రాళ్లకు, రాళ్ల ఒరిపిడి పాదాలకు. ఆ రాపిడి పొడి విబూదిలా నుదుటిపై పెట్టుకోవలసిందే. ఎక్కి దిగొచ్చేలోపు ఎన్ని జన్మలు, ఎన్ని జన్మరాహిత్యాలు.. ఆ మనిషికి!

మహిళలు సాధించే విజయాలు కూడా గిన్నిస్ రికార్డుల్లా చాలా ఈజీ అయిపోయాయి.



ఐ.ఐ.టి. విద్యార్థిని జ్యోతి ప్రియదర్శిని (15)



ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ మెగ్ లానింగ్

మహిళలకు కాదు ఈజీ అయిపోవడం, ఆపోజిట్ జెండర్‌కి. మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లూ నెగ్గడం సర్వసాధారణం అయిపోవడం వల్ల ఆ నెగ్గడానికి ఏ విలువా ఉన్నట్లు కనిపించకపోయినా, నెగ్గకు రావడం అనేది ఒకటి ఉంటుంది.. దానికి ఉంటుంది వాల్యూ. ఒక్కిస్తే పెరిగే వాల్యూ, ఇవ్వకపోతే తగ్గిపోయే వాల్యూ కాదది. 'ఎందుక్కాదో తేల్చుకుందాం' అని అనువుకాని దాని వెంటపడి సాధించడంలోని 'వాల్యూ ఆఫ్ పర్‌సెవీరెన్స్'! ఈ పర్‌సెవీరెన్స్ (పట్టువదలకపోవడం) స్త్రీ, పురుషులిద్దరికీ ఉంటుంది కానీ, స్త్రీ 'మోర్ పర్‌సెవీరింగ్'గా ఉండాలి. చేతులు ఊపుకుంటూ నడిచే నడకకు, తలపైన బరువులు మోసుకుంటూ నడిచే నడకకు మధ్య ఉండే వ్యత్యాసం వల్ల తప్పనిసరి అయ్యే 'మోర్' అది. ఎక్కువ కష్టపడాలి స్త్రీ తను అనుకున్నది సాధించడం కోసం. టెన్నిస్ ప్లేయర్ సెరెనా విలియమ్స్‌కి ఈ మాట నచ్చదు. 'లెబ్రాన్ జేమ్స్‌ని బెస్ట్ మేల్ ప్లేయర్ అంటున్నారా? ఫెదరర్‌నీ, టైగర్ ఉడ్స్‌నీ బెస్ట్ మేల్ ప్లేయర్స్ అంటున్నారా? మరెందుకు నేను గానీ, ఇంకో ఉమన్ అథ్లెట్ గానీ బెస్ట్ ఫిమేల్ ప్లేయర్ అవ్వాలి?'అని రెండేళ్ల క్రితం కావచ్చు ఆవిడ చికాకు పడ్డారు. బెస్ట్ ఫిమేల్ ప్లేయర్ అని అనడంలో 'స్త్రీ సాధించింది' అని కాక, 'స్త్రీ అయివుండీ సాధించింది!' అనే ఎగ్జయిట్‌మెంట్ ఉండే మాట వాస్తవమే. అయితే స్త్రీని ఉమన్ అచీవర్‌గా కాక, ఒక హ్యూమన్ అచీవర్‌గా మాత్రమే చూడటమంటే ఆమె పర్‌సెవీరెన్స్‌ని తక్కువ చేయడమే. తక్కువ అంటే పురుషుడికి ఈక్వల్ చెయ్యడం.

> బెస్ట్ ఫిమేల్ ప్లేయర్ అని అనడంలో 'స్త్రీ సాధించింది' అని కాక, 'స్త్రీ అయివుండీ సాధించింది!' అనే ఎగ్జయిట్‌మెంట్ ఉండే మాట వాస్తవమే. అయితే స్త్రీని ఉమన్ అచీవర్‌గా కాక, ఒక హ్యూమన్ అచీవర్‌గా మాత్రమే చూడడం అంటే ఆమె పర్‌సెవీరెన్స్‌ని తక్కువ చేయడమే. తక్కువ అంటే పురుషుడికి ఈక్వల్ చెయ్యడం.

ఉమెన్స్ యాషెస్ సిరీస్‌లో ఇటీవల ఆస్ట్రేలియా జట్టు ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఇంగ్లండ్‌లోని ఛెమ్స్‌ఫోర్డ్‌లో జరిగిన ట్వంటీ ట్వంటీ మహిళల ఇంటర్నేషనల్ మ్యాచ్ అది. ఆస్ట్రేలియా కెప్టెన్ మెగ్ లానింగ్. 63 బంతుల్లో 133 పరుగులు తీశారు. వాటిల్లో 6 సిక్సర్లు, 17 ఫోర్లు. నాటౌట్. టీ-ట్వంటీ మహిళా క్రికెట్‌లో ఇది అత్యధిక వ్యక్తిగత స్కోరు. వరల్డ్ రికార్డు. మన దగ్గర ఒక్క పేపర్ కూడా మెగ్ లానింగ్ సాధించిన ఈ ఘన విజయం గురించి చిన్న వార్తయినా రాయలేదు!

కనీసం రెండు కారణాల వల్లనైనా లానింగ్‌ని సీరియస్‌గా తీసుకోకపోవడం అన్నది జరగకుండా ఉండాల్సింది. ఒక కారణం: రికార్డును సాధించడమే కాదు, రికార్డును బ్రేక్ చేశారు కూడా లానింగ్. ఆ బ్రేక్ చేసిన రికార్డు కూడా తనదే! ఐదేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు మీద 126 పరుగులు స్కోర్ చేసి వరల్డ్ రికార్డ్ నెలకొల్పారు లానింగ్. దాన్నే మళ్లీ బ్రేక్ చేశారు. రెండో కారణం : లానింగ్ ఆడింది 'యాషెస్' సిరీస్! నూటా ముప్పై ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సిరీస్. మగవాళ్లది మెన్స్ యాషెస్. మహిళలది ఉమెన్స్ యాషెస్. మగవాళ్లయినా, మహిళలైనా యాషెస్ సిరీస్‌లో రికార్డు సాధించడం గొప్ప సంగతి. కానీ క్రికెట్‌లో ఒక్క రన్నే అయినా మగవాళ్లు కొట్టినదే, ఒక్క వికెట్టే అయినా మగవాళ్లు తీసిందే గొప్పగా రిఫ్లెక్ట్ అవుతుంటుంది.

చదువుల్లో కూడా అమ్మాయిల ఘనతలు కామన్ అయిపోయాయి! ఆ ఘనతల వెనుక ఆ కష్టం, ఆ స్ట్రెస్ కామన్ విషయాలా? వంద మంది అమ్మాయిలు ఒకే విధమైన వంద విజయాలను ఏటా సాధిస్తూనే ఉన్నా ప్రతి అమ్మాయి విజయమూ ప్రతి ఏడాదీ తొలి మహిళా విజయమే. ఈ ఏడాది జ్యోతి ప్రియదర్శిని అనే 15 ఏళ్ల రాయ్‌బరేలి అమ్మాయి జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐఐటీలో (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్) సీటు సంపాదించింది! కాకపోతే చిన్న వయసులో పెద్ద చదువులు చదవడం అన్నది పాత బడిపోయి జ్యోతి కూడా ఒక రొటీన్ జీ-ర్యాంకర్ అయిపోయింది లోకానికి. జ్యోతి తండ్రి సురేశ్‌కుమార్ మ్యాథ్స్, సైన్స్ టీచర్. పదకొండు మంది ఉండే ఉమ్మడి కుటుంబానికి (అందులో ఒకరు స్ట్రోక్ సర్వైవర్) ఆయన జీతమే ఆధారం. జ్యోతిని మెడిసిన్ చదివించాలని ఆయన. ఇంజనీరింగ్ చదవాలని జ్యోతి. తండ్రిని ఒప్పించేందుకు ఒక పెయిన్. తండ్రిని నొప్పిస్తున్నానేమోనని ఇంకో పెయిన్.

జ్యోతి అనే కాదు, చదువు అనే కాదు. లానింగ్ అనే కాదు, ఆట అనే కాదు. ఏ రంగంలో ఏ స్త్రీ సాధించిన ఘనత వెనుకైనా ఘనత వహించిన పెయిన్ ఒకటి ఉంటుంది. దానికొక్టాలి సెల్యూట్.. చెయ్యి పైకెత్తి, కాలును నేలకు తాటించి. ●

---

చెట్టు నీడ

# నిబంధన

భూమి మీద పుట్టిన ప్రతి మనిషికి రెండు కళ్లు, రెండు చెవులు, రెండు కాళ్లు ఉంటాయి. వీటిని దేవుడు మనిషి మంచిగా జీవించడానికే సృష్టించాడు.

ఒకరోజు యేసుక్రీస్తు కొండమీద కూర్చున్నప్పుడు బహుజన సమూహము ఆయన దగ్గరకు యేసు వారితో కొన్ని మాటలు ఉపమానాలుగా చెప్పాడు. ''నరహత్య చేయవద్దు, నీ సహోదరుని కోపపడి వ్యర్థుడా అనవద్దు, వ్యభిచరింపవద్దు, ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడు తన హృదయంలో వ్యభిచరించినట్లువుతుంది. ఈ విధమైన క్రియలు చేయువారిని భూమి మీదనే శిక్షింపబడుదురని, నరకాగ్నిలో కాల్చబడుదురని వారికి బోధించాడు (మత్తయి 5:1–28).



జరగబోవు పరిణామాలను వెంటనే సరిదిద్దుకోవాలని, సమాధానపడాలని అట్టిక్రియ చేసినవాడు దేవాలయంలో కానుకలర్పించుటకు అనర్హులని, మీ కన్నులు, మనస్సును అభ్యంతర పెట్టినప్పుడు, నీ చేతులు అవయవాలు పోయినందున నరకాగ్నిలో ఈ దేహానికి అంత బాధ వుండదని యేసు బోధించాడు (మత్తయి 5:29–30).

పూర్వం భక్తుడైన యోబు ఈలాగు కన్నులతో నిబంధన చేసుకొన్నాడు. ''కన్యకను నేనేలాగు చూతును? అలా చేసిన యెడల పరమునున్న దేవుని ఆజ్ఞ యేమగునంటాడు, ఉన్నత స్థలములో నున్న సర్వశక్తుని స్వాస్థ్యము యేమగును అంటాడు (యోబు 31ఫ1–2). దేవుని ఆజ్ఞను శిరసావహించాలన్నదే యేసు ఆ జనులతో బోధించాడు. అట్టివారికి పరలోక ప్రాప్తి కలుగునని చెప్పాడు.

– బి.బి.చంద్రపాల్ కోట

---

బ్యూటిప్స్



- స్నానం చేసే నీటిలో అర కప్పు టమోటా జ్యూస్ చేర్చి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.
- నిమ్మరసంలో కాస్త ఉప్పు చేర్చి.. సేవించాలి లేదా.. వేడినీటిలో ఉప్పు చేర్చి నోటిని పుక్కిలిస్తే నోటి దుర్వాసన దూరమవుతుంది.
- కలబంద రసంలో కొబ్బరి నూనెను చేర్చి జుట్టుకు రాసుకుంటే జుట్టు రాలడం తగ్గి వత్తుగా పెరుగుతుంది.
- ముఖానికి తేనె రాసుకోవడం మంచిది. చర్మంపై ఉండే మురికి తొలగి, చర్మం మృదువుగా పట్టులా మెరుస్తుంది.



సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 20-8-2019



రసాయనాలతో నేలతల్లిని నాశనం చేసే హక్కు మనకు లేదు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని అన్నదాతలు దశలవారీగా పూర్తిగా మానేసి, నేలతల్లి అనుగ్రహం పొందాలి!
– ప్రధాని నరేంద్ర మోదీ (ఆగస్టు 15 నాటి ప్రసంగం)

మఖ కార్తె : ఆగస్టు 30 వరకు

- సాధారణ, సేంద్రియ ఆహారోత్పత్తులపై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఐసీటీలో పరీక్షలు
- రసాయనిక పద్ధతుల్లో పండించిన వరి బియ్యం, దొండ, బెండ, కాలీఫ్లవర్‌లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్స్ సున్నా
- సేంద్రియ ఆహారోత్పత్తుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ వేల రెట్లు అధికమని వెల్లడి
- సేంద్రియ వరి బియ్యంలో పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్స్





# సేంద్రియ ఆహారం దివ్యౌషధం!

**ఇంటిపట్టున గాని, పొలంలో గాని రసాయనాలు బొత్తిగా వాడకుండా పూర్తిగా సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, పండ్లు, తిండి గింజలు, పప్పుధాన్యాలు సాగు చేయడానికి అదనంగా శ్రమపడాల్సి వస్తుందన్నది నిజమే. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపుమందులు వాడినప్పటికన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో పండించడం కొంచెం కష్టమే కావచ్చు. అయితే, ఈ కష్టం ఊరికే పోదంటున్నారు నిపుణులు. అదెలాగంటారా? సేంద్రియ ఆహారోత్పత్తులలో స్థూల, సూక్ష్మ పోషకాలతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే 'యాంటీ ఆక్సిడెంట్స్' వంటి విశిష్ట పోషకాలు అత్యధిక మోతాదులో ఉంటాయి కాబట్టి! కొన్ని సేంద్రియ ఉత్పత్తుల్లో రెట్టింపు ఉండగా, మరికొన్నిటిలో వేల రెట్లు అదనంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ రసాయన సాంకేతిక సంస్థ (ఐఐసిటి) తాజా పరీక్షల్లో వెల్లడైంది.**

**ఆశ్చర్యంగా ఉందా..?**

**ఇది ముమ్మాటికీ నిజమే సుమా! ఇక చదవండి మరి..**

ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయం మనందరికీ తెలిసిందే. రసాయనిక ఎరువులు, పురుగుమందులతో సాగు చేసిన ఆహార పదార్థాల కన్నా సేంద్రియ ఆహారోత్పత్తులు ఎంతో ఆరోగ్యదాయకమని మనకు తెలిసిందే.

అయితే, పూర్తిగా సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారోత్పత్తులకు ఆ ఔషధ గుణం ఎలా వచ్చింది? వాటిల్లోని 'యాంటీ ఆక్సిడెంట్స్' వంటి పోషకాల వల్ల ఆ సద్గుణం వచ్చింది!

యాంటీ ఆక్సిడెంట్స్ ఏయే ఆహారోత్పత్తుల్లో ఏయే స్థాయిలో ఉన్నాయి? రసాయనిక పద్ధతిలో పండించిన ఆహారోత్పత్తుల్లో ఎంత మేరకు ఉంటాయి? సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారోత్పత్తుల్లో ఎంత ఎక్కువ మోతాదులో ఉంటాయి? అనేవి చాలా ముఖ్యమైన ప్రశ్నలు.

ఈ ప్రశ్నలకు శాస్త్రీయ సమాధానం వెతికేందుకు ఏకలవ్య ఫౌండేషన్ ప్రయత్నించింది. తెలుగు రాష్ట్రాల్లో సేంద్రియ వ్యవసాయ వ్యాప్తికి విశేష కృషి చేస్తున్న ఈ ఫౌండేషన్.. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారతీయ రసాయన సాంకేతిక సంస్థ (ఐ.ఐ.సి.టి.– హైదరాబాద్)లో కొన్ని ఆహారోత్పత్తులపై ఇటీవల పరీక్షలు చేయించింది. వరి బియ్యం, గోధుమలు, కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలపై పరీక్షలు జరిగాయి.

ఆక్సిజన్ రాడికల్ అబ్సార్బెన్స్ కెపాసిటీ (ఓ.ఆర్.ఎ.సి.) అనే పరీక్ష నిర్వహించారు. యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వులో కరిగేవి(లిపోఫిలిక్), నీటిలో కరిగేవి(హైడ్రోఫోలిక్) ఏయే ఆహారోత్పత్తుల్లో ఏయే మోతాదుల్లో ఉన్నాయన్నది తెలుసుకున్నారు. ఐఐసిటి పరీక్షల ఫలితాలను ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ చిట్టూరి సుబ్రహ్మణ్యం 'సాక్షి సాగుబడి'కి వెల్లడించారు.

### కొవ్వులో కరిగే (లిపోఫిలిక్) యాంటీ ఆక్సిడెంట్స్ పరీక్ష ఫలితాలు

| ఆహారం పేరు | సేంద్రియ ఉత్పత్తుల ఫలితాలు | | సాధారణ(రసాయన) ఉత్పత్తుల ఫలితాలు | | ఎన్ని రెట్లు ఎక్కువ? |
|---|---|---|---|---|---|
| | Conc μM GAE | conc μmol | Conc μM GAE μmol | Conc GAE/100g | |
| వరి బియ్యం | 484.41 | 24,220.2 | 0 | 0 | వేల రెట్లు |
| గోధుమలు | 1,815.7 | 1,08,728.1 | 179.14 | 9,735.6 | 11.16 |
| కందిపప్పు | 3,001.83 | 1,77,623.3 | 165.22 | 11,014.6 | 16.1 |
| బొప్పాయి | 2,630.2 | 97,418.1 | 470.21 | 14,694.2 | 6.62 |
| బీర | 4,571.4 | 2,54,082.1 | 800.16 | 43,964.5 | 5.77 |
| దొండ | 3,472.3 | 82,872.15 | 0 | 0 | వేల రెట్లు |
| బెండ | 2,387.9 | 31,011.7 | 0 | 0 | వేల రెట్లు |
| క్యాలీఫ్లవర్ | 1,956.7 | 83,265.53 | 0 | 0 | వేల రెట్లు |
| కాకర | 2,857.7 | 1,62,372.7 | 905.39 | 32,923.34 | 4.9 |
| తోటకూర | 11,627.5 | 6,45,977.3 | 7,871.5 | 1,70,748.4 | 3.78 |
| కరివేపాకు | 9,608.4 | 3,55,869.6 | 2,752.9 | 75,422.2 | 4.7 |

## 'యాంటీ ఆక్సిడెంట్లు' అంటే?

మానవ దేహంలో నిత్యం అనేక జీవక్రియలు జరుగుతూ ఉంటాయి. జీవక్రియలు జరిగే సమయంలో మన దేహంలో కొన్ని కలుషిత పదార్థాలు విడుదల అవుతాయి. వాటిని ఫ్రీ రాడికల్స్ అంటారు. అవి కణాలను దెబ్బతీసి మనకు అనారోగ్యం కలిగిస్తాయి. వీటి బారిన పడిన ఆరోగ్యకరమైన కణం కేన్సర్ కణంగా మారిపోయే అవకాశం ఉంది. ఇలా మన ఆరోగ్యానికి నష్టం కలిగించే ఫ్రీ రాడికల్స్‌ను నిస్తేజంగా మార్చే శక్తి మనం తీసుకునే ఆహారంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ వంటి పోషకాలకు ఉంది. జీవక్రియల ద్వారా వెలువడే వ్యర్థాల్లోని హానికారక పదార్థాలను నిర్వీర్యం చేసి, కణ విధ్వంసాన్ని యాంటీ ఆక్సిడెంట్స్ నిలిపివేస్తాయి. అందువల్లనే యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకునే వారు ఎక్కువ కాలం యౌవనంగా ఉండటంతోపాటు కేన్సర్ తదితర వ్యాధుల పాలు కాకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైద్యనిపుణులు చెబుతున్నారు(*సాక్షి ఫ్యామిలీ హెల్త్‌కాలమ్‌లో 01–08–2019న 'యాంటీ డిసీజ్ ఆహారం' శీర్షికన కేర్ హాస్పిటల్స్ ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డా. హరిచరణ్ రాసిన వ్యాసం చదవండి*). అంతేకాదు.. కేన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, అల్జిమెర్స్, పార్కిన్సన్ వంటి జబ్బులను యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఆహారం నివారించగలుగుతుందని అమెరికా వ్యవసాయ శాఖలోని ఆహార–పోషకాల విశ్లేషణ విభాగం చెబుతోంది.

### నీటిలో కరిగే (హైడ్రోఫాలిక్) యాంటీ ఆక్సిడెంట్స్ పరీక్ష ఫలితాలు

| ఆహారం పేరు | సేంద్రియ ఉత్పత్తుల ఫలితాలు | | సాధారణ(రసాయన) ఉత్పత్తుల ఫలితాలు | | ఎన్ని రెట్లు ఎక్కువ? |
|---|---|---|---|---|---|
| | Conc μM GAE | conc μmol/100g | Conc μM GAE μmol | Conc GAE/100g | |
| వరి బియ్యం | 12,747.4 | 10,62,287.2 | 0 | – | వేల రెట్లు |
| గోధుమ | 20,805.1 | 19,26,397.9 | 13,531.3 | 12,08,151.956 | 1.59 |
| కందులు | 26,531.7 | 23,07,105.7 | 14,157.1 | 13,74,484.4 | 1.67 |
| తోటకూర | 21,561.73 | 8,26,119.79 | 8,869.3 | 98,111.6 | 8.4 |
| చిక్కుళ్లు | 4,677.5 | 1,23,417 | 1,054 | 21,732.4 | 5.67 |
| దొండ | 919.38 | 18,350.9 | 0 | 0 | వేల రెట్లు |

GAE = Gallic Acid Equivalents (యాంటీ ఆక్సిడెంట్ల సాంద్రతకు సూచిక)
Conc = Concentration μM= Micromolar (i.e., one millionth of a mole)
μmol = predetermined standard concentration

### రసాయనాలతో పండించిన వరిలో సున్నా

రసాయనిక పద్ధతిలో పండించిన వరి బియ్యం, దొండకాయలు, బెండకాయలు, కాలీఫ్లవర్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ బొత్తిగా సున్నా. సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన వరి బియ్యం, దొండకాయలు, బెండకాయలు, కాలీఫ్లవర్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. అదేవిధంగా.. సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన గోధుమలు, కందులు, బొప్పాయి పండ్లు, బీర, కాకర, కరివేపాకు, తోటకూర, చిక్కుళ్లలో రసాయనాలు వాడి పండించిన వాటిలో కన్నా అనేక రెట్లు ఎక్కువ మోతాదులో యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నట్లు తేలింది.

మొక్కలు తెగుళ్లు, కీటకాలు, వ్యాధుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్స్ వంటి వృక్ష రసాయనాల(ఫైటో



కెమికల్స్)ను తయారు చేసుకుంటాయి. సేంద్రియ వ్యవసాయ విధానంలో సాగయ్యే పంటలు వీటిని అధిక మోతాదులో తయారు చేసుకుంటాయి. ఆయా పంటల నుంచి లభించే ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు తదితర ఉత్పత్తుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధిక మోతాదులో ఉంటాయి. అంటే.. సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంట దిగుబడుల ద్వారా మన ఆకలి తీర్చుకోవడానికి కావాల్సిన ఆహారంతోపాటు, ఆరోగ్యాన్ని నిలుపుకోవడానికి అవసరమైన ఔషధ శక్తి కూడా పుష్కలంగా లభిస్తోందన్న మాట.

ఈ కారణంగానే సేంద్రియ ఆహారోత్పత్తులను అధిక ధర చెల్లించైనా కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సేంద్రియ వ్యవసాయోత్పత్తులకు గిరాకీ 20% మేరకు పెరుగుతోందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఏడాదిలో ఎక్కువ కాలంపాటు పంటలు పండించుకోవడానికి అనువైన సానుకూల వాతావరణ పరిస్థితులున్న మన దేశంలో రైతాంగానికి సేంద్రియ / ప్రకృతి వ్యవసాయం బంగారు భవిష్యత్తును అందించనుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**– పంతంగి రాంబాబు,**
**సాగుబడి డెస్క్**



## సేంద్రియ విశిష్ట పోషకాల సాంద్రతను వెలుగులోకి తెచ్చిన తొలి పరీక్ష!



సేంద్రియ ఆహారంలో రసాయనాల అవశేషాలు ఉండవు కాబట్టి ఆరోగ్యదాయకమని ఇప్పటి వరకూ అనుకుంటూ ఉన్నాం. అయితే, మనకు ప్రాణాంతక జబ్బులు రాకుండా అడ్డుకునే యాంటీ ఆక్సిడెంట్స్ వంటి అసమాన పోషకాల సాంద్రత(న్యూట్రిషన్ డెన్సిటీ) సేంద్రియ ఆహారంలో ఇంత ఇబ్బడి ముబ్బడిగా ఉందన్న వాస్తవం ఐఐసీటీ శాస్త్రవేత్తల పరీక్షల్లో తాజాగా వెలుగులోకి రావడం కనువిప్పు కలిగించే విషయం. బహుశా మన దేశంలోనే ఇది మొదటిసారి కావచ్చు. సేంద్రియ ఆహారోత్పత్తులను భారీ మొత్తంలో ఏడాదిలో ఎక్కువ నెలల పాటు సాగు చేయడానికి తగిన సానుకూల పరిస్థితులు పారిశ్రామిక వ్యవసాయం సాగే ఇతర దేశాల్లో కన్నా మన దేశానికే ఎక్కువగా ఉన్నాయి. ఆరుగాలం స్వయంగా నడుము వంచి పనిచేసే 80% మంది చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో ఉన్న మన దేశానికి సేంద్రియ వ్యవసాయం బాగా నప్పుతుంది. మన ప్రజలందరికీ పౌష్టికాహార భద్రత, ఆరోగ్య భద్రతను ఇవ్వడంతోపాటు.. విదేశాలకు అమృతాహారాన్ని ఎగుమతి చేయగల సత్తా మన దేశానికి మాత్రమే ఉంది. అయితే, ప్రభుత్వాలు ఈ అద్భుత అవకాశాలను గుర్తెరిగి ఈ దిశగా పటిష్ట కార్యాచరణకు ఉపక్రమించాల్సిన తరుణం ఆసన్నమైంది.

**– చిట్టూరి సుబ్రహ్మణ్యం,**
**ట్రస్టీ, ఏకలవ్య ఫౌండేషన్, హైదరాబాద్**
chbs@shanders.com

## 24-25 తేదీల్లో నెల్లూరులో సేంద్రియ మేళా

సింహపురి సేంద్రియ వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24–25 తేదీల్లో ఉ. 10 గం.ల నుంచి సా. 7 గం.ల వరకు సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన – అమ్మకం, సేంద్రియ వ్యవసాయంపై సదస్సు, సేంద్రియ చిరుధాన్యాల వంటకాలపై సదస్సులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పలువురు సేంద్రియ వ్యవసాయ నిపుణులు, చిరుధాన్య ఆహార నిపుణులు మిల్లెట్ రాంబాబు, ఆయుర్వేద నిపుణులు డా. నారపరెడ్డి తదితర నిపుణులు అవగాహన కల్పిస్తారు. ఈ సంఘం వరుసగా నాలుగో సంవత్సరం సేంద్రియ మేళాను నిర్వహిస్తుండటం అభినందనీయం. వివరాలకు.. 99593 50539, 93963 21369, 98667 60498.

## 25న సేంద్రియ బత్తాయి, మునగ, నిమ్మ సాగుపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులోని రైతు శిక్షణ కేంద్రంలో ఈ నెల 25(ఆదివారం)న ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో బత్తాయి, మునగ, నిమ్మ తోటల సాగుపై రైతు శాస్త్రవేత్తలు నాగరాజు (అనంతపురం జిల్లా బసంపల్లి), అంజిరెడ్డి (నల్లగొండ జిల్లా) శిక్షణ ఇస్తారు. కషాయాలు, ద్రావణాల తయారీపై కూడా ఉ. 10 గం.ల నుంచి సా. 4 గం.ల వరకు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 97053 83666, 0863–2286255.

## 24న చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ

చిరుధాన్యాల శుద్ధి, వివిధ ఆహారోత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వ్యూహాలు తదితర అంశాలపై మిల్లెట్స్ రంగంలో స్టార్టప్ వాణిజ్యవేత్తలుగా ఎదగాలనుకునే యువతకు ఈ నెల 24న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్) ఆవరణలోని న్యూట్రిహబ్‌లో నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. ఫీజు రూ. 1,600. వివరాలకు.. 040–24599379, 29885838, 94904 76098, www.nutrihub-tbi-iimr.org

## ఇంటిపంటలపై రెండో, నాలుగో శనివారాల్లో శిక్షణ

సేంద్రియ వ్యవసాయం, ఇంటిపంటల విస్తరణకు కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ.) సికింద్రాబాద్ తార్నాక(నాగార్జుననగర్)లోని తన కార్యాలయంలో ప్రతి నెలా రెండో, నాలుగో శనివారాల్లో ఇంటిపంటల సాగుపై ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనుంది. మ. 2 గం.ల నుంచి 5 గం.ల వరకు శిక్షణ ఇస్తారు. తొట్టతొలిగా సేంద్రియ ఇంటిపంటల సాగు చేపట్టే వారికి తోడ్పడేందుకు సీఎస్‌ఏ 'మన ఇంటి పంట కిట్'ను రూపొందించింది. 10 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల వేపపిండి, 2 కిలోల కోకోపిట్, 12 రకాల కూరగాయల విత్తనాలు, అరలీటరు సహజ కీటక నాశని, గార్డెన్ ఫోర్క్, పురుగులను అరికట్టే 2 జిగురు పళ్లాలు, 'మన ఇంటిపంట' పుస్తకం ఈ కిట్‌లో ఉంటాయి. ధర రూ. 650. ఈ కిట్ కొన్న వారికి శిక్షణ ఉచితం. రిజిస్ట్రేషన్ వివరాలకు.. రవి వర్మ – 63029 46365




● ప్రతీక్ తివారీ

1. ఇళ్లపైన సేంద్రియ ఇంటిపంటలను ప్రోత్సహించడానికి చెందిన అగ్రి ఇంజనీర్ ప్రతీక్ తివారీ ఆరేళ్ల క్రితం జైపూర్‌లో 'లివింగ్ గ్రీన్స్' సంస్థను ఏర్పాటు చేసి.. తేలికపాటి సిల్పాలిన్ మడులను విలక్షణంగా రూపొందించారు. వీటిని మడిచి తీసుకెళ్లవచ్చు.
2. చీడపీడల నియంత్రణకు గ్రీజు పూసిన అట్టలు వాడుతున్నారు.
3. మడులపైన ఉండే ఫ్రేమ్‌కు షేడ్‌నెట్ కూడా వేసుకోవచ్చు.

### పాడి పశువులకు మేపే పచ్చి మేతల్లో రకాలు - పోషక విలువలు

| పచ్చిమేత రకం | పచ్చిమేతలో ఎండుపదార్థం% | జీర్ణమయ్యే మాంసకృత్తులు% | శక్తినిచ్చే పోషకాలు% | సున్నం% |
|---|---|---|---|---|
| **పప్పు జాతి మేతలు:** | | | | |
| 1. బర్సీం, లూసర్న్ | 15 | 14.0 | 65.0 | 1.75–20 |
| 2. జనుము, పిల్లిపెసర, అలసంద, అనుము | 20 | 12.0 | 65.0 | 1.5 |
| 3. స్టైలో (హెమటా, స్కాబ్ర సిరాట్రో) | 20 | 12.0 | 65.0 | 1.5 |
| 4. సుబాబుల్, హెడ్జ్ లూసర్న్ | 25 | 15.0 | 60.0 | 1.5–2.0 |
| **ధాన్యపు జాతులు:** మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాలు,ఓట్సు | 20 | 4.0 | 55.0 | 0.5 |
| **బహువార్షిక జాతులు:** హైబ్రిడ్ నేపియర్, గినిగడ్డి, పారాగడ్డి.. | 25 | 4.0 | 50.0 | 0.3 |




# పచ్చిమేతల ఎంపిక ఎలా?

మేలు జాతి పాడి పశువుల పెంపకం లాభదాయకంగా చేపట్టాలనుకునే రైతులు పచ్చిమేత, పశు దాణా ప్రాముఖ్యత గురించి శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి. పాడి పశువుల పెంపకంలో 60–70% నిర్వహణ ఖర్చు మేపు పైనే ఉంటుంది. మేపు ఖర్చు ఎంత తగ్గితే నికర లాభం అంత పెరుగుతుంది. డెయిరీ రైతులు మేలు జాతి పాడి పశువులను ఎంపిక చేసుకొని పోషిస్తున్నప్పటికీ.. వాటిలో జన్యుపరంగా అధిక పాలిచ్చే లక్షణాలున్నప్పటికీ – వాటికి తగినంత మేత, పాల ఉత్పత్తికి అనుగుణంగా దాణా ఇచ్చినప్పుడే ఆశించిన పాల ఉత్పత్తి పొందగలరు. మేలైన పచ్చి మేతల ఎంపిక, పెంపకం, వినియోగంపై వివరాలు తెలుసుకుందాం.

సాధారణంగా రైతులు పశువులకు అందించే వడిగడ్డి, చొప్ప లాంటి ఎండు మేత వాటి కడుపు నిండడానికి మాత్రమే సరిపోతుంది. కానీ ఎండు మేతలో ఎలాంటి పోషక పదార్థాలుండవు.

కాబట్టి పశుమేతలో ఎండు మేతతో పాటు తప్పనిసరిగా పచ్చిమేత కూడా ఉండాలి. పచ్చిమేతలో కూడా పప్పుజాతి(ద్విదళం) పచ్చిమేత ఒక పాలు, ధాన్యపు జాతి(ఏకదళం) పచ్చిమేత మూడు పాళ్లు మేపాలి. పశువు బరువుననుసరించి 25–30 కిలోల వరకు మేపినట్లయితే తగిన రీతిలో పాల ఉత్పత్తి జరుగుతుంది. అంతేగాక 5 లీటర్లకు మించి పాలు ఉత్పత్తి సామర్థ్యం గల పశువులకు పచ్చిమేతతోపాటు సమీకృత దాణా అందించవలసి ఉంటుంది.

పాడి పశువుల శరీర అవసరాలను బట్టి మేపును రెండు రకాలుగా విభజించవచ్చు. 1. నిర్వాహక మేపు. 2. ఉత్పత్తి మేపు. నిర్వాహక మేపు: గడ్డికి సంబంధించినది. గడ్డి పశువుకు కడుపు నింపి, సంతృప్తిని, శరీర నిర్వహణకు అవసరమయ్యే పోషకాలను అందిస్తుంది. అందుకే పశుగ్రాసాన్ని పశువు శరీర బరువును బట్టి ఎంత పరిమాణంలో కావాలో లెక్కించి ఇవ్వవలసి ఉంటుంది. ఉత్పత్తి మేపు: దాణాకు సంబంధించింది. దాణా ద్వారా లభించే పోషకాలు పాల ఉత్పత్తికి ఎక్కువగా ఉపయోగపడతాయి. కాబట్టి నిర్వాహక మేపు, ఉత్పత్తి మేపుపై తగు శ్రద్ధవహించవలసి ఉంటుంది.

### పచ్చిమేతలో పోషక పదార్థాలు

| | మాంసకృత్తులు | పిండి పదార్థాలు | పీచు పదార్థాలు |
|---|---|---|---|
| ఎ) పప్పు జాతి పచ్చిమేత | 16–20% | 35–40% | 18–38% |
| బి) ధాన్యపు జాతి పచ్చిమేత | 3–4% | 40–45% | 30–38% |

### కాలాన్ని బట్టి పచ్చి/ఎండు మేత వినియోగం

| పశువు పాల ఉత్పత్తి | పచ్చిమేత (రోజుకు) కిలోలు | ఎండుమేత (రోజుకు) కిలోలు |
|---|---|---|
| పచ్చిమేత లభించే కాలంలో 5–15 కిలోల వరకు | 30 | 4 |
| పచ్చిమేత లభించని కాలంలో 5–11 కిలోల వరకు | 4 | 8 |

## ఎకరంలో పెరిగే పచ్చిమేతను 5-6 పశువులకు మేపవచ్చు

పచ్చిమేతలో ఉండే విటమిన్–ఎ వలన పశువులు ఆరోగ్యంగా ఉండి, సకాలంలో చూలు కట్టి పాల ఉత్పాదన పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చులు తగ్గి పాల ఉత్పత్తి లాభసాటిగా ఉంటుంది. రోజుకు ఒక పాడి పశువుకు 30–40 కిలోల చొప్పున, సంవత్సరానికి 11–12 టన్నుల పచ్చిమేత అవసరమవుతుంది. నీటి వసతి గల ఎకరం భూమిలో పండించే పచ్చిమేత 5–6 పశువుల పోషణకు సరిపోతుంది. వర్షాధార భూములలో సాగు చేస్తే రెండు పశువులకు సరిపోతుంది.

పాడి రైతులు పచ్చిమేతను కొని మేపలేరు. సొంత భూమిలో లేదా కౌలు భూమిలోనైనా సొంతంగానే సాగు చేసుకోవాలి. దీని ద్వారా సంవత్సరం పొడవునా పచ్చిమేత పొందడమే కాక దాణా ఖర్చును కూడా కొంతమేర తగ్గించుకోవచ్చు.

## పచ్చిమేత, ఎండుమేత ఎంతెంత ఇవ్వాలి?

పాల దిగుబడిని బట్టి పాడి పశువులకు తగినంత దాణాతోపాటు రోజుకు పచ్చిమేత, ఎండుమేతలను నిర్దేశిత మోతాదు ప్రకారం ఇవ్వడం ద్వారా లాభదాయకంగా పాల దిగుబడి పొందవచ్చు. పచ్చిమేత లభించే కాలంలో కిలో నుంచి 3 కిలోల మధ్య పశువు గేదా, ఆవా అన్నదాన్ని బట్టి, ఎంత పాల దిగుబడి ఉందన్న దాన్ని బట్టి తగిన పరిమాణంలో సమీకృత దాణా ఇవ్వాల్సి ఉంటుంది.

మేలురకం పచ్చిమేత విత్తనాలు, బహువార్షిక పశుగ్రాసాల సాగుకు పిలకల కొరకు సమీప పశు వైద్యశాలల్లోని నిపుణులను సంప్రదించవచ్చు.

*(వివిధ రకాల పచ్చి మేత రకాల సాగు వివరాలు.. వచ్చే వారం)*

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం 20-8-2019




# విదేశీ విద్యకు ఉపకారం

**నేడు చాలా మంది విద్యార్థులకు విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కోరిక. కానీ, ఫీజులు, ఇతరత్రా ఖర్చులు గుర్తొచ్చి వెనకడుగేస్తుంటారు. ప్రతిభావంతులకు ఆర్థిక అవరోధాలు అడ్డురాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వాలతోపాటు పలు సంస్థలు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయి. విదేశీ విద్యను ప్రోత్సహిస్తున్నాయి. అయితే విదేశీ విద్యకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్స్ గురించి విద్యార్థులకు సరైన అవగాహన లేక అవకాశాలు అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో.. విదేశీ విద్య ఔత్సాహికులకు ఉపయోగపడేలా ఫారిన్ స్కాలర్‌షిప్‌పై ప్రత్యేక కథనం..**

## ఫుల్‌బ్రైట్-నెహ్రూ ఫెలోషిప్స్

యునైటెడ్ స్టేట్స్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్(యూఎస్ఐఈఎఫ్), ఫుల్‌బ్రైట్ కమిషన్ (ఇండియా)లు 1950 నుంచి ఫుల్‌బ్రైట్-నెహ్రూ ఫెలోషిప్‌లను సంయుక్తంగా అందిస్తున్నాయి. భారత్, అమెరికాలకు చెందిన ప్రతిభావంతులు వీటిని అందుకొనేందుకు అర్హులు. అమెరికా యూనివర్సిటీల్లో ఆర్ట్స్, కల్చర్, మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన భారత విద్యార్థులు, విజిటింగ్ స్టూడెంట్ రీసెర్చర్లకు ఫెలోషిప్ లభిస్తుంది. అదే విధంగా అమెరికాలో టీచింగ్, పరిశోధనా కార్యకలాపాల్లో పాల్గొనే వారు కూడా స్కాలర్స్ అండ్ టీచర్స్ అవార్డులు పొందే వీలుంది. ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు, నివాస ఖర్చులకు అవసరమైన మొత్తం అందుతుంది.

» వెబ్‌సైట్: www.usief.org.in

## ఇన్‌లాక్స్ స్కాలర్‌షిప్స్

ఇన్‌లాక్స్ శివ్‌దాసానీ ఫౌండేషన్... ఇన్‌లాక్ స్కాలర్‌షిప్స్‌ను 1976 నుంచి అందిస్తోంది. శాస్త్రీయ, సాంస్కృతిక, కళాత్మక విభాగాల్లో ప్రతిభావంతులైన యువత వీటిని పొందేందుకు అర్హులు. భారత్‌తోపాటు అమెరికా, యూరప్, యూకేల్లోని ఇన్‌స్టిట్యూట్స్‌లో మాస్టర్స్, ఎంఫిల్, డాక్టోరల్ కోర్సులు చదువుకొనేందుకు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2008 నుంచి రీసెర్చ్ అండ్ ట్రావెల్ గ్రాంట్‌ను అందుబాటులో తెచ్చారు. దీనికింద భారత్‌లోని వివిధ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సుకు నమోదు చేసుకున్న విద్యార్థులు మెటీరియల్ సేకరణ, నిపుణులను కలిసేందుకు స్వల్పకాలిక విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు. ఆయా పర్యటనలకు అయ్యే మొత్తాన్ని గ్రాంట్‌గా అందిస్తారు. అదేవిధంగా విదేశీ విశ్వవిద్యాలయాల్లో మాస్టర్స్ డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సైతం ఇన్‌లాక్స్ ఫెలోషిప్ లభిస్తుంది. ప్రతి ఏటా జనవరి 15 నుంచి దరఖాస్తు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఏప్రిల్ 15. దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేసి.. పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు.

» వెబ్‌సైట్: www.inlaksfoundation.org

## కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్

అభివృద్ధికి నోచుకోని, అభివృద్ధి చెందుతున్న కామన్వెల్త్ దేశాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు యూకే వర్సిటీల్లో ఫుల్‌టైమ్ మాస్టర్స్ కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించడమే కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్ ప్రధాన ఉద్దేశం. ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను యూకే వర్సిటీలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయి. దీనికి అవసరమైన నిధులను యూకే డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (డీఎఫ్ఐడీ)సమకూరుస్తోంది. మొత్తం ఆరు థీమ్స్‌తో ఫెలోషిప్స్‌ను అందిస్తున్నారు. పీజీ స్థాయిలో అన్ని కోర్సుల విద్యార్థులు వీటిని పొందవచ్చు. స్కాలర్‌షిప్ కింద ట్యూషన్ ఫీజు మినహాయింపు లభిస్తుంది.

» వెబ్‌సైట్: cscuk.dfid.gov.uk

## గ్రేట్ బ్రిటన్ స్కాలర్‌షిప్స్

యూకేలో విదేశీ విద్యార్థులకు లభిస్తున్న ప్రధానమైన స్కాలర్‌షిప్ అవకాశం... గ్రేట్ బ్రిటన్ స్కాలర్‌షిప్స్. ఈ స్కాలర్‌షిప్స్‌ను బ్రిటిష్ కౌన్సిల్ అందిస్తోంది. యూనివర్సిటీని బట్టి స్కాలర్‌షిప్ మొత్తం నిర్ణయం అవుతుంది. యూకేలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరే విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. పీజీ కోర్సులకు ఐదు నుంచి ఏడు వేల పౌండ్ల వరకు స్కాలర్‌షిప్‌గా లభిస్తుంది.

» వెబ్‌సైట్: www.britishcouncil.in

## చార్లెస్ వాలెస్ ఇండియా ట్రస్ట్ స్కాలర్‌షిప్స్

పోస్టు గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ కోర్సుల విద్యార్థులు చార్లెస్ వాలెస్ ఇండియా ట్రస్ట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. కనిష్ఠంగా మూడు వేల పౌండ్ల నుంచి గరిష్ఠంగా ఏడు వేల పౌండ్ల మేర లభిస్తుంది. ఆర్ట్స్, హెరిటేజ్, కల్చర్ స్టడీస్ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

» వెబ్‌సైట్: www.britishcouncil.in

## ఛెవెనింగ్ స్కాలర్‌షిప్స్

యూకే ప్రభుత్వం నేరుగా అందిస్తున్న స్కాలర్‌షిప్స్.. ఛెవెనింగ్ స్కాలర్‌షిప్స్. ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు యూకేలోని యూనివర్సిటీల్లో ఏడాది వ్యవధి గల మాస్టర్ కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్. పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో అన్ని కోర్సుల విద్యార్థులు వీటిని పొందవచ్చు. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు మినహాయింపు లభిస్తుంది. విద్యార్థులు యూకే యూనివర్సిటీ నుంచి పొందిన అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా ఛెవెనింగ్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపిక విధానంలో అభ్యర్థుల అకడమిక్ ట్రాక్ రికార్డ్‌తోపాటు ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్ నిర్వహించి తుది జాబితా విడుదల చేస్తారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 5, 2019న ముగియనుంది.

» వెబ్‌సైట్: www.chevening.org

## టాటా స్కాలర్‌షిప్స్

ప్రతిభ ఉండి.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు టాటా స్కాలర్‌షిప్‌లు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటిని టాటా ట్రస్ట్‌లు అందిస్తున్నాయి. టాటా స్కాలర్‌షిప్స్‌లో భాగంగా ప్రొఫెషనల్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ గ్రాంట్/ట్రావెల్ స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ స్కాలర్‌షిప్ కింద భారత విద్యార్థులు విదేశాల్లో పర్యటించేందుకు అవసరమైన నిధులు అందిస్తారు. వీటితోపాటు ఎండోమెంట్ లోన్ స్కాలర్‌షిప్స్, టాటా-కార్నెల్ యూనివర్సిటీ, మెడికల్-హెల్త్ కేర్ స్కాలర్‌షిప్‌లు, ఉమెన్ స్కాలర్‌షిప్ ఫర్ న్యూరోసైన్స్ తదితర స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి.

» వెబ్‌సైట్: www.tatatrusts.org

## ఆస్ట్రేలియా అవార్డ్స్ స్కాలర్‌షిప్స్

ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ ట్రేడ్ వీటిని అందిస్తోంది. ఆస్ట్రేలియాలో పీజీ, పోస్ట్ డాక్టోరల్ స్థాయి కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ఆస్ట్రేలియా అవార్డ్స్ స్కాలర్‌షిప్స్ అందిస్తున్నారు. ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపుతోపాటు రీసెర్చ్, అకడమిక్ వ్యయాలకు సరిపడే మొత్తం స్కాలర్‌షిప్‌గా లభిస్తుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» వెబ్‌సైట్: dfat.gov.au

## సింగపూర్ మిలీనియం స్కాలర్‌షిప్స్

సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రీ-డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఔత్సాహికులు సింగపూర్ మిలీనియం స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఎస్సీ విద్యార్థులకు నెలకు 2000 సింగపూర్ డాలర్లు; పీహెచ్‌డీ విద్యార్థులకు 3వేల సింగపూర్ డాలర్లు, పోస్ట్ డాక్టోరల్ అభ్యర్థులకు అయిదు వేల సింగపూర్ డాలర్లు లభిస్తాయి.

» వెబ్‌సైట్: http://www.singaporemillenniumfoundation.com.sg

## ఫెలిక్స్ స్కాలర్‌షిప్

**ఫారెన్ ఎడ్యుకేషన్‌కు స్కాలర్‌షిప్‌ల ఊతం**

**ప్రతిభ, ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఎంపిక**

**అందిపుచ్చుకుంటే ఉజ్వల భవితకు మార్గం**

ఇవి యూకే యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన భారత విద్యార్థులతోపాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్స్. అత్యుత్తమ ప్రతిభావంతులకు ఫెలిక్స్ స్కాలర్‌షిప్స్ లభిస్తుంది. ప్రతి విద్యాసంవత్సరంలో 20 మందికి ఈ స్కాలర్‌షిప్స్ అందిస్తారు. వీటికి ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు మినహాయింపు లభిస్తుంది.

» వెబ్‌సైట్: www.felixscholarship.org

## గేట్స్ కేంబ్రిడ్జ్ స్కాలర్‌షిప్స్

బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ గేట్స్ కేంబ్రిడ్జ్ స్కాలర్‌షిప్స్ అందిస్తోంది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఫుల్‌టైమ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అత్యున్నత ప్రతిభ, కోర్సులో చేరడానికి కారణాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే అంకిత భావం తదితర లక్షణాలు కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులు యూనివర్సిటీ ఫీజు, నివాస ఖర్చులు, డిపెండెంట్స్ అలవెన్స్‌లు పొందొచ్చు. 2020కు సంబంధించి 2019 సెప్టెంబర్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

» వెబ్‌సైట్: www.gatescambridge.org

## హార్న్‌బై ఎడ్యుకేషనల్ ట్రస్ట్

యూకేలోని ఎ.ఎస్.హార్న్‌బై ఎడ్యుకేషనల్ ట్రస్ట్ దాదాపు ఐదు దశాబ్దాల నుంచి ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ప్రధానంగా యూనివర్సిటీ ఆఫ్ వార్విక్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో పీజీ డిగ్రీ కోర్సులు చదివే వారికి వీటిని అందిస్తున్నారు. అంతేకాకుండా సదరు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయానికే స్వదేశంలో ఇంగ్లిష్ బోధనలో అనుభవం పొంది ఉండాలి.

» వెబ్‌సైట్: https://www.britishcouncil.in/study-uk/scholarships/charles-wallace-trust/hornby

## జపనీస్ గవర్నమెంట్ స్కాలర్‌షిప్స్

హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, ఐటీ, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్ సహా 17 విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది. ఎంపికైన వారికి రెండేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుంది. దీంతోపాటు ట్యూషన్ ఫీజు కూడా మినహాయింపు ఉంటుంది.

» వెబ్‌సైట్: www.in.emb-japan.go.jp

## ఐఈఎల్‌టీఎస్ అవార్డ్స్

యూకేలోని యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించే ఐఈఎల్‌టీఎస్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి బ్రిటిష్ కౌన్సిల్.. ఐఈఎల్‌టీఎస్ అవార్డ్స్ అందిస్తోంది.ఎంపిక ప్రక్రియ ఐఈఎల్‌టీఎస్‌లో సాధించిన స్కోర్ కీలకం. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు కోసం రూ.మూడు లక్షలు అందజేస్తారు.

» వెబ్‌సైట్: www.ielts.org

## ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్-జపాన్ స్కాలర్‌షిప్

జపాన్‌లోని యూనివర్సిటీల్లో ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో ఎంఏ/పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందిన ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సభ్యదేశాల విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏటా 150 మందికి ఏడీబీ బ్యాంక్ ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపుతోపాటు నివాస వ్యయం, ఇతర అకడమిక్ సంబంధిత వ్యయాలకు సరిపడే మొత్తాన్ని చెల్లిస్తారు.

» వెబ్‌సైట్: www.adb.org

## హ్యూబర్ట్ హంఫ్రే ఫెలోషిప్ ప్రోగ్రామ్

అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న ప్రోత్సాహకం... హ్యూబర్‌ట హంఫ్రే ఫెలోషిప్ ప్రోగ్రామ్. కనీసం ఐదేళ్ల ప్రొఫెషనల్ అనుభవంతో అమెరికాలోని యూనివర్సిటీల్లో అడుగు పెట్టినవారు ఈ ఫెలోషిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యంగా సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, డెమొక్రటిక్ ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్, ఎడ్యుకేషన్, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్స్ పొందాలనుకునే వారికి పది నెలల పాటు ఈ ఫెలోషిప్ అందిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు, నివాస ఖర్చులకు సరిపడే మొత్తం లభిస్తుంది.

» వెబ్‌సైట్: www.humphreyfellowship.org

## ఆగాఖాన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

ఇది అమెరికాలోని యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. అకడెమిక్ రికార్డు, ఆర్థిక అవసరం ఆధారంగా ఎంపిక ఉంటుంది. దీనికి ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు మొత్తంలో 50 శాతాన్ని ఉచితంగా, మరో 50 శాతాన్ని రుణం రూపంలో అందిస్తారు.

» వెబ్‌సైట్: www.akdn.org

## బాంటింగ్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్స్

హెల్త్ సైన్స్, నేచురల్ సైన్సెస్, ఇంజనీరింగ్, సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్ విభాగాల్లో రీసెర్చ్ ఔత్సాహికులు బాంటింగ్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు చెందిన 70 మందికి వీటిని అందిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి 70 వేల డాలర్లు చొప్పున రెండేళ్లపాటు ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది.

» వెబ్‌సైట్: http://banting.fellowships-bourses.gc.ca

## వేనియర్ కెనడా గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్స్

కెనడియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్, నేచురల్ సైన్సెస్, ఇంజనీరింగ్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ కెనడా, సోషల్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ కెనడాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పథకం.. వేనియర్ కెనడా గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్స్. కెనడాలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న వారు ఈ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏటా 50 వేల డాలర్లు చొప్పున మూడేళ్లపాటు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు.

» వెబ్‌సైట్: http://www.vanier.gc.ca



### మరికొన్ని స్కాలర్‌షిప్స్

- ఆసియన్ ఉమెన్ ఇన్ బిజినెస్ స్కాలర్‌షిప్ ఫండ్
- కార్నెల్ యూనివర్సిటీ టాటా స్కాలర్‌షిప్
- ఫుల్‌బ్రైట్ నెహ్రూ రీసెర్చ్ ఫెలోషిప్
- ఎస్ఎన్ బోస్ స్కాలర్స్ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ఫర్ ఇండియన్ స్టూడెంట్స్
- స్టాన్‌ఫర్డ్ రిలయన్స్ ధీరూభాయి ఫెలోషిప్స్ ఫర్ ఇండియన్ స్టూడెంట్స్

# ఓయూ.. దూర విద్య

**ఉస్మానియా విశ్వవిద్యాలయం 2019-20 సంవత్సరానికి దూర విద్యా విధానంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. జూలై 18న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 31 వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో.. ఓయూ దూర విద్య విధానంలో అందిస్తున్న కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, ఫీజుల వివరాలు, ముఖ్యతేదీలు తదితరాలపై కథనం...**




### కోర్సులు ఇవే

» **ఎంబీఏ:**
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు టీఎస్/ఏపీ ఐసెట్ 2019లో అర్హత సాధించి ఉండాలి (లేదా) ప్రొఫెసర్ జి.రామలింగారెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ) నిర్వహించే ఎలిజిబిలిటీ టెస్టులో అర్హత సాధించి ఉండాలి.
- **ఫీజు:** సెమిస్టర్‌కు రూ.7,500

» **ఎంసీఏ:** మూడేళ్ళ ఈ కోర్సులో చేరేందుకు అర్హత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు టీఎస్/ఏపీ ఐసెట్ 2019లో అర్హత సాధించి ఉండాలి (లేదా) ప్రొఫెసర్ జి.రామలింగారెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ) నిర్వహించే ఎలిజిబిలిటీ టెస్టులో అర్హత సాధించి ఉండాలి.
- **ఫీజు:** సంవత్సరానికి రూ.12,000

» **ఎంఏ(ఉర్దూ/హిందీ/తెలుగు/సంస్కృతం/ఇంగ్లిష్):** సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.4,000.

» **ఎంఏ(ఫిలాసఫీ/సోషియాలజీ/పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్):** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.4000.

» **ఎంఏ(ఎకనామిక్స్/పొలిటికల్ సైన్స్/హిస్టరీ, సైకాలజీ):** సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.4,000, సైకాలజీ ఫీజు మాత్రం రూ.ఏడాదికి రూ.6,700.

» **ఎంకామ్:** బీకామ్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.4500.

» **ఎంఎస్సీ మ్యాథ్స్:** సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.4500.

» **ఎంఎస్సీ స్టాటిస్టిక్స్:** మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణత. ఫీజు ఏడాదికి రూ.4000.

» **బీఏ:** కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇంటర్ లేదా తత్సమాన అర్హత కలిగిన వారు దరఖాస్తుకు అర్హులు. ఫీజు ఏడాదికి రూ.2500.

» **బీఏ(మ్యాథ్స్,స్టాటిస్టిక్స్):** మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్ ఉత్తీర్ణత. ఫీజు ఏడాదికి రూ.2500.

» **బీకామ్(జనరల్):** ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఫీజు ఏడాదికి రూ.3,000.

» **బీబీఏ:** ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. ఫీజు ఏడాదికి రూ.6,000.

» **పీజీ డిప్లొమా(మ్యాథ్స్):** ఏడాది వ్యవధిలోని ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫీజు రూ.4000.

» **పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్:** ఏడాది వ్యవధిలోని ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫీజు రూ.4000.

» **పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్:** ఏడాది వ్యవధిలోని ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫీజు రూ.4000.

» **పీజీ డిప్లొమా ఇన్ బయోఇన్‌ఫర్మాటిక్స్:** ఏడాది వ్యవధిలోని ఈ కోర్సులో చేరేందుకు 50శాతం మార్కులతో బీఎస్సీ/ఎంఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ బీఫార్మసీ/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఈ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

» **పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్:** ఏడాది వ్యవధిలోని ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫీజు సెమిస్టర్‌కు రూ.5,250.

- **వివరాలకు:** http://www.oucde.net

### ఉద్యోగ సమాచారం

#### బ్యాంక్ ఆఫ్ బరోడాలో 25 పోస్టులు

వడోదర ప్రధాన కేంద్రంగా విధులు నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అనుబంధ శాఖ అయిన బరోడా సన్ టెక్నాలజీస్ లిమిటెడ్..25 ఐటీ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డేటా అనలిస్ట్-4, డేటా మేనేజర్-2, డేటా ఇంజనీర్-4, బిజినెస్ అనలిస్ట్-2, మొబిలిటీ అండ్ ఫ్రంట్ ఎండ్ డెవలపర్-6, ఇంటిగ్రేషన్ ఎక్స్‌పర్ట్-2, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎక్స్‌పర్ట్-4, టెక్నాలజీ ఆర్కిటెక్ట్-1.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం కూడా ఉండాలి.
- **వయసు:** 25-40 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్/క్వాలిఫైయింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600 +జీఎస్టీ; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.100+జీఎస్టీ.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 2, 2019.
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
20-8-2019



## సన్‌రైజర్స్ హైదరాబాద్ సహాయ కోచ్‌గా హాడిన్

ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ బ్రాడ్ హాడిన్ ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సహాయ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'ఆసీస్ మాజీ వైస్‌కెప్టెన్, 2015 వన్డే ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడైన హాడిన్‌ను అసిస్టెంట్ కోచ్‌గా నియమించాం' అని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ట్విట్టర్‌లో తెలిపింది. ఇంగ్లండ్ మాజీ కోచ్ అయిన ట్రెవర్ బేలిస్ గత నెలలోనే సన్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. బేలిస్ బృందంలో హాడిన్ పనిచేయనున్నాడు. 2016లో ఐపీఎల్ చాంపియన్ అయిన సన్‌రైజర్స్ గడిచిన నాలుగు సీజన్లలో ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధించింది.

# కోహ్లి 'ఏకాదశి'

### అంతర్జాతీయ క్రికెట్‌లో 11 ఏళ్లు పూర్తి





**ఆంటిగ్వా:** క్రికెట్ రికార్డులకు కొత్త పాఠాలు నేర్పుతూ ఎన్నో ఘనతలను తన ఖాతాలో వేసుకున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో 11 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. 2008 ఆగస్టు 18న అతను తన తొలి మ్యాచ్ ఆడాడు. ఈ సందర్భంగా తన భావోద్వేగాలను పంచుకున్నాడు. నాటి తొలి మ్యాచ్ ఫోటో, తాజా ఫోటోలను తన స్పందనకు కలిపి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. '2008లో సరిగ్గా ఇదే రోజు ఒక టీనేజర్‌గా కెరీర్ మొదలు పెట్టడం నుంచి 11 ఏళ్ల తర్వాత ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే... దేవుడు నాపై తన ఆశీస్సులు ఇంతగా కురిపిస్తాడని కలలో కూడా అనుకోలేదు. సరైన దిశలో నడుస్తూ మీ అందరూ కలలు నెరవేర్చుకునేలా శక్తినివ్వాలని కోరుకుంటున్నా. ఎప్పటికీ కృతజ్ఞుడిని' అని కోహ్లి వ్యాఖ్యానించాడు. 11 ఏళ్ల కెరీర్‌లో మూడు అంతర్జాతీయ ఫార్మాట్‌లలో కలిపి 386 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 20,502 పరుగులు చేశాడు.

## కోహ్లికి స్మిత్‌కు మధ్య 9 పాయింట్లే

### ఐసీసీ టెస్టు బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్



**దుబాయ్:** సంవత్సరం పాటు ఆటకు దూరమైనా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మాత్రం ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్ మళ్లీ దూసుకొచ్చాడు. తాజాగా ప్రకటించిన టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మిత్ రెండో స్థానానికి (913 రేటింగ్ పాయింట్లు) చేరుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 378 పరుగులు చేసిన స్మిత్... కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను వెనక్కి తోసి కోహ్లి తర్వాతి స్థానంలో నిలిచాడు. భారత కెప్టెన్ విరాట్ కోహ్లి (922) ఈ జాబితాలో నంబర్‌వన్‌గానే కొనసాగుతున్నాడు. యాషెస్‌లో స్మిత్‌కు మరో మూడు టెస్టులు మిగిలి ఉండగా, కోహ్లి విండీస్‌తో రెండు టెస్టులు ఆడనున్నాడు. ఇద్దరి మధ్య పాయింట్ల తేడా 9 మాత్రమే కావడంతో అగ్రస్థానానికి ఇప్పుడు హోరాహోరీ పోటీ తప్పదు. కోహ్లితో పాటు టాప్-10లో భారత్ నుంచి పుజారా (4వ స్థానంలో) ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా (5వ ర్యాంక్), అశ్విన్ (10వ ర్యాంక్) టాప్-10లో ఉండగా... ప్యాట్ కమిన్స్ (914 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌పై సెంచరీ సాధించిన కరుణరత్నే (8వ ర్యాంక్) నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని టాప్-10లోకి అడుగు పెట్టగా...వరుసగా విఫలమవుతున్న జో రూట్ 6 నుంచి 9వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జేసన్ హోల్డర్ నంబర్‌వన్‌గా నిలిచాడు.

## సాక్షి మళ్లీ శిబిరానికి....

### సంతృప్తికర వివరణతో ఓకే అన్న డబ్ల్యూఎఫ్ఐ



**న్యూఢిల్లీ:** జాతీయ శిక్షణ శిబిరంలో తిరిగి చేరేందుకు భారత మహిళా స్టార్ రెజ్లర్ సాక్షి మలిక్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అనుమతించింది. సమాచారం ఇవ్వకుండా శిబిరం నుంచి నిష్క్రమించడంతో మొదట ఆగ్రహించిన సమాఖ్య వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. మొత్తం 25 మంది మాట మాత్రమైనా చెప్పకుండా, సంబంధిత వర్గాల అనుమతి లేకుండానే శిబిరం నుంచి జారుకున్నారు. ఇందులో 2016 రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి (62 కేజీలు)తో పాటు సీమా (50 కేజీలు), కిరణ్ (76 కేజీలు) ఉన్నారు. ఈ ముగ్గురు ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత సంపాదించారు. బుధవారం లోగా వివరణ ఇవ్వాలని డబ్ల్యూఎఫ్ఐ ఆదేశించగా సాక్షి... రక్షాబంధన్ వేడుకలో పాల్గొనేందుకే శిబిరం నుంచి పయనమైనట్లు వివరించింది. దీనిపై డబ్ల్యూఎఫ్ఐ ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆమె తిరిగి శిబిరంలో కొనసాగేందుకు అనుమతిచ్చారు.

## హరియాణా స్టీలర్స్ గెలుపు



**చెన్నై:** తెలుగు టైటాన్స్ ఇచ్చిన షాక్ నుంచి హరియాణా స్టీలర్స్ త్వరగానే తేరుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 30-27తో మాజీ చాంపియన్ యు ముంబాపై గెలిచింది. సీజన్‌లో అద్భుత ఫామ్ కనబరుస్తోన్న హరియాణా రైడర్ వికాశ్ ఖండోలా 9 పాయింట్లతో 'టాప్' స్కోరర్‌గా నిలిచాడు. ముంబై ఆటగాళ్లు అభిషేక్ సింగ్ (6 పాయింట్లు), సందీప్ నర్వాల్ (5 పాయింట్లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధ 31-24తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. యూపీ రైడర్లు సురేందర్ గిల్ (8 పాయింట్లు), శ్రీకాంత్ జాదవ్ (7 పాయింట్లు) రాణించారు. నేడు ప్రొ కబడ్డీ లీగ్‌లో విశ్రాంతి దినం. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో బెంగళూరు బుల్స్; జైపూర్ పింక్ పాంథర్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

## రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్



**నార్త్ కరోలినా (అమెరికా):** భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ విన్‌స్టన్ సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో 89వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 6-3, 6-4తో మార్సెల్ స్టెబె (జర్మనీ)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేసిన ప్రజ్నేశ్ మ్యాచ్‌లో ఐదు ఏస్‌లను సంధించాడు.

**బోపన్న జంట ఔట్...:** డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టింది. ఈ జోడీ 3-6, 3-6తో నికోలస్-సాండ్‌గ్రెన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడింది.

# శ్రమించి... శుభారంభం





శ్రీకాంత్

పురుషుల సింగిల్స్‌లో మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణ తెరదించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులు తొలి రౌండ్ అడ్డంకిని శ్రమించి అధిగమించారు. శ్రీకాంత్, ప్రణయ్ ఒక్కో గేమ్ కోల్పోయి విజయాన్ని అందుకోగా... సాయిప్రణీత్ వరుస గేముల్లో గెలుపొంది రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు.

- తొలి రౌండ్‌లో గట్టెక్కిన శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**బాసెల్ (స్విట్జర్లాండ్):** తమకంటే తక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను ఓడించడానికి భారత బ్యాడ్మింటన్ స్టార్స్ చెమటోడ్చాల్సి వచ్చింది. ఒకదశలో ఊహించని ఫలితం వస్తుందేమోననే అనుమానం కలిగినా... సరైన సమయంలో ఫామ్‌లోకి వచ్చిన భారత ఆటగాళ్లు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలి రౌండ్‌ను విజయవంతంగా దాటారు. ప్రపంచ మాజీ నంబర్‌వన్, ప్రస్తుత పదో ర్యాంకర్ కిడాంబి శ్రీకాంత్, ప్రపంచ 19వ ర్యాంకర్ భమిడిపాటి సాయిప్రణీత్, ప్రపంచ 30వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఈ మెగా ఈవెంట్‌లో రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ శ్రీకాంత్ 66 నిమిషాల్లో 17-21, 21-16, 21-6తో ప్రపంచ 81వ ర్యాంకర్ ఎన్ హట్ ఎన్గుయెన్ (ఐర్లాండ్)పై... సాయిప్రణీత్ 40 నిమిషాల్లో 21-17, 21-16తో 66వ ర్యాంకర్ జేసన్ ఆంథోని హో-షుయె (కెనడా)పై... ప్రణయ్ 59 నిమిషాల్లో 17-21, 21-10, 21-11తో 93వ ర్యాంకర్ ఈటూ హీనో (ఫిన్‌లాండ్)పై విజయం సాధించారు.

గత ప్రపంచ చాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లోనూ ఎన్‌హట్ ఎన్గుయెన్‌తోనే ఆడిన శ్రీకాంత్ నాడు రెండు గేముల్లో గెలుపొందగా... ఈసారి మాత్రం మూడు గేముల్లో గట్టెక్కాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన శ్రీకాంత్ రెండో గేమ్‌లోనూ గట్టిపోటీ ఎదుర్కొన్నాడు. అయితే స్కోరు 17-16 వద్ద ఒక్కసారిగా విజృంభించిన ఈ ఆంధ్ర ప్రదేశ్ ఆటగాడు వరుసగా నాలుగు పాయింట్లు సాధించి గేమ్‌ను దక్కించుకున్నాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో కోచ్ పుల్లెల గోపీచంద్ తొలి పాయింట్ నుంచే దూకుడుగా ఆడాలని శ్రీకాంత్‌కు సూచించాడు. తొలి పాయింట్ కోల్పోయాక... శ్రీకాంత్ తన జోరు పెంచాడు. స్మాష్‌లతో చెలరేగిపోయాడు. ఫలితంగా వరుసగా 11 పాయింట్లు గెలిచి 11-1తో ఆధిక్యంలోకి వెళ్లి ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు.

డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ కెంటో మొమోటా (జపాన్), చైనా దిగ్గజం లిన్ డాన్, నాలుగో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా), ఆరో సీడ్ ఆంథోని జిన్‌టింగ్ (ఇండోనేసియా), ఐదో సీడ్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), మూడో సీడ్ చెన్ లాంగ్ (చైనా) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో మేఘన-పూర్విషా (భారత్) జంట 21-10, 21-18తో డయానా-నిక్తె సోటోమేయర్ (గ్వాటెమాలా) జోడీపై గెలిచింది.

## బ్యాటింగ్ కోచ్ ఎవరో?

### కొనసాగుతున్న ఇంటర్వ్యూలు



రాథోడ్



రాజ్‌పుత్

**ముంబై:** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి పేరు ఖరారైన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి ఇతర సహాయక సిబ్బందిపై పడింది. టీమిండియా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లను ఎంపిక చేసేందుకు బీసీసీఐ కసరత్తు ప్రారంభించింది. సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని బృందం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. సోమవారం ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, గురువారం వరకు కొనసాగే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం ఎంపికైనవారి జాబితాను ప్రకటిస్తారు. ఈ ఎంపిక విషయంలో రవిశాస్త్రి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారా లేక ఎంపిక కమిటీ తమదైన శైలిలో తగిన వ్యక్తులను ఎంపిక చేస్తుందా అనేది ఆసక్తికరం.

**ముందంజలో విక్రమ్ రాథోడ్ ...**

2014 నుంచి భారత బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న సంజయ్ బంగర్ పనితీరు నిజానికి బాగుంది. చాలా మంది బ్యాట్స్‌మెన్ అతని హయాంలో తమ ఆటతీరు మెరుగైందని, సాంకేతిక విషయాల్లో కూడా లోపాలు తీర్చిదిద్దారని బహిరంగంగానే చెప్పారు. అయినా సరే బంగర్ పదవి భద్రంగా లేదు. అనేక మంది దీని కోసం పోటీ పడుతున్నారు. కారణాలేమైనా రవిశాస్త్రి కూడా భరత్ అరుణ్, ఆర్. శ్రీధర్‌ల గురించి మాట్లాడినంత సానుకూలంగా బంగర్ గురించి చెప్పలేదు. దాంతో కొత్త వ్యక్తికి అవకాశం దక్కవచ్చని వినిపిస్తోంది. హెడ్ కోచ్ పదవికి ప్రయత్నించి విఫలమైన లాల్‌చంద్ రాజ్‌పుత్ ఈసారి బ్యాటింగ్ కోచ్ కోసం తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అయితే అంతర్గత సమాచారం ప్రకారం మాజీ ఓపెనర్ విక్రమ్ రాథోడ్ వైపు ఎక్కువగా మొగ్గు కనిపిస్తోంది. వీరిద్దరితో పాటు ప్రవీణ్ ఆమ్రే, అమోల్ మజుందార్ కూడా గట్టి పోటీనిస్తున్నారు. సౌరాష్ట్ర కోచ్ సితాన్షు కొటక్, హృషికేశ్ కనిత్కర్, మిథున్ మన్హాస్ కూడా ఇంటర్వ్యూకు హాజరు కానున్నారు.

**రోడ్స్‌కు కష్టమే!**

బౌలింగ్ కోచ్ పదవి కోసం ప్రస్తుత కోచ్ భరత్ అరుణ్‌తో పాటు వెంకటేశ్ ప్రసాద్, పారస్ మాంబ్రే, అమిత్ భండారి బరిలో ఉన్నారు. వీరంతా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మరోవైపు జాంటీ రోడ్స్‌లాంటి దిగ్గజం పోటీలో నిలిచినా ప్రస్తుత ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని తెలుస్తోంది. ఇన్నేళ్లుగా భారత్ ఫీల్డింగ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన శ్రీధర్‌కు రవిశాస్త్రి అండదండలు ఉండటమే దీనికి కారణం. టీమిండియా ప్రస్తుత ప్రమాణాలు శ్రీధర్ ఘనతే కాబట్టి రోడ్స్ స్థాయి వ్యక్తి అయినా సరే అనవసరమనే భావన కనిపిస్తోంది.

## విహారి, రహానే అర్ధ సెంచరీలు

### రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 188/5 డిక్లేర్డ్ ● విండీస్ 'ఎ'తో మ్యాచ్ 'డ్రా'



విహారి

**కూలిడ్జ్ (ఆంటిగ్వా):** ప్రాక్టీస్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన భారత వైస్ కెప్టెన్ అజింక్య రహానే రెండో ఇన్నింగ్స్‌లో చక్కటి ఆటతో ఆత్మవిశ్వాసం పెంచుకున్నాడు. విండీస్ 'ఎ'తో 'డ్రా'గా ముగిసిన ఈ మూడు రోజుల మ్యాచ్‌లో రహానే (162 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్)కు తోడు మరో టెస్టు స్పెషలిస్ట్ హనుమ విహారి (125 బంతుల్లో 64; 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా అర్ధ సెంచరీలు సాధించారు. ఫలితంగా భారత్ తమ ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 188 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మయాంక్ అగర్వాల్ (13)తో పాటు రహానే ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. మయాంక్ ఔటైన తర్వాత వచ్చిన విహారితో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. అయితే ఆఫ్‌స్పిన్నర్ అకిమ్ ఫ్రేజర్ (2/43) బౌలింగ్‌కు భారత్ వెంటవెంటనే వికెట్లు కోల్పోయింది. ముందుగా విహారి ఔట్ కాగా... 15 పరుగుల వ్యవధిలో రిషభ్ పంత్ (19), రవీంద్ర జడేజా (9), రహానే ఔటయ్యారు. అనంతరం సాహా (14 నాటౌట్), అశ్విన్ (10) కొద్ది సేపు క్రీజ్‌లో నిలిచాక భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విండీస్ 'ఎ'కు 305 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 'ఎ' 3 వికెట్లు కోల్పోయి 47 పరుగులు చేసిన దశలో... ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించేందుకు అంగీకరించారు.

## నువ్వు పరామర్శిస్తావ్... మళ్లీ అదే చేస్తావ్!

### అక్తర్ వ్యాఖ్యలపై యువీ చురక





**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ తన హుందాతనం చాటేందుకు చేసిన వ్యాఖ్యలకు భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ చురకలతో సమాధానమిచ్చాడు. యాషెస్ రెండో టెస్టు సందర్భంగా ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌన్సర్లతో బెంబేలెత్తించాడు. క్రీజులో ఉన్న స్మిత్‌ను అతని బౌన్సర్లు రెండు సార్లు బలంగా గాయపరిచాయి. దీనిపై షోయబ్ మాట్లాడుతూ 'బౌన్సర్లు ఆటలో భాగమే. కానీ అదే బౌన్సర్ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు బలంగా తాకితే... ఏమైనా గాయమైందో లేదో అతన్ని చూడాలి. కానీ ఆర్చర్ మాత్రం కనీస విజ్ఞత లేకుండా తన మానాన తను వెళ్లిపోవడం ఏం బాగోలేదు' అని ఇంగ్లండ్ పేసర్‌ను తప్పుబట్టాడు. దీనిపై యువరాజ్ స్పందిస్తూ 'నిజమే అక్తర్... నువ్వయితే అలా తడిమి చూసేవాడివి. కానీ అప్పుడక్కడ నీ మాటలెలా ఉంటాయంటే... అయ్యో పాపం దెబ్బతగిలిందా అన్నట్లు కాకుండా కాస్కో మళ్లీ వేస్తా అన్నట్లు ఉంటాయి' అని దెప్పిపొడిచాడు. రెండో టెస్టులో ఆర్చర్ దెబ్బకు స్మిత్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయలేకపోయాడు. అయితే టెస్టు క్రికెట్ చరిత్రలోనే కొత్తగా చేర్చిన నిబంధన వల్ల సబ్‌స్టిట్యూట్ ఆటగాడిగా లబ్‌షేన్ వచ్చి టెస్టులో ఆసీస్‌ను ఓడిపోకుండా కాపాడాడు. దీంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

## జూనియర్ల పంచ్‌కు డజను పతకాలు

### నేషన్స్ కప్ బాక్సింగ్



**న్యూఢిల్లీ:** సెర్బియాలో జరిగిన నేషన్స్ కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత జూనియర్ మహిళా బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నీలో భారత్ 12 పతకాలు సాధించింది. ఇందులో నాలుగేసి చొప్పున స్వర్ణ, రజత, కాంస్య పతకాలున్నాయి. దీంతో భారత బాక్సింగ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. తమన్నా (48 కేజీలు), అంబేశోరి దేవి (57 కేజీలు), ప్రీతి దహియా (60 కేజీలు), ప్రియాంక (66 కేజీలు) బంగారు పతకాలు గెలిచారు. ఫైనల్లో తమన్నా 5-0తో అలెనా ట్రెమసొవా (రష్యా)పై ఏకపక్ష విజయం సాధించడంతో 'ఉత్తమ విదేశీ బాక్సర్' కేటగిరీలో కూడా అవార్డు పొందింది. మిగతా ఫైనల్ బౌట్లలో అంబేశోరి 3-2తో డ్యునా సిపెల్ (స్వీడన్)పై, ప్రీతి దహియా 3-2తో క్రిస్టినా కర్టత్సెవా (ఉక్రెయిన్)పై నెగ్గారు. ప్రియాంక 5-0తో ఓల్గా పెట్రుష్కొ (రష్యా)ను కంగుతినిపించింది. అంజూ దేవి (50 కేజీలు), సిమ్రన్ వర్మ (52 కేజీలు), మాన్సి దలాల్ (75 కేజీలు), తనిశ్‌బిర్ కౌర్ సంధు (80 కేజీలు) రజతాలు నెగ్గగా, ఆత్రేయ (63 కేజీలు), నేహా (54 కేజీలు), ఖుషి (70 కేజీలు), అల్ఫియా (ప్లస్ 80 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. 20 దేశాలకు చెందిన 160 మందికి పైగా బాక్సర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు. ఇందులో 13 మంది సభ్యులతో కూడిన భారత బృందం 12 పతకాలు గెలుపొందడం విశేషం.

## చాంప్స్ మెద్వెదేవ్, కీస్





సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ టోర్నీ

**సిన్సినాటి (అమెరికా):** ప్రతిష్టాత్మక సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా), మహిళల సింగిల్స్ విభాగంలో 16వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) విజేతలుగా నిలిచారు. ఫైనల్స్‌లో మెద్వెదేవ్ 7-6 (7/3), 6-4తో 16వ సీడ్ డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై విజయం సాధించగా... మాడిసన్ కీస్ 7-5, 7-6 (7/5)తో యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ స్వెత్లానా కుజ్‌నెత్సోవా (రష్యా)ను ఓడించింది. మెద్వెదేవ్, కీస్ కెరీర్‌లో అత్యున్నత శ్రేణి టైటిల్స్ ఇవే కావడం విశేషం. చాంపియన్స్ మెద్వెదేవ్‌కు 11,14,225 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 7 కోట్ల 95 లక్షలు)... మాడిసన్ కీస్‌కు 5,44,500 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 కోట్ల 88 లక్షలు) లభించాయి. సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)ను ఓడించిన మెద్వెదేవ్ ఫైనల్లోనూ అదే జోరును కొనసాగించాడు. పది ఏస్‌లను సంధించిన అతను రెండుసార్లు గాఫిన్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. గత రెండు వారాల్లో వాషింగ్టన్ ఓపెన్, మాంట్రియల్ మాస్టర్స్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న 23 ఏళ్ల మెద్వెదేవ్ మూడో ప్రయత్నంలో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన ఐదో రష్యా ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో రష్యా తరఫున సఫిన్, డెవిడెంకో, చెస్నోకోవ్, ఖచనోవ్ ఈ ఘనత సాధించారు. తాజా విజయంతో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో మెద్వెదేవ్ ఐదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 2010లో డెవిడెంకో తర్వాత రష్యా ప్లేయర్ టాప్-5లోకి రావడం ఇదే ప్రథమం.

కుజ్‌నెత్సోవాతో జరిగిన ఫైనల్లో కీస్ రెండు సెట్‌లలోనూ 3-5తో వెనుకబడి పుంజుకోవడం విశేషం. ఫైనల్ చేరే క్రమంలో ఇద్దరు ప్రపంచ మాజీ నంబర్‌వన్స్ హాలెప్ (రొమేనియా), వీనస్ (అమెరికా)లను ఓడించిన కీస్ తుది పోరులోనూ పట్టుదలతో ఆడింది. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో కీస్ 13 ఏస్‌లు సంధించింది. తాజా విజయంతో కీస్ ఏడాది తర్వాత టాప్-10 ర్యాంకింగ్స్‌లోకి వచ్చింది. ఎనిమిది స్థానాలు ఎగబాకిన ఆమె ప్రస్తుతం పదో ర్యాంక్‌లో ఉంది.

# సాక్షి బిజినెస్

మంగళవారం
20-8-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 52 ▲ | 6 ▲ |
| 37,402 | 11,054 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,022 | ▲ 126 |
| డోజోన్స్ | 26,170 | ▲ 283 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,190 | ▲ 73 |
| డాక్స్ | 11,715 | ▲ 153 |
| షాంఘై | 2,883 | ▲ 59 |
| నికాయ్ | 20,563 | ▲ 144 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.35 | 71.99 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.98 | 88.04 |
| యూరో | ఎస్‌బీఐ | 77.49 | 80.38 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.66 | 68.17 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.24 | 49.39 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.52 | 52.26 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.27 | 20.03 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.70 | 20.27 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 09.51 | 10.86 |

## హీరో అధునాతన ఈ-స్కూటర్లు

- ఆప్టిమా ఈఆర్, ఎన్‌వైఎక్స్ ఈఆర్ విడుదల
- ధరల శ్రేణి రూ.68,721– 69,754



**న్యూఢిల్లీ:** ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో ఎలక్ట్రిక్.. హెవీ డ్యూటీ, హై-స్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్లను సోమవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా రెండు అధునాతన స్కూటర్లను రూపొందించి మార్కెట్లోకి విడుదలచేసినట్లు ప్రకటించింది. ఆప్టిమా ఈఆర్, ఎన్‌వైఎక్స్ ఈఆర్ పేర్లతో ఇవి అందుబాటులోకి రాగా, వీటి ధరల శ్రేణి రూ.68,721–రూ.69,754 (ఢిల్లీ–ఎక్స్‌షోరూం)గా నిర్ణయించింది. ఈ వాహనాలకు ఫేమ్–2 పథకం కింద రాయితీ వర్తిస్తుంది. హీరో ఎలక్ట్రిక్ డీలర్ల వద్ద స్కూటర్లు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ సీఈఓ సోహిందర్ గిల్ వివరించారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా బెంగళూరులో కార్పొరేట్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ఈ సందర్భంగా కంపెనీ ప్రకటించింది.

## డెబిట్ కార్డులకు ఇక చెల్లుచీటీ..!

- డిజిటల్ లావాదేవీలకు మరింత ప్రోత్సాహం
- ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్

**ముంబై:** డెబిట్ కార్డుల వినియోగాన్ని క్రమంగా తప్పించే దిశగా బ్యాంకులు కసరత్తు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) క్రమంగా ప్లాస్టిక్ కార్డుల వినియోగాన్ని తగ్గించి డిజిటల్ పేమెంట్ విధానాలను మరింతగా ప్రోత్సహించాలని భావిస్తోంది. తద్వారా డెబిట్ కార్డుల వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని యోచిస్తోంది. సోమవారం జరిగిన బ్యాంకింగ్, ఆర్థిక రంగ సంస్థల వార్షిక సదస్సు ఫిబాక్‌లో పాల్గొన్న సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ ఈ విషయాలు తెలిపారు. 'డెబిట్



కార్డులను పూర్తిగా తొలగించాలని మేం భావిస్తున్నాం. కచ్చితంగా ఇది సాధ్యమేనని విశ్వసిస్తున్నాం' అని ఆయన చెప్పారు. డెబిట్ కార్డుల రహిత దేశంగా భారత్‌ను మార్చడానికి తమ 'యోనో' వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంలు ఉపయోగపడగలవన్నారు. అసలు కార్డు అవసరమే లేకుండా యోనో ప్లాట్‌ఫాం ద్వారా ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని, చెల్లింపులు కూడా జరపవచ్చని ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా 90 కోట్లకు పైగా డెబిట్ కార్డులు, 3 కోట్లకు పైగా క్రెడిట్ కార్డులు వినియోగంలో ఉన్నాయి.

మరోవైపు, కేంద్ర ప్రభుత్వం గతేడాది ప్రకటించిన '59 నిమిషాల్లోనే రుణ మంజూరీ పథకం'పై చిన్న వ్యాపార సంస్థల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదని ఆయన తెలిపారు. అయినప్పటికీ వాహనాలకు.. ముఖ్యంగా కార్లకు కూడా ఈ రుణాలను వర్తింపచేసే అంశాన్ని బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. రూ. 25 కోట్ల దాకా టర్నోవరు ఉండే వ్యాపారవేత్త ఈ పథకం కింద కేవలం 59 నిమిషాల్లోనే రూ. 5 కోట్ల దాకా రుణాలకు సూత్రప్రాయంగా ఆమోదం పొందవచ్చని రజనీష్ కుమార్ వివరించారు.

## రూ.1,571 కోట్ల చెల్లింపుల్లో డీహెచ్‌ఎఫ్‌ఎల్ డిఫాల్ట్

**న్యూఢిల్లీ:** బాండ్లు, కమర్షియల్ పేపర్‌కు సంబంధించి రూ.1,571 కోట్ల చెల్లింపుల్లో డీహెచ్‌ఎఫ్‌ఎల్ కంపెనీ విఫలమైంది. ఎన్‌సీడీ, కమర్షియల్ పేపర్స్‌కు సంబంధించి వడ్డీ చెల్లింపుల్లో విఫలమయ్యామని డీహెచ్‌ఎఫ్‌ఎల్ తెలిపింది. ఇటీవల కాలంలో వివిధ చెల్లింపుల్లో విఫలమవుతూ వస్తున్న డీహెచ్‌ఎఫ్‌ఎల్ కంపెనీకి దాదాపు రూ.90,000 కోట్ల రుణభారముంది.



# మందగమనమే కానీ..!

- అంత బలహీనమేమీ కాదు
- ఆశావాదంవైపు దృష్టి పెట్టాలి
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ పిలుపు
- రుణ రేటు మరింత తగ్గాలని బ్యాంకులకు పిలుపు
- ఎన్‌బీఎఫ్‌సీ రుణ నాణ్యతపై తక్షణ సమీక్ష ఉండబోదు



**ముంబై:** ఆర్థిక వ్యవస్థ నెమ్మదించిన మాట వాస్తవమని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అంగీకరించారు. ఇటు దేశీయంగా, అటు అంతర్జాతీయంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న మాటా వాస్తవమన్నారు. అయితే ప్రతిఒక్కరూ అవకాశాలు, ఆశావాదంపై దృష్టి పెట్టాలితప్ప నిరాశావాదంపై వద్దని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. అధికాదాయ వర్గాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై అధికపన్నులు సహా ఇటీవలి బడ్జెట్ చర్యల అనంతరం పలు కార్పొరేట్ వర్గాలు నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ తాజా ప్రకటన చేశారు. డిపాజిటరీ గణాంకాల ప్రకారం– విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు ఆగస్టు 1 నుంచి 16వతేదీ మధ్య రూ.10,416.25 కోట్ల ఈక్విటీ అమ్మకాలు జరిపారు. డెట్ విషయంలో ఈ విలువ రూ. 2,096.4 కోట్లుగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి, ఎగుమతులు, ఆటోమొబైల్ అమ్మకాల వంటి అన్ని స్థూల గణాంకాలు నిరాశను మిగుల్చుతున్నాయి. ఆయా అంశాలతో 3.5 లక్షల ఉద్యోగాలు పోయినట్లు కూడా గణాంకాలు పేర్కొంటున్నాయి. గడచిన నాలుగు ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షల్లో ఆర్‌బీఐ 110 బేసిస్ పాయింట్ల (1.1 శాతం) రెపో రేటును తగ్గించింది. దీనితో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు తొమ్మిది సంవత్సరాల కనిష్ఠస్థాయి 5.4 శాతానికి చేరినా, ఇది వాస్తవ రూపంలో ఫలితం ఇవ్వడంలేదు. ఇక మార్చి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 5.8 శాతానికి పడిపోవడం మరింత ఆందోళన కలిగిస్తున్న విషయం గమనార్హం. ఆయా అంశాల నేపథ్యంలో గవర్నర్ జాతీయ బ్యాంకింగ్ సదస్సును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- ఆర్‌బీఐ నుంచి అందిన రెపో రేటు ప్రయోజనాన్ని బ్యాంకింగ్ కస్టమర్లకు బదలాయింపు జరగాలి. రుణ రేట్లు మరింత తగ్గాల్సిన అవసరం ఉంది. తమ రుణాలు, డిపాజిట్ రేట్లను రెపోకు అనుసంధానించడానికి బ్యాంకులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- నేను వార్తా పత్రికలు చదువుతున్నా, బిజినెస్ చానల్స్‌ను చూస్తున్నా, తగిన సానుకూల, ఆశావాద పరిస్థితి ప్రతిబింబించడంలేదు. ఆర్థిక వ్యవస్థలో సవాళ్లు ఉన్న మాట నిజమే. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల ప్రభావం నుంచి భారత్ ఒంటరిగా ఉండలేదు.
- అయితే మనం ప్రతికూల పరిస్థితులను చూస్తూ, ఉండిపోకూడదు. ఆశావహ పరిస్థితులు, అవకాశాలపైనా దృష్టి సారించాలి. సవాళ్ల మధ్య పలు అవకాశాలు ఉన్నాయన్న అంశాలన్ని గుర్తించాలి.
- సవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని తట్టుకోగల పరిస్థితుల్లో మన బ్యాంకింగ్ రంగం ఉంది. అయితే బ్యాంకులు తమ మూలధనానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా, క్యాపిటల్ మార్కెట్‌వైపు దృష్టి సారించాలి.
- నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల రుణ నాణ్యతను సమీక్షించబోవడంలేదు.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్పొరేట్ గవర్నెన్స్‌పై తక్షణం దృష్టి సారించాల్సిఉంది.
- బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)ల అంతర్గత సంబంధాలను ఆర్‌బీఐ జాగ్రత్తగా పరిశీలిస్తుంది.

## ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరం

**ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రాజన్**



**న్యూఢిల్లీ:** ఆర్థిక మందగమనం పట్ల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్, బ్యాంకింగ్‌యేతర ఫైనాన్షియల్ రంగాల్లో సమస్యల తక్షణ పరిష్కారంపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రైవేటు రంగ పునరుత్తేజానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనీ సూచించారు. భారత్‌లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు లెక్కింపు విధానంపై తాజాగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వంలో చీఫ్ ఎకనమిస్ట్‌గా పనిచేసిన అరవింద్ సుబ్రమణ్యం జీడీపీ లెక్కలపై చేసిన విమర్శలనూ ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు...

- భారత్ వృద్ధికి సంబంధించి ప్రైవేటు సంస్థల నుంచి వేర్వేరు అంచనాలు వెలువడ్డాయి. వాటిలో అధికభాగం అంచనాలు ప్రభుత్వ అంచనాలకన్నా తక్కువగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే, ఆర్థిక వ్యవస్థ తీవ్ర మందగమనంలో ఉన్నట్లు భావిస్తున్నా.
- 2018–19తో భారత్ ఆర్థిక వృద్ధి 6.8%. 2014–15 తరువాత ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. ప్రభుత్వం 2019–2020లో 7 శాతం వృద్ధి అంచనావేస్తున్నా... అంతకన్నా తక్కువగానే ఉంటుందన్నది పలు ప్రైవేటు సంస్థల అంచనా.
- పలు వ్యాపారాల గురించి ఆందోళన కలిగించే వార్తలే ఉంటున్నాయి. తమకు ఉద్దీపన చర్యలు ఏదో ఒక రూపంలో కావాలని పలు రంగాలు కోరుతున్నాయి.
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి రుణాలు నిజానికి సంస్కరణగా భావించకూడదు. ఇది వ్యూహాత్మక చర్య మాత్రమే.
- ప్రస్తుత వృద్ధికన్నా రెండు, మూడు శాతం అధిక వృద్ధి రేటు సాధన ఎలా అన్న అంశంపైనే మనం దృష్టి సారించాలి. దీనికి పలు రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ల తక్షణ పరిష్కారం జరగాలి. విద్యుత్, నాన్ బ్యాంక్ ఫైనాన్షియల్ రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం ఇందులో కీలకం.

**ప్రాఫిట్ ప్లస్ | డైలీ**

## 'యస్' ఓవర్‌నైట్ ఫండ్

**న్యూఢిల్లీ:** యస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ తాజాగా ఓవర్‌నైట్ ఫండ్ పేరుతో మరో కొత్త స్కీమ్ ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్ ద్వారా సమీకరించిన నిధులను ఒక్క రోజు వ్యవధి ఉండే టీఆర్ఈపీఎస్, ప్రభుత్వ బాండ్లు, ట్రెజరీ బిల్స్ తదితర సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇందులో తక్కువ రిస్కు, అధిక లిక్విడిటీ వెసులుబాటు ఉంటుంది. తదనుగుణంగానే రాబడులు కూడా ఉంటాయి. ఆగస్టు 23తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1,000. ఎంట్రీ,ఎగ్జిట్ లోడ్ లేదు. డెట్ స్కీమ్– ఓవర్‌నైట్ ఫండ్ విభాగంలో ఇది ఓపెన్ ఎండెడ్ స్కీమ్.




# ఇక ఓయో.. కాఫీ!




- ప్రీమియం కాఫీ చెయిన్ ఏర్పాటుకు సన్నాహాలు
- ది ఫ్రెంచ్ ప్రెస్ పేరుతో బ్రాండింగ్
- రెస్టారెంట్లు కూడా ప్రారంభించే యోచన

**ఓయో.. జోరు..** (భారత్, అమెరికా, యూరప్, మలేషియా తదితర దేశాలు)

| | |
|---|---|
| హోటళ్లు | 23,000 |
| వెకేషన్ హోమ్స్ | 46,000 |
| నగరాలు | 800 |

**న్యూఢిల్లీ:** చౌకగా హోటల్ గదులను అందుబాటులోకి తెచ్చిన ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ తాజాగా కొత్త విభాగాల్లోకి ప్రవేశిస్తోంది. ప్రీమియం కాఫీ చెయిన్, రెస్టారెంట్లు ప్రారంభించే ప్రయత్నాల్లో ఉంది. ది ఫ్రెంచ్ ప్రెస్ పేరుతో 50 పైగా ప్రీమియం కాఫీ షాప్‌లను ఏర్పాటు చేసేందుకు ఓయో సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే నాలుగు క్లౌడ్ కిచెన్స్ చేతిలో ఉన్నందున .. వాటి ఊతంతో రెస్టారెంట్ చెయిన్ కూడా ప్రారంభించాలని ఓయో భావిస్తున్నట్లు తెలుస్తోంది. హోటల్ రూమ్స్‌ను చౌకగా అందుబాటులోకి తెచ్చిన కారణంగా ఓయోపై 'చౌక' బ్రాండ్ అనే ముద్ర పడిపోయిన సంగతి తెలిసిందే. కానీ ప్రీమియం కాఫీ చెయిన్‌పై ఈ ముద్ర పడకుండా చూసుకోవాలని ఓయో భావిస్తోంది. అందుకే తన బ్రాండ్ పేరు ఎక్కడా కనిపించకుండా ది ఫ్రెంచ్ ప్రెస్ బ్రాండ్ కింద ఈ కాఫీ చెయిన్‌ను ప్రారంభించాలని భావిస్తోంది. 'ప్రీమియం కాఫీ చెయిన్ విభాగంలో ఎక్కువ సంస్థలు లేకపోవడంతో స్టార్‌బక్స్ వంటి దిగ్గజంతో పోటీపడొచ్చని, ఇందుకు కావల్సిన పూర్తి సామర్థ్యాలు తమకున్నాయని ఓయో భావిస్తోంది. అయితే, ఓయో అంటే చౌకైన, అందుబాటు ధర బ్రాండ్ అనే ముద్ర ఉన్న సంగతి కూడా దానికి తెలుసు. అందుకే కాస్త ఖరీదైన ఈ టార్గెట్ మార్కెట్ కోసం ఓయో బ్రాండింగ్ వాడకూడదని నిర్ణయించుకుంది' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**ఇప్పటికే ట్రయల్ రన్..**

ఓయో ఇప్పటికే ఓయో టౌన్‌హౌసెస్ హోటళ్లలో ది ఫ్రెంచ్ ప్రెస్ ఔట్‌లెట్స్‌ను కొన్నింటిని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. పెద్ద మాల్స్, కాస్త ఖరీదైన ఏరియాల్లో మరికొన్నింటిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే భారీ ఆఫీస్ కాంప్లెక్స్‌ల్లోని ఓయో కో–వర్కింగ్ స్పేస్‌లలోనూ వీటిని ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఈ వార్తలను ధృవీకరించేందుకు ఓయో నిరాకరించింది. ఫుడ్ అండ్ బేవరేజెస్ వ్యాపారంలో కూడా తమ కార్యకలాపాలు ఉన్నాయని, ఫుల్ సర్వీస్ హోటల్స్‌లో నిర్వహించే కిచెన్స్ ద్వారా తమ ఆదాయంలో 25 శాతం వాటా వస్తోందని పేర్కొంది. ప్రస్తుతానికి మాత్రం మిగతా కార్యకలాపాల విస్తరణపై స్పందించబోమని వివరించింది.

**ప్రీమియం రెస్టారెంట్లపై దృష్టి..**

ఓయో ఇప్పటికే అద్రక్, ఓ బిరియానీ, పరాతా పండిట్, మాస్టర్ ఆఫ్ మోమోస్ పేరుతో నాలుగు క్లౌడ్ కిచెన్ బ్రాండ్స్ నిర్వహిస్తోంది. ది ఫ్రెంచ్ ప్రెస్ కాఫీ చెయిన్‌ను విస్తరించిన తర్వాత ప్రీమియం రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేయాలని ఓయో ప్రణాళికలు రూపొందిస్తోంది. తమ సొంత హోటళ్లు, కో–వర్కింగ్ ప్రాపర్టీలు, స్టాండెలోన్ రెస్టారెంట్లలోనూ వీటిని ప్రారంభించాలని భావిస్తోంది. ఈ రెస్టారెంట్ల కోసం క్లౌడ్ కిచెన్స్ సేవలను ఉపయోగించుకోవాలని ఓయో యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## జూన్‌లో 'జియో' హవా

- 82.6 లక్షల నూతన సబ్‌స్క్రైబర్లు
- 41.75 లక్షల సబ్‌స్క్రైబర్లను కోల్పోయిన వొడాఫోన్ ఐడియా




**న్యూఢిల్లీ:** నూతన సబ్‌స్క్రైబర్లను జతచేసుకుంటూ జర్నీని కొనసాగించడంలో ముకేశ్ అంబానీ సారథ్యంలోని 'రిలయన్స్ జియో' వాయువేగంతో దూసుకెళ్తోంది. ఇటీవలే సబ్‌స్క్రైబర్ల పరంగా భారతీ ఎయిర్‌టెల్‌ను వెనక్కునెట్టి రెండవ స్థానానికి చేరిన ఈ సంస్థ.. జూన్‌లో 82.68 లక్షల నూతన సబ్‌స్క్రైబర్లను జతచేసుకుంది. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం.. జూన్‌లో వొడాఫోన్ ఐడియా 41.45 లక్షల సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, భారతీ ఎయిర్‌టెల్ 29,883 కస్టమర్లను వదులుకోవాల్సి వచ్చింది. జూన్ చివరినాటికి మొత్తం సబ్‌స్క్రైబర్ల పరంగా.. వొడాఫోన్ ఐడియాకు 38.34 కోట్లు (32.9% మార్కెట్ వాటా), జియోకు 33.12 కోట్లు (28.42%), ఎయిర్‌టెల్‌కు 32.03 కోట్లు (27.49%) ఉన్నాయి.

# కార్పొరేట్ ట్యాక్స్ క్రమంగా తగ్గిస్తాం

## ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభయం

**న్యూఢిల్లీ:** సుమారు రూ. 400 కోట్ల పైగా టర్నోవరు ఉండే కంపెనీలపై కార్పొరేట్ ట్యాక్స్ రేటును క్రమంగా 25 శాతానికి తగ్గిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. సంపద సృష్టికర్తలకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె తెలిపారు. జీవనాన్ని మరింత సులభతరం చేసే ఉద్దేశంతోనే ప్రతీ విధానం, ప్రతీ పథకాన్ని తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వివరించారు. 'ప్రస్తుతం కేవలం 0.7 శాతం సంస్థలే గరిష్ట కార్పొరేట్ ట్యాక్స్ రేటు పరిధిలో ఉన్నాయి. దీర్ఘకాలంలో వీటికి కూడా ట్యాక్స్ రేటును 25 శాతం పరిధిలోకి తెస్తాము' అని ఆమె చెప్పారు. అయితే, ఎప్పటిలోగా ఇది అమలు చేసేదీ మాత్రం స్పష్టమైన గడువేదీ మంత్రి పేర్కొనలేదు. గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 400 కోట్ల దాకా వార్షిక టర్నోవరు ఉన్న సంస్థలకు కార్పొరేట్ ట్యాక్స్ రేటును 30 శాతం నుంచి 25 శాతానికి కేంద్రం తగ్గించిన సంగతి తెలిసిందే. జీవనాన్ని మరింత సులభతరం చేసే ఉద్దేశంతోనే ప్రతీ విధానం, ప్రతీ పథకాన్ని తీర్చిదిద్దుతున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ తన వార్షిక స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసం సందర్భంగా సంపద సృష్టించే వారి పాత్రను కొనియాడారు. వారిని అనుమానాస్పదంగా చూడొద్దని చెప్పారు. సంపద సృష్టి జరిగితేనే, దానిని పంపిణీ చేయడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. సంపద సృష్టించడం అత్యవసరమని, సంపద సృష్టించేవారే భారత సంపద అని, వారిని గౌరవిస్తామని తన ప్రసంగంలో ప్రధాని ఉద్ఘాటించారు.

**న్యూస్‌ప్రింట్‌పై సుంకం తగ్గించం**

న్యూస్‌ప్రింట్‌పై విధించిన 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలన్న డిమాండ్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. చౌక దిగుమతుల కారణంగా దేశీయ న్యూస్‌ప్రింట్ కంపెనీలు దెబ్బతింటున్నాయని, దేశీయ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వడం కోసమే బడ్జెట్‌లో ఈ సుంకాన్ని విధించామని వివరించారు. ఇప్పటి దాకా న్యూస్‌ప్రింట్‌పై ఎలాంటి దిగుమతి సుంకాలు లేవని, ఈ 10 శాతం కస్టమ్స్ సుంకాల వల్ల లాభదాయకత దెబ్బతింటుందని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ పేర్కొంది. కాగా భారత్‌లో న్యూస్‌ప్రింట్ వార్షిక వినియోగం 2.5 మిలియన్ టన్నులుగా ఉంది. దేశీయ పరిశ్రమ 1 మిలియన్ టన్నుల న్యూస్‌ప్రింట్‌ను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతోంది.



కొత్త డీటీసీపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు నివేదికను అందిస్తున్న కమిటీ హెడ్ అఖిలేష్ రంజన్, ఇతర సభ్యులు

## కొత్త పన్నుల చట్టంపై కేంద్రానికి నివేదిక

**న్యూఢిల్లీ:** ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టదల్చుకున్న ప్రత్యక్ష పన్నుల స్మృతి (డీటీసీ)పై నివేదికను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సోమవారం కేంద్రానికి సమర్పించింది. 'టాస్క్‌ఫోర్స్ కన్వీనర్ అఖిలేష్ రంజన్ సోమవారం కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేశారు' అని మైక్రోబ్లాగింగ్ సైటు ట్విట్టర్‌లో ఆర్థిక శాఖ ట్వీట్ చేసింది. అయితే, నివేదిక వివరాలేవీ వెల్లడి కాలేదు. ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం రూపొందిన ఆదాయపు పన్ను చట్టానికి కాలం చెల్లిందని, దాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సిన అవసరం ఉందని 2017 సెప్టెంబర్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారుల వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. దీంతో దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రత్యక్ష పన్నుల స్మృతిని రూపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. మిగతా దేశాల్లో అనుసరిస్తున్న విధానాలు కూడా అధ్యయనం చేసి అంతర్జాతీయంగా ఉత్తమ ప్రమాణాలతో దీన్ని తయారు చేయాలని ప్రభుత్వం సూచించింది.

ఇది వాస్తవానికి ఆరు నెలల వ్యవధిలో 2018 మే 22 నాటికి నివేదిక సమర్పించాల్సి ఉన్నప్పటికీ.. ఆగస్టు 22 దాకా కేంద్రం గడువు పొడిగించింది. కన్వీనర్ అరబింద్ మోదీ 2018 సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికల్లా నివేదికను సమర్పించే బాధ్యతను అఖిలేష్ రంజన్ సారథ్యంలోని కమిటీకి అప్పగించింది. కమిటీలో కొత్త సభ్యులు మరింత సమయం కోరడంతో దీన్ని ఆ తర్వాత మే 31కి, అటు పైన ఆగస్టు 16 నాటికి పొడిగించింది. గిరీష్ అహూజా (సీఏ), రాజీవ్ మెమానీ (ఈవై రీజనల్ మేనేజింగ్ పార్ట్‌నర్, చైర్మన్) తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

# పనిగంటలు తగ్గడం ఆందోళనకరం

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- 'ఉపాధి హామీ'ని వ్యవసాయంతో అనుసంధానించాలి

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో మానవ వనరుల పనిగంటలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు విజ్ఞప్తి చేసినా, పార్టీ పరంగా విన్నవించినా కేంద్రం స్పందించడంలేదని అన్నారు.



వ్యవసాయ పనిముట్లు, యంత్రాల వినియోగంపై ఆగ్రోస్ ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని సోమవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో మంత్రి ఆవిష్కరించారు. రైతుల పెట్టుబడి తగ్గి, ఆదాయం పెరగాలని, ప్రజల ఆహార అవసరాల నిమిత్తం వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. టీఎస్ ఆగ్రోస్ ఆధ్వర్యంలో యాంత్రీకరణపై రైతులకు జిల్లాలవారీగా సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. తొలుత సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్, తర్వాత వనపర్తి, అనంతరం ఇతర జిల్లాల్లో రైతు సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్)ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. రైతుబంధు పథకంపై ఎవరికీ అపోహలు అక్కర్లేదని, ఈ ఖరీఫ్‌లో ప్రతిరైతు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. ఇంకో రూ.2 వేల కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయన్నారు.

### బీజేపీ నేతలకు తగదు...

రాష్ట్రం మీద విషం కక్కే పనులు చేయడం బీజేపీ నేతలకు తగదని, ఎన్నికుట్రలు చేసినా కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. దేశానికి దారిచూపే రాష్ట్ర పథకాలకు రూ. 24 వేల కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని కేంద్రానికి నీతిఆయోగ్ సూచించినా 24 రూపాయలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. నిధులివ్వడం చేతకాని వాళ్లు విమర్శించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును 3 ఏళ్లలో పూర్తి చేసి రైతులకు నీళ్లు అందిస్తున్నారని కేంద్ర ఉన్నతాధికారులు ప్రశంసిస్తుంటే బీజేపీ నేతలు నీతిమాలిన ఆరోపణలతో తెలంగాణ ఖ్యాతిని తగ్గించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్ రావు మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒకటి చొప్పున కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ ఎండీ సురేందర్, అగ్రి యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి, ఆగ్రోస్ జీఎం రాజ్‌మోహన్, ఏడీ కనకరాజు, సంజీవరెడ్డి, వివిధ జిల్లాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం వరద తగ్గుముఖం పట్టడంతో మూసుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ గేట్లు

# తగ్గుతున్న వరద

**సాక్షి, హైదరాబాద్:** కొన్నిరోజులుగా లక్షల క్యూసెక్కులతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. వర్షాలు తగ్గడంతో బేసిన్‌లో ఎగువన ఆల్మట్టికి ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గింది. దీంతో దిగువన నారాయణపూర్, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు కూడా వరద తగ్గుతుండటంతో ప్రాజెక్టుల్లో గేట్లను ఒకొక్కటిగా మూసివేస్తూ నీటి నిల్వల పెంపుదలపై అధికారులు దృష్టిసారించారు. ఆల్మట్టి పూర్తిస్థాయి నిల్వ 129 టీఎంసీలుకాగా 120 టీఎంసీల్లో నిల్వ ఉంచి మిగతా నీటిని దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్‌లోనూ గేట్లు మూసివేసి నీటిమట్టాన్ని పెంచుతున్నారు. శ్రీశైలం జలాశయానికి సోమవారం 3.16 లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు అవుట్‌ఫ్లోను కూడా తగ్గించి 2.45 లక్షల క్యూసెక్కులను దిగువన సాగర్‌కు వదులుతున్నారు. సాగర్‌లో ప్రస్తుతం 301 టీఎంసీల నీటి నిల్వ ఉండగా 4.21 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆ నీటినంతా దిగువకు వదిలేస్తున్నారు.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా.. (నిల్వ-టీఎంసీల్లో, ప్రవాహాలు-క్యూసెక్కుల్లో)**

| ప్రాజెక్టు | పూర్తి నిల్వ | ప్రస్తుత నిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 120.87 | 1,94,000 | 2,00,000 |
| నారాయణపూర్ | 37.646 | 33.34 | 2,00,000 | 1,87,410 |
| జూరాల | 9.65 | 9.11 | 2,50,000 | 1,98,020 |
| శ్రీశైలం | 215.807 | 204.79 | 3,16,620 | 2,45,554 |
| తుంగభద్ర | 100.86 | 100.70 | 26,818 | 9,180 |
| ఉజ్జయిని | 117.24 | 117.24 | 8,822 | 15,950 |
| నాగార్జునసాగర్ | 312.045 | 301.36 | 4,21,838 | 4,21,838 |
| పులిచింతల | 45.77 | 36 | 2,99,247 | 2,09,046 |

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**నూతన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి టీజీటీఏ వినతి**

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) ప్రభుత్వాన్ని కోరింది. రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగిందని, రెవెన్యూశాఖల్లో ఖాళీల భర్తీతో పాటు శాఖాపరంగా సేవలను విస్తృతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈమేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను కలసి టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం కుమార్ వినతిపత్రం సమర్పించారు. స్పెషల్ సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్‌ను టీజీటీఏ బృందం ఈ సందర్భంగా అభినందించింది.







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com